మూసీ ప్రక్షాళనకు మేము వ్యతిరేకం కాదు

- గాంధీ సరోవరం పేరిట పేదల ఇళ్లు కూల్చడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్న రాంచందర్ రావు
- కాంగ్రెస్ పార్టీ తమపై తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపణ
- విపక్షాల 'మాక్ పార్లమెంట్' ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని విమర్శ

హైదరాబాద్ పెన్ పవర్:మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టును బీజేపీ అడ్డుకుంటోందని కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు మండిపడ్డారు. మూసీ ప్రక్షాళనను తమ పార్టీ వ్యతిరేకించడం లేదని, అయితే 'గాంధీ సరోవరం' పేరిట పేదల ఇళ్లను కూల్చివేయడాన్ని మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఈరోజు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాంచందర్ రావు మాట్లాడారు. పేదల ఇళ్లకు ఎలాంటి నష్టం జరగకుండా మూసీని శుభ్రపరిచే ప్రణాళికలు ప్రభుత్వం సిద్ధం చేయాలని సూచించారు. ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు ఇవ్వడానికి నిధులు లేవని చెబుతున్న ప్రభుత్వం, మూసీ ప్రక్షాళన పేరుతో వేల కోట్లు ఖర్చు చేయడానికి సిద్ధమవ్వడం విచిత్రంగా ఉందన్నారు. ఈ ప్రాజెక్టుకు ఇంత పెద్ద మొత్తంలో

- మిగతా 5లో...

పెన్ పవర్

హైదరాబాద్‌ను ముంచెత్తిన భారీ వర్షం.. నగర జీవనం అస్తవ్యస్తం

- హైదరాబాద్‌ను ముంచెత్తిన కుండపోత వర్షం
- ప్రధాన రహదారులన్నీ జలమయం
- పలు ప్రాంతాల్లో గంటల తరబడి నిలిచిపోయిన ట్రాఫిక్
- ఇళ్లకు వెళ్లే వేళ ఉద్యోగులు, ప్రయాణికుల తీవ్ర ఇబ్బందులు
- ఎండ వేడిమి నుంచి నగరవాసులకు ఊరట

హైదరాబాద్ పెన్ పవర్:శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. అకస్మాత్తుగా కురిసిన కుండపోత వానతో నగర జీవనం అస్తవ్యస్తంగా మారింది. గంటకు పైగా ఏకధాటిగా వర్షం పడటంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. డ్రైనేజీలు పొంగిపొర్లడంతో పలు లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి.నగరంలోని ఖైరతాబాద్, పంజాగుట్ట, సోమాజిగూడ, అమీర్‌పేట్, ఎస్ఆర్ నగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిల్మ్ నగర్ వంటి ప్రధాన ప్రాంతాల్లో రోడ్లపైకి భారీగా వరద నీరు చేరింది. దీంతో ఆఫీసుల నుంచి ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాయంత్రం రద్దీ సమయం కావడంతో ట్రాఫిక్ కష్టాలు రెట్టింపయ్యాయి.ముఖ్యంగా ఐటీ కారిడార్‌లో పరిస్థితి తీవ్రంగా మారింది. మాదాపూర్, హైటెక్‌సిటీ, కేపీహెచ్‌బీ,

- మిగతా 5లో...

జీడిమెట్ల ఫాక్స్‌సాగర్ చెరువును సందర్శించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్..

- చారిత్రాత్మక చెరువు ఫాక్స్‌సాగర్‌కు పూర్వవైభవం.. ఆక్రమణ దారులకు హైడ్రా హెచ్చరిక..!
- 1897లో ఏర్పాటైన ఫాక్స్‌సాగర్.. 490--500 ఎకరాల విస్తీర్ణంలో సరస్సు..
- ఎఫ్‌టీఎల్ పరిధి పూర్తి స్థాయిలో నోటిపై చేసి అక్రమ కట్టడాల తొలగింపు..
- అక్రమ బోరుబావుల తొలగింపులో ఎవరికీ మినహాయింపు లేదు..
- ఇన్‌లెట్లు, అవుట్‌లెట్లు మూసుకు పోవడంతో 10--15 అడుగుల మేర పూడిక..
- తొలిదశలో రూ.75 కోట్లతో అభివృద్ధి.. మినీ ట్యాంక్‌బండ్, పార్కులు, టూరిజం హబ్‌గా ఫాక్స్‌సాగర్..
- 100-150 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు గుర్తింపు.. త్వరలో చర్యలకు సన్నాహాలు..
- ఎఫ్‌టీఎల్-బఫర్ జోన్ పరిధిలో అక్రమ నిర్మాణాల తొలగింపుకు హైడ్రా సిద్ధం..
- మినీ ట్యాంక్‌బండ్‌గా.. టూరిజం హబ్‌గా తీర్చిదిద్దే ప్రణాళిక..!
- నవంబర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన, 2027 అక్టోబర్ నాటికి అందుబాటులో..

ఫాక్స్‌సాగర్‌కు మహర్దశ..

రూ.75 కోట్లతో తొలిదశ అభివృద్ధి పనులు..!



ఎట్టకేలకు చారిత్రక ఫాక్స్‌సాగర్ చెరువుకు మంచి రోజులు వచ్చాయి, పర్యాటక కేంద్రంగా అభివృద్ధికి ప్రణాళిక సిద్ధమైంది.. దీంతో శుక్రవారం హైడ్రా కమిషనర్ ఏవి.రంగనాథ్ జీడిమెట్ల గ్రామ పరిధిలోని ఫాక్స్‌సాగర్ చెరువును, సంబంధిత అధికారులతో కలిసి సందర్శించారు. బ్రిటిష్ సైనికుల త్రాగునీటి కోసం 1897లో ఫాక్స్‌సాగర్ చెరువును ఏర్పాటు చేసినట్టు శిలాఫలకంపై చెక్కిన ఆనవాళ్ళు ఉన్నాయి.. అదేవిధంగా 1899లో చెరువు నాలా, అలుగు (సర్‌ప్లస్) నాలా నిర్మించినట్టు స్పష్టంగా కనిపిస్తుంది.. అయితే హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలనలో వీస్తూపోయే నిజాలు బట్టబయలు అయ్యాయని గుర్తించారు.. చెరువు ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్ దాదాపు 100-150 ఎకరాలు ఆక్రమణకు గురికాగా..! చెరువుకు సంబంధించిన రెండు నాలాలు 10-15 అడుగులు ఎత్తు మట్టి పూడికలో మూసుకు పోయినట్లు స్పష్టం చేశారు.. 1897-99 మధ్య కాలంలో చెరువుతో పాటు, ఎంతటి వరదలు సంభవించినా తట్టుకునే విధంగా, అత్యంత వెడల్పుతో, మూసీనదిలో కలిపేవిధంగా దాదాపు 200 అడుగుల వెడల్పుతో నాలాలు ప్రవహించేవి అని స్థానికులు చెబుతున్న చరిత్ర.. అలాంటి ఫాక్స్‌సాగర్ నాలాలు, కబ్జాదారుల ఆక్రమణలతో, పూర్తిగా కుచించుకు పోయిన చారిత్రక ఆనవాళ్ళు కాపాడాలని కోరుతున్నారు.. హైడ్రా కమిషనర్ రంగనాథ్ నాలాల ఆక్రమణపై దృష్టి సారించి, భవిష్యత్తు వరద విపత్తుల నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు..

కుత్బుల్లాపూర్, పెన్ పవర్, అక్టోబర్ 30:

-4లో

550 ఎకరాలపై కాంగ్రెస్ కన్ను..

రూ.60 వేల కోట్ల భూముల అమ్మకానికి కుట్ర?

హైదరాబాద్ పెన్ పవర్:మియాపూర్‌లోని 550 ఎకరాల ప్రభుత్వ భూముల వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఈ భూములను కాపాడేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సుదీర్ఘంగా న్యాయపోరాటం చేసిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు తెలిపారు. అయితే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అదే భూములను విక్రయించేందుకు ప్రయత్నిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఆరోపణలు గుప్పించారు.

ఎనిమిదేళ్ల పోరాటంతో భూముల పరిరక్షణ

మియాపూర్ భూ వివాదం 2003లోనే సుప్రీంకోర్టుకు చేరిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత అప్పటి సీఎం కేసీఆర్ ఈ భూముల అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టారని చెప్పారు. 2015లో సీనియర్ న్యాయవాది సీ.ఎస్. వైద్యనాథన్‌ను నియమించి ప్రభుత్వ భూముల పరిరక్షణకు న్యాయపోరాటం ప్రారంభించినట్లు వివరించారు. 2023 వరకు దాదాపు ఎనిమిదేళ్ల పాటు ఈ పోరాటం కొనసాగిందని తెలిపారు.

సుప్రీంకోర్టు తీర్పుపై వివరణ

ట్రినిటీ ఇన్‌ఫ్రావెంచర్స్ కేసులో 2023 జూన్ 15న తెలంగాణ ప్రభుత్వం సాధించిన విజయాన్ని కూడా హరీశ్‌రావు ప్రస్తావించారు. ఆ కేసులో వచ్చిన చట్టపరమైన అంశాలు మియాపూర్ భూముల వ్యవహారంలో కీలకంగా నిలిచాయని పేర్కొన్నారు. సుప్రీంకోర్టుకు సమర్పించిన పిటిషన్లు, అఫిడవిట్లు, ఆధారాలు నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన కృషికి నిదర్శనమని అన్నారు.

రూ.60 వేల కోట్ల భూముల విక్రయంపై ఆరోపణలు

మియాపూర్‌లోని 550 ఎకరాల విలువ రూ.60 వేల కోట్లకు పైగా ఉంటుందని ముఖ్యమంత్రే గతంలో చెప్పారని హరీశ్‌రావు గుర్తుచేశారు. ఇంతటి విలువైన ప్రభుత్వ ఆస్తులను అమ్మేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. భూముల విక్రయంపై ప్రజల్లో వ్యతిరేకత రాకుండా ఉండేందుకే గత ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. భవిష్యత్తు తరాలకు ఉపయోగపడాల్సిన ప్రభుత్వ భూములను విక్రయించే ఆలోచనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

పనిలేక తిరుగుతున్నానా? ..

రేవంత్ సర్కార్‌ను కూల్చేదాకా ఆగను

- జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ తరలింపు కోసం ఈటల పాదయాత్ర
- ప్రభుత్వాన్ని కూల్చే వరకు తన యాత్ర ఆగదని హెచ్చరిక
- నిధులు తేలేకపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్
- డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ సిద్ధం చేయాలని డిమాండ్
- డంపింగ్ యార్డ్ వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని ఆవేదన

హైదరాబాద్ పెన్ పవర్:జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌ను తరలించాలనే డిమాండ్‌తో బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ చేపట్టిన పాదయాత్ర ఉద్రిక్తంగా సాగుతోంది. ఈ క్రమంలో ఆయన రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేవలం డంపింగ్ యార్డ్ తరలించేంతవరకే కాదు, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే వరకు తన యాత్ర ఆగదని ఆయన హెచ్చరించారు.పనిలేక తిరుగుతున్నానంటూ కాంగ్రెస్ నేతలు చేస్తున్న విమర్శలపై ఈటల ఘాటుగా స్పందించారు. "డంపింగ్ యార్డ్ తొలగింపు కోసం నేను పాదయాత్ర చేస్తుంటే, ఈటల రాజేందర్‌కు పనిలేక తిరుగుతున్నాడని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. కేవలం డంపింగ్ యార్డ్ తరలించేదాకా మాత్రమే కాదు.. మీ ప్రభుత్వం కూలిపోయే వరకు నేను తిరుగుతూనే ఉంటా" అని ఆయన స్పష్టం చేశారు.జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ రీసైక్లింగ్ కోసం అయ్యే ఖర్చుపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) సిద్ధం చేయాలని ఈటల డిమాండ్ చేశారు. నివేదిక ఇస్తే, ప్రధానమంత్రి మోదీని ఒప్పించి అవసరమైన నిధులను తానే తీసుకొస్తానని ప్రకటించారు. ఒకవేళ తాను నిధులు తీసుకురావడంలో విఫలమైతే, రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని సవాల్ విసిరారు.అక్టోబర్ 27న ఏదులాబాద్‌లోని శ్రీరంగనాథ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఈటల తన పాదయాత్రను ప్రారంభించారు. డంపింగ్ యార్డ్ కాలుష్యం వల్ల పరిసర గ్రామాలు, కాలనీల్లోని ప్రజల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటోందని, గాలి, భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని, తక్షణమే దాన్ని తరలించాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు.

జీడిమెట్ల ఫాక్స్‌సాగర్ చెరువును సందర్శించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్..

- చారిత్రాత్మక చెరువు ఫాక్స్‌సాగర్‌కు పూర్వవైభవం.. ఆక్రమణ దారులకు హైడ్రా హెచ్చరిక..!
- 1897లో ఏర్పాటైన ఫాక్స్‌సాగర్.. 490--500 ఎకరాల విస్తీర్ణంలో సరస్సు..
- ఎఫ్‌టీఎల్ పరిధి పూర్తి స్థాయిలో నోటిఫై చేసి అక్రమ కట్టడాల తొలగింపు..
- అక్రమ బోరుబావుల తొలగింపులో ఎవరికీ మినహాయింపు లేదు..
- ఇన్‌లెట్లు, అవుట్‌లెట్లు మూసుకు పోవడంతో 10--15 అడుగుల మేర పూడిక..
- తొలిదశలో రూ.75 కోట్లతో అభివృద్ధి.. మినీ ట్యాంక్‌బండ్, పార్కులు, టూరిజం హబ్‌గా ఫాక్స్‌సాగర్..
- 100-150 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు గుర్తింపు.. త్వరలో చర్యలకు సన్నాహాలు..
- ఎఫ్‌టీఎల్-బఫర్ జోన్ పరిధిలో అక్రమ నిర్మాణాల తొలగింపుకు హైడ్రా సిద్ధం..
- మినీ ట్యాంక్‌బండ్‌గా.. టూరిజం హబ్‌గా తీర్చిదిద్దే ప్రణాళిక..!
- నవంబర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన, 2027 అక్టోబర్ నాటికి అందుబాటులో..

ఫాక్స్‌సాగర్‌కు మహర్దశ..

రూ.75 కోట్లతో తొలిదశ అభివృద్ధి పనులు..!

ఎట్టకేలకు చారిత్రక ఫాక్స్‌సాగర్ చెరువుకు మంచి రోజులు వచ్చాయి, పర్యాటక కేంద్రంగా అభివృద్ధికి ప్రణాళిక సిద్ధమైంది.. దీంతో శుక్రవారం హైడ్రా కమిషనర్ ఏవి.రంగనాథ్ జీడిమెట్ల గ్రామ పరిధిలోని ఫాక్స్‌సాగర్ చెరువును, సంబంధిత అధికారులతో కలిసి సందర్శించారు. బ్రిటిష్ సైనికుల త్రాగునీటి కోసం 1897లో ఫాక్స్‌సాగర్ చెరువును ఏర్పాటు చేసినట్లు శిలాపలకంపై చెక్కిన ఆనవాళ్ళు ఉన్నాయి.. అదేవిధంగా 1899లో చెరువు నాలా, అలుగు (సర్‌ప్లస్) నాలా నిర్మించినట్లు స్పష్టంగా కనిపిస్తుంది.. అయితే హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలనలో విస్తుపోయే నిజాలు బట్టబయలు అయ్యాయని గుర్తించారు.. చెరువు ఎఫ్‌టిఎల్ బఫర్ జోన్ దాదాపు 100-150 ఎకరాలు ఆక్రమణకు గురికాగా..! చెరువుకు సంబంధించిన రెండు నాలాలు 10-15 అడుగులు ఎత్తు మట్టి పూడికలో మూసుకు పోయినట్లు స్పష్టం చేశారు.. 1897-99 మధ్య కాలంలో చెరువుతో పాటు, ఎంతటి వరదలు సంభవించినా తట్టుకునే విధంగా, అత్యంత వెడల్పుతో, మూసీనదిలో కలిపేవిధంగా దాదాపు 200 అడుగుల వెడల్పుతో నాలాలు ప్రవహించేవి అని స్థానికులు చెబుతున్న చరిత్ర.. అలాంటి ఫాక్స్‌సాగర్ నాలాలు, కబ్జాదారుల ఆక్రమణలతో, పూర్తిగా కుచించుకు పోయిన చారిత్రక ఆనవాళ్ళు కాపాడాలని కోరుతున్నారు.. హైడ్రా కమిషనర్ రంగనాథ్ నాలాల ఆక్రమణపై దృష్టి సారించి, భవిష్యత్తు వరద విపత్తుల నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.. **కుత్బుల్లాపూర్, పెన్ పవర్, అక్టోబర్ 30:**

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం జీడిమెట్ల గ్రామ పరిధిలోని చారిత్రక ఫాక్స్‌సాగర్ చెరువుకు మహర్దశ పట్టింది.. జీడిమెట్ల పరిధిలోని ఈ ఫాక్స్‌సాగర్ చెరువును పూర్తిస్థాయిలో పునరుద్ధరించి, సుందరమైన మినీ ట్యాంక్‌బండ్‌గా, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు హైడ్రా కార్యాచరణ సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ హైడ్రా బృందంతో కలిసి ఫాక్స్‌సాగర్ చెరువును సందర్శించి అభివృద్ధి పనులపై క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు.. ఇటీవల తొలగించిన బోరుబావులు, చెరువు పునరుద్ధరణకు చేపట్టాల్సిన పనులు, ఇన్‌లెట్లు, అవుట్‌లెట్ల పరిస్థితిని పరిశీలించారు. సుమారు రూ.75 కోట్ల వ్యయంతో తొలి దశ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు.. 1897-99లో ఏర్పాటైన జీడిమెట్ల ఫాక్స్‌సాగర్ చెరువు చారిత్రక ప్రాధాన్యత కలిగిన జలవనరుగా పేరుగాంచింది.. ప్రస్తుతం ఈ సరస్సు సుమారు 490 నుంచి 500 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.. అయితే 2014లో హెచ్ఎండీఏ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం చెరువు విస్తీర్ణం 485 నుంచి 486 ఎకరాలుగా నమోదైనట్లు తెలిపారు. ఇంతటి విశాలమైన జలవనరు కాలక్రమేణా ఆక్రమణలకు గురైందని, చెరువు పరిధిలో దాదాపు 100 నుంచి 150 ఎకరాల వరకు కబ్జాలకు గురైనట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు.. చెరువు భూముల్లో ప్లాట్లు వేసి, కాంపౌండ్ వాల్స్ నిర్మించుకున్నారని పేర్కొన్నారు..

ఆక్రమణలపై ఉక్కుపాదం.. ఎఫ్‌టీఎల్ పరిధిలో కఠిన చర్యలు..!

చెరువుల ఆక్రమణలే నగరంలో తీవ్ర వరదలు, మంచినీటి ఎద్దడి సమస్యలకు ప్రధాన కారణమవుతున్నాయని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. ఫాక్స్ సాగర్ చెరువు ఎఫ్‌టీఎల్, పరిధిని పూర్తి స్థాయిలో నోటిఫై చేసి, కొన్నేళ్లుగా చెరువు పరిధిని ఆక్రమించిన అక్రమ కట్టడాలపై తక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.. ఎంతకాలంగా ఆక్రమణల్లో ఉన్నప్పటికీ, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన కట్టడాల విషయంలో ఎలాంటి మినహాయింపులు ఉండబోవని స్పష్టం చేశారు.. ఇటీవల అక్రమ బోరుబావుల తొలగింపును కూడా పరిశీలించిన ఆయన, ఈ ప్రక్రియలో ఎవరికీ ప్రత్యేక

నవంబర్‌లో శంకుస్థాపన.. వచ్చే అక్టోబర్ నాటికి అందుబాటులో..

ఫాక్స్‌సాగర్ పునరుద్ధరణ, అభివృద్ధి పనులకు తొలి దశలో సుమారు రూ.75 కోట్లు ఖర్చు చేయనున్నట్లు కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు. వచ్చేనెలలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.. వచ్చే సంవత్సరం అక్టోబర్ నాటికి మంచినీటితో కళకళలాడే ఫాక్స్‌సాగర్ సరస్సును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని హైడ్రా కమిషనర్ పేర్కొన్నారు.. చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఫాక్స్ సాగర్‌కు పూర్వవైభవం తీసుకురావడంతో పాటు ఆక్రమణల చెర నుంచి విముక్తి కల్పించి, పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేయాలన్న హైడ్రా లక్ష్యం ఎంతవరకు కార్యరూపం దాలుస్తుందో వేచి చూడాలి.

10-15 అడుగుల మేర పూడికతో.. మూసుకుపోయిన ఇన్‌లెట్లు, అవుట్‌లెట్లు..

ఫాక్స్‌సాగర్ చెరువు ప్రస్తుతం అనేక సమస్యలతో సతమతమవుతోందని క్షేత్రస్థాయి పరిశీలనలో వెల్లడైంది. చెరువులోకి నీరు చేరే ఇన్‌లెట్లు, బయటకు వెళ్లే అవుట్‌లెట్లు మూసుకుపోవడంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడిందని తెలిపారు. మరోవైపు మురుగునీటి ప్రవాహం కారణంగా చెరువులో సుమారు 10 నుంచి 15 అడుగుల మేర పూడిక పేరుకుపోయిందని పేర్కొన్నారు. చెరువు పునరుద్ధరణలో భాగంగా ఈ సమస్యలను పరిష్కరించి, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోనున్నట్లు హైడ్రా కమిషనర్ వివరించారు..

వేసవిలోనూ నీటితో కళకళ.. ఎస్టీపీల ద్వారా శుద్ధికి ఏర్పాటు..

ఫాక్స్‌సాగర్ చెరువులో ఏడాది పొడవునా నీటితో కళకళలాడేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు హైడ్రా కమిషనర్ తెలిపారు. నగరంలోని ఎస్టీపీల ద్వారా శుద్ధి చేసిన నీటిని చెరువులోకి విడుదల చేసి, భూగర్భ జలాలను పెంపొందించేందుకు చర్యలు చేపడతామన్నారు. తద్వారా ఎండాకాలంలో సైతం చెరువులో నీటి నిల్వలు ఉండటంతో పాటు పరిసర ప్రాంతాల్లో భూగర్భజలాల మట్టం పెరిగే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు.. ఫాక్స్‌సాగర్ చెరువు కేవలం నీటి వనరుగా మాత్రమే కాకుండా, ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా హైడ్రా కమిషనర్ తెలిపారు.. చెరువు చుట్టూ అద్భుతమైన మినీ ట్యాంక్‌బండ్, పార్కులు, పర్యాటకులను ఆకర్షించే విధంగా తీర్చిదిద్దనున్నట్లు వెల్లడించారు.. ఈ అభివృద్ధి ద్వారా స్థానిక ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడంతో పాటు మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తామని తెలిపారు..

ఫాక్స్‌సాగర్ చెరువు ప్రధాన తూమును పరిశీలించిన కమిషనర్ రంగనాథ్..

హైడ్రా కమిషనర్ ఏవి.రంగనాథ్..

హైదరాబాద్‌ను ముంచెత్తిన భారీ వర్షం.. నగర జీవనం అస్తవ్యస్తం

-3 పేజి తరువాయి

మైండ్‌స్పేస్, ఐకియా మార్గాల్లో వాహనాలు కిలోమీటర్ల మేర బారులు తీరాయి. మాదాపూర్ సిటీ వైన్స్ వద్ద ప్రధాన రహదారి చెరువును తలపించడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. కుత్బుల్లాపూర్ నుంచి సూరారం వరకు, షాపూర్ నుంచి గాజులరామారం వరకు కూడా భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. వర్షానికి తడుస్తూ కొందరు ప్రయాణికులు మెట్రో పిల్లర్ల కింద తలదాచుకోగా, మరికొందరు గంటల తరబడి ట్రాఫిక్‌లోనే చిక్కుకుపోయారు. ఉప్పల్, ఎల్బీనగర్, మణికొండ, రాయదుర్గం, రాజేంద్రనగర్ వంటి నగర శివారు ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి కనిపించింది. అయితే, గత కొన్ని రోజులుగా నగరంలో తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడిపోతున్న ప్రజలకు ఈ వర్షం కాస్త ఉపశమనం కలిగించింది.

హైదరాబాద్‌కు జనవరి నుంచి 8 నెలల పాటు భారీ నీటి కష్టాలు: జలమండలి ఎండీ వార్నింగ్

భాగ్యనగరానికి తాగునీటి గండం
మంజీరా, సింగూరు ప్రాజెక్టుల నుంచి 100 MGD నీటి కొరత అంచనా
హైదరాబాద్‌లో 7 నియోజకవర్గాలపై నీటి సంక్షోభ ప్రభావం

హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్ నగరానికి 8 నెలల పాటు తీవ్ర నీటి కష్టాలు తప్పవని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి స్పష్టం చేశారు. మంజీరా, సింగూరు జలాశయాలు అడుగంటిపోవడంతో సుమారు రోజుకు 100 మిలియన్ గ్యాలన్ల (MGD) నీటి కొరత ఏర్పడనుందని ఆయన తెలిపారు. ఈ ప్రభావం వచ్చే ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ వరకు ఉంటుందని హెచ్చరించారు.ప్రాజెక్టులలో నీటి మట్టాలు పడిపోవడం, భూగర్భ జలాలు తగ్గడంతో సమస్య తీవ్రంగా మారిందని అశోక్ రెడ్డి వివరించారు. ఈ కొరతను అధిగమించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. గోదావరి నుంచి 100 MGD, కృష్ణా నది నుంచి 10–15 MGD, ఉస్మాన్‌సాగర్ నుంచి మరో 5 MGD నీటిని నగరానికి తరలించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ చర్యల ద్వారా 60 శాతం కొరతను భర్తీ చేయగలిగినా, మరో 20 నుంచి 40 శాతం నీటి ఎద్దడి కొనసాగుతుందని ఆయన అంగీకరించారు.ఈ నీటి సంక్షోభం ప్రభావం నగరంలోని ఏడు నియోజకవర్గాలపై అధికంగా ఉంటుందని అశోక్ రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యంగా శేరిలింగంపల్లిలో 80 శాతం వరకు నీటి సమస్య ఉండొచ్చని అంచనా వేశారు. అలాగే పటాన్‌చెరు నుంచి నార్సింగి వరకు ఉన్న ప్రాంతాల్లో సుమారు 3 లక్షల కనెక్షన్లకు నీటి సరఫరాలో ఇబ్బందులు తప్పవని తెలిపారు. దీంతో రాబోయే రోజుల్లో నగరవాసులు నీటిని పొదుపుగా వాడుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

హైదరాబాద్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆకాశ్ ను ఖరారు చేసిన కల్వకుంట్ల కవిత

- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో తెలంగాణ రక్షణ సేన
- హైదరాబాద్ అభ్యర్థిగా సీనియర్ జర్నలిస్ట్ ఆకాశ్ కొల్లూరు ఖరారు
- వరంగల్, హైదరాబాద్ రెండు స్థానాల్లోనూ బీసీలకే అవకాశం
- ఎన్నికల పరిశీలకుడిగా డాక్టర్ చిట్నేని రఘు నియామకం

హైదరాబాద్ పెన్ పవర్: రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధినేత్రి కల్వకుంట్ల కవిత తమ పార్టీ అభ్యర్థులను ఖరారు చేశారు. హైదరాబాద్ – రంగారెడ్డి – మహబూబ్ నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పార్టీ అభ్యర్థిగా ప్రముఖ జర్నలిస్ట్ ఆకాశ్ కొల్లూరు పేరును ప్రకటించారు.సుమారు 20 ఏళ్లుగా జాతీయ మీడియా రంగంలో పనిచేస్తున్న ఆకాశ్ కొల్లూరు... ఇండియాటుడే, రిపబ్లిక్ టీవీ, సీఎన్ఎన్ న్యూస్ 18, డైలీ హంట్ వంటి సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో పాఠశాల విద్యను, ఉస్మానియా యూనివర్సిటీ నుంచి గోల్డ్ మెడల్‌తో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. విద్యావంతుడు, జాతీయ మీడియా అనుభవం ఉన్న బీసీ నేత కావడంతో పట్టభద్రుల మద్దతు తమకే లభిస్తుందని టీఆర్ఎస్ ధీమా వ్యక్తం చేస్తోంది.ఇప్పటికే వరంగల్ – ఖమ్మం – నల్గొండ స్థానం నుంచి బీసీ వర్గానికి చెందిన నలమాస శ్రీకాంత్ గౌడ్‌ను టీఆర్ఎస్ బరిలో దింపిన సంగతి తెలిసిందే. తాజా ప్రకటనతో రెండు ఎమ్మెల్సీ స్థానాల్లోనూ బీసీలనే నిలబెట్టినట్లయింది. ఈ ఎన్నికల కోసం హైదరాబాద్ స్థానానికి అబ్జర్వర్‌గా డాక్టర్ చిట్నేని రఘును... రెండు నియోజకవర్గాల ఎన్నికల వ్యూహాలు, వార్ రూమ్ ఇన్‌చార్జ్‌గా న్యాయవాది రామ్ కల్యాణ్ చల్లాను నియమిస్తూ కవిత నిర్ణయం తీసుకున్నారు.

మూసీ ప్రక్షాళనకు మేము వ్యతిరేకం కాదు

-3 పేజి తరువాయి

నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయని ఆయన ప్రశ్నించారు.ఢిల్లీలో విపక్షాలు తలపెట్టిన 'మాక్ పార్లమెంట్'పైనా రాంచందర్ రావు తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ నేతలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో యూపీఏ హయాంలో ములాయం సింగ్ యాదవ్ నాయకత్వంలో మాక్ పార్లమెంట్ నిర్వహిస్తే, దాన్ని ఎందుకు నిర్వహిస్తున్నారని సోనియా గాంధీ ప్రశ్నించిన విషయాన్ని గుర్తు చేశారు. పార్లమెంట్‌ను ప్రజాస్వామ్య దేవాలయంగా అభివర్ణించిన కాంగ్రెస్ నేత, మాజీ స్పీకర్ మీరా కుమార్ విషయాన్ని ప్రస్తావిస్తూ... ఇప్పుడు అదే కాంగ్రెస్ నేతలు రాజకీయ స్వలాభం కోసం ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

నవంబర్ 30న ఏపీ, తెలంగాణ ఓటర్ల తుది జాబితా..

మళ్లీ మారిన షెడ్యూల్

హైదరాబాద్ పెన్ పవర్:
రెండు తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమ షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) మరోసారి మార్పు చేసింది. రెండు రాష్ట్రాల ప్రధానఎన్నికల అధికారుల (సీఈవోలు) విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకుంది. తాజా మార్పులతో రెండు రాష్ట్రాల్లోనూ ఓటర్ల తుది జాబితా నవంబర్ 30వ తేదీన ప్రచురితం కానుంది. ఈ మేరకు ఎన్నికల సంఘం రెండు రాష్ట్రాల సీఈవోలకు వేర్వేరుగా సమాచారం అందించింది. ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులపై వచ్చిన క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారానికి సంబంధించిన గడువును తెలంగాణలోనవంబర్ 26 వరకు, ఆంధ్రప్రదేశ్‌లో నవంబర్ 20 వరకు పొడిగించింది. వాస్తవానికి పాత షెడ్యూల్ ప్రకారం తెలంగాణలో నవంబర్ 9న, ఆంధ్రప్రదేశ్‌లో అక్టోబర్ 30నే తుది జాబితా విడుదల కావాల్సిఉంది. అయితే, క్షేత్రస్థాయిలో ప్రక్రియ ఇంకా పూర్తి కాకపోవడంతో సీఈవోల అభ్యర్థన మేరకు ఈసీ గడువును పొడిగించింది. సవరించిన షెడ్యూల్ వివరాలను క్షేత్రస్థాయి అధికారులందరికీ తెలియజేయాలని,మీడియా ద్వారా ప్రజలకు విస్తృత ప్రచారం కల్పించాలని ఈసీ తమ ఆదేశాల్లో స్పష్టం చేసింది. అదేవిధంగా మార్పు చేసిన షెడ్యూల్ గురించి రాజకీయ పార్టీలకు కూడా రాతపూర్వకంగా సమాచారం అందించాలని సూచించింది.

గణాంకాల వివరాలు:

ప్రత్యేక సవరణ ప్రక్రియ ప్రారంభానికి ముందు తెలంగాణలో 3,38,26,448 మంది ఓటర్లు ఉండగా, వారిలో 2,64,87,213 మంది మాత్రమే తమ వివరాలను నమోదు చేసుకున్నారు.

మిగిలిన 73,39,235 మంది ఓటర్లను వలస వెళ్లినవారు, మరణించినవారు, చిరునామా మారినవారు, నకిలీ ఓట్ల (రూాణణ) కేటగిరీ కింద గుర్తించి డ్రాఫ్ట్ జాబితా నుంచి తొలగించారు.

అక్టోబర్

29 నాటికి అందిన సమాచారం ప్రకారం.. తెలంగాణలో జారీ చేసిన 92,88,188 నోటీసులకు గానూ 92,81,189 నోటీసులు ఓటర్లకు అందజేశారు. వీటిలో 92,08,443 నోటీసులపై విచారణ పూర్తయింది.ఇప్పటివరకు మొత్తం 2,59,22,684 మంది ఓటర్ల పేర్లను తుది జాబితాలో చేర్చడానికి అధికారులు ఆమోదం తెలిపారు. వీరిలో 59,31,395 మంది ఓటర్ల విషయంలో ఉన్న సాంకేతిక సమస్యలనుపరిష్కరించారు. మరో 30,64,168 మందిని 2002 నాటి జాబితా నుంచి మ్యాపింగ్ చేశారు. విచారణ అనంతరం 50,690 మంది ఓటర్లు జాబితాలో చేరడానికి అర్హులు కారని అధికారులు తేల్చారు.ఇక,ఆంధ్రప్రదేశ్ విషయానికొస్తే.. ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి 44,28,858 నోటీసులపై విచారణ పూర్తయింది. వీరిలో 42,55,630 మంది ఓటర్ల పేర్లను తుది జాబితాలో చేర్చడానికి ఆమోదంలభించింది. పరిశీలన తర్వాత 1,73,662 మంది ఓటర్లు జాబితాలో చోటు దక్కించుకోవడానికి అర్హులు కారని అధికారులు నిర్ధారించారు.

అమిత్ షా టూర్ వెనుక భారీ వ్యూహం

హైదరాబాద్ పెన్ పవర్:
తెలంగాణ రాజకీయ రంగంలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ అంశం కాంగ్రెస్, బీజేపీల మధ్య రగులుతోంది. ఢిల్లీలోని చారిత్రాత్మక రామ్‌లీలా మైదాన్‌లో నవంబర్ 1న కాంగ్రెస్ పార్టీ ఓట్ చోరీ నినాదంతోనిర్వహించనున్న భారీ ర్యాలీకి సవాల్ విసురుతూ.. మరుసటి రోజే నవంబర్ 2న భాగ్యనగరంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రత్యక్షంగా పాల్గొనేలా లోక్‌తంత్ర బచావో – అరాజకతా హటావో పాదయాత్రను బీజేపీ ఖరారు చేసింది. ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల సవరణ ప్రక్రియను రాజకీయం చేస్తూ, కాంగ్రెస్ ఆడుతున్న నాటకాలను తిప్పికొట్టడమే లక్ష్యంగా చాణక్యుడు స్వయంగా రంగంలోకిదిగుతుండటంతో జాతీయ, రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిలు ఈసీ ప్రక్రియపై అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారనేది బీజేపీ ప్రధానఆరోపణ. మరణించినవారు , శాశ్వతంగా చిరునామాలు మారినవారు ,అడ్రస్‌లో లేనివారు, రెండు చోట్ల నమోదు చేసుకున్న డూప్లికేట్ ఓట్లను సాంకేతిక ఆధారాలతో ఈసీ తొలగిస్తుంటే, దానిని ఓట్ల చోరీ అని కాంగ్రెస్ ప్రచారం చేస్తోందని బీజేపీ నేతలు మండిపడుతున్నారు. చట్టబద్ధమైన సవరణ ప్రక్రియను అరాచకత్వంగా మార్చాలని చూస్తున్న కాంగ్రెస్ వైఖరిని ప్రజల వద్దకే వెళ్లి ఎండగట్టడమే ఈ పాదయాత్రముఖ్య ఉద్దేశం.ఈ పరిణామం వెనుక బీజేపీ జాతీయ నాయకత్వం సుదీర్ఘ రాజకీయ వ్యూహం దాగి ఉందనేది స్పష్టమవుతోంది. ముఖ్యంగా తెలంగాణను రాబోయే రోజుల్లో కైవసం చేసుకోవాలనే దృఢసంకల్పంతో ఉన్న అమిత్ షా, ఈ ఓటర్ల జాబితా రచ్చ ను కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పొలిటికల్ అస్త్రంగా మలుచుకోవాలని చూస్తున్నారు. రాహుల్ గాంధీ డిఫెన్స్ లోకి నెట్టిన ప్రతిసారీ ప్రత్యక్షంగా తానేవేదికపైకి వచ్చి కౌంటర్ ఇవ్వడం అమిత్ షా శైలి. హైదరాబాద్ ట్యాంక్ బండ్ పరిసరాల్లో వేలాదిమంది శ్రేణులతో సాగనున్న ఈ పాదయాత్ర ద్వారా సౌత్ ఇండియాలో కాంగ్రెస్ నరేటివ్‌ను పూర్తిగా పటాపంచలుచేయాలని భావిస్తున్నారు.రాష్ట్రంలో నెలకొన్న కరువు, తాగునీటి ఎద్దడి వంటి ప్రజా సమస్యలను పక్కనబెట్టి సీఎం రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు 'ఢిల్లీ ర్యాలీ' కోసం గాల్లో విహరిస్తున్నారని బీజేపీరాష్ట్రాధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. నిజమైన ఓటర్ల పేర్లు ఎక్కడైనా తొలగించి ఉంటే ఆధారాలతో చూపించాలని, సీఎం స్వగ్రామం కొండారెడ్డిపల్లికి రావడానికైనా తాముసిద్ధమని సవాల్ విసిరారు. ఓటర్లకు ఉన్న ఫారమ్–6 హక్కును వివరించకుండా, ఓట్ల పేరుతో కాంగ్రెస్ కేవలం రాబోయే స్థానిక ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనం పొందాలని చూస్తోందని ధ్వజమెత్తారు.మరోవైపు, బిఆర్ఎస్ స్థానంలో కాంగ్రెస్‌కు ఏకైక ప్రత్యామ్నాయంగా తమను తాము నిలబెట్టుకోవడానికి బీజేపీకి ఇది ఒక సువర్ణావకాశంగా మారింది. తెలంగాణలో అధికారం చేజిక్కించుకోవాలంటే కేవలంఅసెంబ్లీ స్థానాలే కాకుండా, హైదరాబాద్, రంగారెడ్డి లాంటి అర్బన్ సెంటిమెంట్‌ను తమవైపు తిప్పుకోవడం అత్యంత కీలకం. అందుకే అమిత్ షా నేరుగా వీధుల్లోకి వచ్చి పాదయాత్ర చేయడం ద్వారా కమలంక్యాడర్‌లో నూతన ఉత్సాహాన్ని నింపడంతో పాటు, తద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రతిపక్ష పాత్రను రీ–ఛార్జ్ చేయబోతున్నారు. ఢిల్లీలో రామ్‌లీలా మైదాన్ ర్యాలీతో కాంగ్రెస్ వేసిన ఎత్తుకు, మరుసటి రోజే హైదరాబాద్‌పాదయాత్రతో అమిత్ షా వేస్తున్న పైఎత్తు దేశ రాజకీయాల్లో ప్రధాన ఆకర్షణగా మారింది. ఎన్నికల సమయానికి ఇంకా సమయం ఉన్నప్పటికీ, ఈ ఓటర్ల జాబితా సమరం ద్వారా కాంగ్రెస్–బీజేపీలుతెలంగాణ నేతలను జాతీయ స్థాయి రాజకీయ కురుక్షేత్రంగా మార్చేశాయనడంలో ఎలాంటి సందేహం లేదు.కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా నవంబర్ 2న తెలంగాణలో పర్యటనతో రాష్ట్ర రాజకీయంఒక్కసారిగా వేడెక్కింది. ఈ పర్యటనను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న బీజేపీ రాష్ట్ర నాయకత్వం, భారీ ఎత్తున జన సమీకరణ చేసేందుకు సమాయత్తమవుతోంది.అమిత్ షా పర్యటన, పాదయాత్రఏర్పాట్లపై బీజేపీ ముషీరాబాద్ సీనియర్ నాయకులు రామచందర్ రావు, బీజేపీ సహ ఇంచార్జి అభయ్ పాటిల్, పార్టీ ప్రధాన కార్యదర్శులు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. కార్యక్రమాన్ని ప్రజాక్షేత్రంలోనిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చించారు.ఈ పర్యటనలో 'ప్రజాస్వామ్యాన్ని కాపాడుదాం.. అరాచకత్వంను అంతంచేద్దాం' అనే ప్రధాన నినాదంతో బీజేపీ భారీ పాదయాత్రనుచేపట్టనుంది. కేవలం ఏదో ఒక గ్రౌండ్ లో లేదా వేదికలకే పరిమితం కాకుండా, నేరుగా ప్రజల మధ్య నుంచే పాదయాత్ర సాగాలని కేంద్ర బీజేపీ అగ్ర నాయకత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కేంద్రనాయకత్వం ఆదేశాలతో బీజేపీ నేతలు నాంపల్లిలోని చారిత్రాత్మక ఎగ్జిబిషన్ గ్రౌండ్స్, మొజంజాహీ మార్కెట్ పరిసర ప్రాంతాలను స్వయంగా పరిశీలించారు. పాదయాత్ర రూట్ మ్యాప్, రద్దీ నియంత్రణ, వేదికఏర్పాట్లపై అధికారులతో మాట్లాడారు.తెలంగాణలో రాబోయే ఎన్నికలు, ప్రస్తుత రాజకీయ పరిస్థితుల దృష్ట్యా అమిత్ షా పర్యటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. అధికార పార్టీ వైఫల్యాలను, పాలనావైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడమే లక్ష్యంగా ఈ యాత్ర ప్రధాన లక్ష్యంగా తెలుస్తోంది. కేంద్ర మంత్రి అమిత్ షా స్వయంగా ర్యాలీ చేయడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీజేపీ శ్రేణులు, కార్యకర్తల్లో ఉత్కంఠ నెలకొంది. ఈ సభ ద్వారా రాష్ట్రంలో తమ బలాన్ని మరోసారి నిరూపించుకోవాలని బీజేపీ నాయకులు యోచిస్తున్నారు.

అతిగా ఫోన్ మాట్లాడుతోందని బిడ్డను గొంతుపిసికి చంపిన తల్లి

హైదరాబాద్ పెన్ పవర్: బిడ్డ అతిగా ఫోన్ మాట్లాడుతోందని, తాను చెప్పిన మాట వినడం లేదని ఓ తల్లి ఆమెను దారుణంగా గొంతుపిసికి చంపేసింది. ఈ ఘటన షాద్‌నగర్ ఏరియాలోగల కొత్తూరు మున్సిపాలిటీలోచోటుచేసుకుంది. షాద్‌నగర్ డీసీపీ శిరీష వెల్లడించిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీలోని హనుమాన్ కాలనీలో నివాసం ఉండే ఆటోడ్రైవర్ ముయ్యడి రాజు, విజయలక్ష్మి దంపతులకు ముగ్గురుకుమార్తెలు. పెద్ద కుమార్తె సువర్చల (14) స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ముయ్యడి రాజు భార్య కల్లుకు బానిసైంది. ఈ క్రమంలో కల్లు తాగవద్దన్న కుమార్తె సువర్చలతోనిత్యం గొడవ పడేది. ఈ నెల 27న సాయంత్రం మరోమారు వీరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో ఆగ్రహంతో ఊగిపోయిన తల్లి కుమార్తెను గొంతుపిసికి చంపేసింది. అనంతరం ఈ హత్యను ఆత్మహత్యగాచిత్రీకరించేందుకు బాలిక మెడకు చీర చుట్టింది. తర్వాత భర్తకు ఫోన్ చేసి రప్పించింది. బాలికను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇటీవలే బాలిక పుష్పవతి కావడంతో కడుపునొప్పి భరించలేక బలవన్మరణానికి పాల్పడి ఉంటుందని తండ్రి రాజు భావించాడు. అయితే రాజు ఫిర్యాదు

మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులకు బాలిక కడుపునొప్పితో కాదు,ఊపిరాడక చనిపోయిందని పోస్టుమార్టం రిపోర్టులో తెలిసింది. దాంతో వారు తల్లిని అనుమానించి తమదైన శైలిలో ప్రశ్నించారు. దాంతో నిందితురాలు నేరం అంగీకరించింది. ఫోన్ అతిగా మాట్లాడుతోందని,చెప్పిన మాట వినట్లేదని, అందుకే చంపేశానని చెప్పింది

తిరస్కరణ నుంచి చరిత్ర వరకు డాక్టర్ రూత్ జాన్ పాల్ అరుదైన విజయం

- వివక్షను అధిగమించి పీజీ వైద్య విద్య పూర్తి
- పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకున్న ట్రాన్స్‌జెండర్ వైద్యురాలు
- సోషల్ మీడియా ద్వారా విజయాన్ని తెలుసుకుని ముందుగా సన్మానించిన డాక్టర్ కీర్తి సతీష్ కుమార్
- రూత్‌కు ప్రభుత్వ ఉద్యోగం కల్పించేలా సీఎం దృష్టికి తీసుకెళ్తా: డాక్టర్ కీర్తి

ట్రాన్స్ జెండర్ వైద్యారానికి సన్మానిస్తున్న డాక్టర్ సతీష్ కుమార్

ట్రాన్స్ జెండర్ వైద్యారాలు

ఖమ్మం, పెన్ పవర్, అక్టోబర్ 30 : అవమానాలు ఎదురైనా ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకుండా, వివక్షను అధిగమించి లక్ష్యం వైపు అడుగులు వేస్తే విజయం తప్పక వరిస్తుంది" అనే సందేశానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు డాక్టర్ కొయ్యల రూత్ జాన్ పాల్. కుటుంబ తిరస్కరణ, ఆర్థిక ఇబ్బందులు, సామాజిక వివక్ష.. ఇలా ఎన్నో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ వైద్య విద్యలో ఉన్నత శిఖరాలను అధిరోహించారు. తనపై వచ్చిన ప్రతి సవాలును పట్టుదలతో ఎదుర్కొని పీజీ వైద్య విద్యను పూర్తి చేసి తన కలను సాకారం చేసుకున్నారు. ఆమె ప్రయాణం నేడు ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తోంది.రూత్ జాన్ పాల్ సాధించిన విజయాన్ని సోషల్ మీడియా, వార్తా కథనాల ద్వారా తెలుసుకున్న ప్రముఖ సామాజికవేత్త, వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రిలో హెచ్ఐవీ యాక్టివిస్ట్‌గా సేవలందిస్తున్న డాక్టర్ కీర్తి సతీష్ కుమార్ ప్రత్యేకంగా స్పందించారు. ఆమె విజయాన్ని అభినందించడమే కాకుండా, స్వయంగా ఆమె నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యుల సమక్షంలో ఘనంగా సన్మానించారు. కష్టాలను అధిగమించి ఉన్నత విద్యను పూర్తి చేసిన ఆమెను గౌరవించడం ద్వారా మానవత్వం, సామాజిక బాధ్యతను చాటుకున్నారు.

చిన్నతనం నుంచే కష్టాలు. లక్ష్యం మాత్రం వైద్యవిద్యే

చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయిన రూత్ జాన్ పాల్ కుటుంబం అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంది. తల్లి రోజువారీ కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేది. పరిస్థితులు అనుకూలించకపోయినా రూత్ చదువుపై ఆసక్తిని మాత్రం వదులుకోలేదు. కష్టపడి చదువుతూ మెరిట్ ఆధారంగా ఎంబీబీఎస్‌లో ప్రవేశం పొందారు. అయితే, తన లింగ గుర్తింపును వెల్లడించిన తర్వాత కుటుంబం నుంచి తిరస్కరణ ఎదురైందని ప్రచురిత కథనాలు పేర్కొంటున్నాయి.

నివాసం, ఆహారం వంటి కనీస అవసరాల కోసం ఇబ్బందులు ఎదురైనప్పటికీ, వైద్యురాలిగా ఎదగాలనే సంకల్పం నుంచి ఆమె వెనక్కి తగ్గలేదు. పరిస్థితులు తనకు అనుకూలంగా మారే వరకు ఎదురుచూడకుండా, ఎదురైన ప్రతి అడ్డంకిని అధిగమిస్తూ ముందుకు సాగారు. ఆమె జీవిత ప్రయాణం కేవలం విద్యలో సాధించిన విజయమే కాదు.. ఆత్మగౌరవం కోసం, తన ఉనికికి గుర్తింపు కోసం సాగించిన పోరాటం కూడా.

న్యాయపోరాటం నుంచి పీజీ వైద్య విద్య వరకు..

ఎంబీబీఎస్ పూర్తి చేసిన అనంతరం పీజీ వైద్య విద్యలో ప్రవేశం పొందే సమయంలో నిబంధనలు, కేటగిరీకి సంబంధించిన సమస్యలు ఎదురైనట్లు కథనాలు వెల్లడిస్తున్నాయి. ఈ క్రమంలో తనకు న్యాయం జరగాలంటూ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించినట్లు సమాచారం. న్యాయపోరాటం అనంతరం కోర్టు ఆదేశాలతో పీజీ కౌన్సెలింగ్‌లో పాల్గొనే అవకాశం లభించిందని ప్రచురిత వివరాలు పేర్కొంటున్నాయి.

చివరకు హైదరాబాద్‌లోని సనత్‌నగర్ ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీలో ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగంలో ఎండీ పూర్తి చేశారు. ఎన్నో సవాళ్ల మధ్య ఉన్నత వైద్య విద్యను పూర్తిచేయడం ఆమె పట్టుదలకు నిదర్శనం. ప్రతికూల పరిస్థితులు ఎదురైనా తన లక్ష్యాన్ని మార్చుకోకుండా సాధించిన ఈ విజయం సమాజంలో సమాన అవకాశాల ప్రాధాన్యతను మరోసారి గుర్తుచేస్తోంది.

సోషల్ మీడియా ద్వారా తెలుసుకుని.. ముందుగా సన్మానం

రూత్ జాన్ పాల్ విజయగాథను తెలుసుకున్న డాక్టర్ కీర్తి సతీష్ కుమార్ ఆమెను అభినందించాలని నిర్ణయించుకున్నారు. సుమారు 35 ఏళ్లుగా సామాజిక సేవా రంగంలో కొనసాగుతున్న ఆయన, ప్రస్తుతం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో హెచ్ఐవీ యాక్టివిస్ట్‌గా సేవలందిస్తున్నారు. ఖమ్మం జిల్లాతో అనుబంధం ఉన్న రూత్ జాన్ పాల్ నివాసానికి వెళ్లి ఆమెను కుటుంబ సభ్యుల సమక్షంలో సన్మానించారు.

ఈ సందర్భంగా రూత్ జాన్ పాల్ తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, ఎండీ పూర్తి చేసిన తర్వాత తన విజయాన్ని గుర్తించి ముందుగా సన్మానించిన డాక్టర్ కీర్తి సతీష్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తన కష్టాన్ని, పట్టుదలను గుర్తించి గౌరవించడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని, భవిష్యత్తులో మరింత ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు ఈ సన్మానం ప్రోత్సాహాన్నిచ్చిందని పేర్కొన్నారు. తనకు ఇదే తొలి సన్మానమని ఆమె తెలిపినట్లు సమాచారం.ఒక వ్యక్తి సాధించిన విజయాన్ని గుర్తించి గౌరవించడం సమాజంలో సానుకూల మార్పులకు దారితీస్తుందని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. ప్రతిభను గుర్తించడానికి వ్యక్తిగత నేపథ్యం, లింగ గుర్తింపు అడ్డంకులు కాకూడదనే సందేశాన్ని ఈ సన్మానం అందించింది.

ప్రభుత్వ ఉద్యోగం కోసం కృషి చేస్తా: డాక్టర్ కీర్తి

ఈ సందర్భంగా డాక్టర్ కీర్తి సతీష్ కుమార్ మాట్లాడుతూ, రూత్ జాన్ పాల్ సాధించిన విజయం అభినందనీయమని పేర్కొన్నారు. ఎన్నో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ వైద్య విద్యలో ఉన్నత స్థాయికి చేరుకోవడం ఆమె సంకల్పబలానికి నిదర్శనమన్నారు. ఇలాంటి ప్రతిభావంతులకు తగిన అవకాశాలు లభిస్తే సమాజానికి మరింత

మెరుగైన సేవలు అందించగలరని అభిప్రాయపడ్డారు.రూత్ జాన్ పాల్ తన పట్టుదలతో ఉన్నత వైద్య విద్యను పూర్తి చేశారు. ఆమె ప్రతిభ సమాజానికి ఉపయోగపడాలి. ఆమెకు ప్రభుత్వ ఉద్యోగ అవకాశం కల్పించే అంశాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, తగిన అవకాశం లభించేలా నా వంతు కృషి చేస్తాను" అని డాక్టర్ కీర్తి సతీష్ కుమార్ తెలిపారు.రూత్ జాన్ పాల్‌కు తగిన ఉద్యోగ అవకాశం కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తానని, ఆమె సేవలు మరింత విస్తృతంగా సమాజానికి ఉపయోగపడేలా తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. అయితే ప్రభుత్వ ఉద్యోగానికి సంబంధించి ఇది ఆయన వ్యక్తం చేసిన ప్రయత్నం, హామీ మాత్రమేనని, అధికారిక నియామక ప్రకటనగా భావించరాదని గమనించాలి.

ప్రతిభకు లింగ గుర్తింపు అడ్డంకి కాదు

రూత్ జాన్ పాల్ ప్రయాణం సమాజానికి ఒక ముఖ్యమైన సందేశాన్ని అందిస్తోంది. కుటుంబం నుంచి తిరస్కరణ ఎదురైనా ఆర్థిక ఇబ్బందులు వెంటాడినా, వివక్షను ఎదుర్కోవాల్సి వచ్చినా ఆమె తన లక్ష్యాన్ని వదులుకోలేదు. విద్యను ఆయుధంగా చేసుకుని అడ్డంకులను అధిగమించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు.

ప్రతిభకు లింగ గుర్తింపు అడ్డంకి కాకూడదు.. ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు లభించినప్పుడే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుంది అనే భావనకు రూత్ విజయం అద్దం పడుతోంది.ఆమె సాధించిన విజయం మరెందరికో ధైర్యాన్నివ్వాలని, ప్రతికూల పరిస్థితుల్లో ఉన్నవారు తమ లక్ష్యాల దిశగా ముందడుగు వేయడానికి ప్రేరణగా నిలవాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు. రూత్ విజయాన్ని గుర్తించి ఆమెను సన్మానించిన డాక్టర్ కీర్తి సతీష్ కుమార్ చొరవను కుటుంబ సభ్యులు అభినందించారు

ఎంవీఎస్ఆర్ కళాశాల ప్రమాదంపై ఎన్‌హెచ్ఆర్సీ స్పందన

నాలుగు వారాల్లో చర్యల నివేదిక సమర్పించాలని అధికారులకు ఆదేశం

ఎల్బీనగర్, పెన్ పవర్ అక్టోబర్ 30:రంగారెడ్డి జిల్లా నాదర్‌గుల్‌లోని ఎంవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ప్రమాదంపై జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్ఆర్సీ) స్పందించింది. ఘటనపై అవసరమైన చర్యలు తీసుకొని నాలుగు వారాల్లోగా చర్యల నివేదిక సమర్పించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, మున్సిపల్ పరిపాలన శాఖ ఉన్నతాధికారులను ఆదేశించింది. కేసు నంబర్ 1051/36/9/2026కు

సభావట్ కళ్యాణ్

సంబంధించి సభావట్ కళ్యాణ్, కరుపోతుల రేవంత్ సమర్పించిన ఫిర్యాదుపై అక్టోబర్ 28న ఎన్‌హెచ్ఆర్సీ ఈ ఆదేశాలు జారీ చేసింది. అక్టోబర్ 17న కళాశాలలో నిర్వహించిన 'సంగమం--2026' ఉత్సవాల్లో డాండియా వేడుకలు జరుగుతుండగా భారీ లోహపు లైటింగ్ ట్రస్, దాని ఆధార స్తంభాలు కూలిపోయాయి. ఈ ఘటనలో సోనీ, మీనా అనే ఇద్దరు విద్యార్థినులు మృతి చెందగా, మరో 12 నుంచి 14 మంది విద్యార్థులు గాయపడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. విద్యాసంస్థల్లో కార్యక్రమాల నిర్వహణ, తాత్కాలిక నిర్మాణాల భద్రత, జనసమూహ నియంత్రణలో నిర్లక్ష్యంపై ఫిర్యాదుదారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించి, మృతుల కుటుంబాలకు పరిహారం అందించాలని, గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్యం కల్పించాలని కోరారు. నిర్లక్ష్యం నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు విద్యాసంస్థల్లో భద్రతా ప్రమాణాలను కఠినంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సమగ్ర చర్యలు చేపట్టాలని సభావట్ కళ్యాణ్ (ఢిల్లీ విశ్వవిద్యాలయ న్యాయ విద్యార్థి), అడ్వకేట్ కరుపోతుల రేవంత్ కోరారు.

ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి పొంగులేటి

ఏదులాపురం మున్సిపాలిటీలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ

ఖమ్మం, పెన్ పవర్, అక్టోబర్ 30:పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 28, 29, 30, 31, 32వ వార్డులకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు గురువారం పీవీఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి చేతుల మీదుగా రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత పదేళ్లలో పేదల గృహ నిర్మాణానికి సంబంధించి ఎదురైన సమస్యలను పరిష్కరిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఒక్కో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తూ, అవసరమైన సౌకర్యాలతో ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోందని వివరించారు. అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించాలన్నది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని పేర్కొన్నారు.ఇళ్ల మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమైంది. తమకు సొంతింటి కల నెరవేర్చే దిశగా సహకారం అందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వానికి, స్థానిక ప్రజాప్రతినిధులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పొకబత్తిని అనిత మున్సిపల్ అధ్యక్షులు భాను కిషోర్ నాయక్, ఉపాధ్యక్షులు వెంపటి సురేష్, బీసీ సెల్ అధ్యక్షులు వెంపటి రవి, సీనియర్ నాయకులు కొట్టం రంజిత్ రెడ్డి, గణపరపు వీరయ్య, పాలేరు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రెబ్బాగొండ్ల గోపి, లీగల్ అడ్వైజర్ పొన్నెకంటి నరసింహారావు, సోషల్ మీడియా వారియర్ ఏపూరి తరుణ్, వార్డు నాయకులు మేళ్లచెరువు సురేష్, అట్టూరి వీరబాబు మహిళా నాయకులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మోడీకి సరే... మిగిలిన ఎన్నికల్లో ఏమౌతోంది

హైదరాబాద్ పెన్ పవర్:

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న ఆధ్యాత్మిక రాజధాని వారణాసిలో ఎన్నికల ఫలితాలు ఎప్పుడూ ఒకేలా ఉండవు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాని మోదీ ఇక్కడి నుంచి లక్షల ఓట్ల ఆధిక్యంతో జయకేతనం ఎగురవేస్తూ వస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయి స్థానిక సంస్థలు, శాసనమండలి ఎన్నికల విషయానికి వచ్చేసరికి బీజేపీ సవాళ్లను ఎదుర్కొంటోంది. తాజాగా జరిగిన యూపీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వారణాసి ఉపాధ్యాయ స్థానాన్ని సమాజ్‌వాదీ పార్టీ సిట్టింగ్ అభ్యర్థి లాల్ బిహారీ యాదవ్ భారీ తేడాతో నిలబెట్టుకుని బీజేపీ అభ్యర్థి ప్రమోద్ మిశ్రాను మట్టికరిపించగా, పట్టభద్రుల స్థానంలోనూ ఎస్పీ అభ్యర్థి అశుతోష్ సిన్హా తిరుగులేని ఆధిపత్యాన్ని కనబరిచారు. సాక్షాత్తూ దేశ ప్రధాని నియోజకవర్గంలోనే విద్యావంతులు, ఉద్యోగ వర్గాలు బీజేపీకి వ్యతిరేకంగా తీర్పునివ్వడం రాజకీయ వర్గాలను తీవ్ర ఆశ్చర్యానికి గురిచేస్తోంది. 2014లో నరేంద్ర మోదీ వారణాసి నుంచి లోక్‌సభకు ఎన్నికైన నాటి నుంచి గత పన్నెండేళ్ల స్థానిక ఎన్నికల ఫలితాల చరిత్రను పరిశీలిస్తే ఫలితాలు ఇలాగే వస్తున్నాయి. 2020లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ఇదే తరహా పరిణామం ఎదురైంది. దాదాపు పదేళ్ల పాటు బీజేపీ చేతిలో ఉన్న వారణాసి గ్రాడ్యుయేట్స్, టీచర్స్ స్థానాలు రెండింటినీ సమాజ్‌వాదీ పార్టీ చేజిక్కించుకుని కమలనాథులకు ఊహించని షాక్ ఇచ్చింది. అంతకుముందు బీజేపీ అభ్యర్థి కేదార్‌నాథ్ సింగ్ ప్రాతినిధ్యం వహించిన గ్రాడ్యుయేట్స్ సీటును ఎస్పీ ఎగరేసుకుపోవడం నాడే రాష్ట్రవ్యాప్తంగా పెను ప్రకంపనలు సృష్టించింది. లోక్‌సభలో మోదీ ఇమేజ్ పనిచేస్తున్నప్పటికీ, పరోక్ష, విద్యావంతుల ఓటింగ్ విధానాల్లో మాత్రం స్థానిక అసంతృప్తులు బ్యాలెట్ బాక్సుల్లో బయటపడుతూనే ఉన్నాయి.ఎమ్మెల్సీ ఎన్నికలకే పరిమితం కాకుండా, వారణాసి జిల్లా పరిషత్, పంచాయతీరాజ్ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బీజేపీకి ఆశించిన స్థాయిలో పట్టు దక్కలేదు. 2015, 2021 పంచాయతీ ఎన్నికల్లో జిల్లా పంచాయతీ వార్డు సభ్యుల స్థానాల్లో సమాజ్‌వాదీ పార్టీ, బహుజన్ సమాజ్ పార్టీ తో పాటు స్వతంత్రులే అధిక స్థానాల్లో గెలుపొందారు. క్షేత్రస్థాయి గ్రామీణ ఓటర్లలో బీజేపీ సొంత బలంతో సాధారణ మెజార్టీని సాధించలేకపోయింది; తదనంతర రాజకీయాల్లో ఇతర పక్షాల మద్దతుతో, అధికార బలాన్ని ఉపయోగించి జిల్లా పంచాయతీ అధ్యక్ష పీఠాన్ని దక్కించుకున్నప్పటికీ.. బూత్ స్థాయి ప్రజాతీర్పులో ఎస్పీ, స్వతంత్ర అభ్యర్థులే పైచేయి సాధించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. నగర ప్రాంత మున్సిపల్ కార్పొరేషన్‌లో మేయర్ పీఠాన్ని బీజేపీ నిలబెట్టుకుంటున్నప్పటికీ, డివిజన్ వార్డుల్లో మాత్రం విపక్షాలు గట్టి పోటీనిస్తూనే ఉన్నాయి.ప్రధానమంత్రి వ్యక్తిగత చరిష్మా, జాతీయవాదం, కాశీ విశ్వనాథ్ కారిడార్ వంటి భారీ ప్రాజెక్టులు లోక్‌సభ ఎన్నికల్లో నగర ఓటర్లను ఆకర్షిస్తున్నాయి. అయితే లోకల్ బాడీ, ఎమ్మెల్సీ ఎన్నికలకు వచ్చేసరికి ఓటర్ల ప్రాధాన్యతలు పూర్తిగా మారిపోతున్నాయి. పట్టభద్రులు, ఉపాధ్యాయుల్లో పాత పెన్షన్ స్కీమ్ పునరుద్ధరణ డిమాండ్, నిరుద్యోగం, విశ్వవిద్యాలయాల్లో కాంట్రాక్ట్ సిబ్బంది సమస్యలు, స్థానిక నాయకత్వంలోని గ్రూపు విభేదాలు ప్రభావం చూపుతున్నాయి. ఫలితంగా, మోదీని జాతీయ నేతగా అంగీకరిస్తున్న స్థానిక ఓటర్లు.. క్షేత్రస్థాయి విధానాలు, ఉపాధ్యాయ-ఉద్యోగ సమస్యల వద్దకు వచ్చేసరికి మాత్రం బీజేపీ అభ్యర్థులపై తిరుగుబాటు చేస్తూ సమాజ్‌వాదీ పార్టీకే జై కొడుతున్నారు.

నిషేధిత పొగాకు ఉత్పత్తులు పట్టివేత

హైదరాబాద్ పెన్ పవర్:

మలక్పేట్లో నిషేధిత పొగాకు ఉత్పత్తుల అక్రమ రవాణాపై పోలీసులు తనిఖీలునిర్వహించారు. మూసారాంబాగ్ రోడ్డులోని మోర్ సూపర్ మార్కెట్ వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా నిషేధిత పొగాకుఉత్పత్తులు పట్టుబడింది. ఆటోలో అక్రమంగా పొగాకు ఉత్పత్తులను తరలిస్తుండగా ఎస్ఐ తేజ్య నాయక్ బృందం గుర్తించింది. ఆటో డ్రైవర్ను విచారించగా సిరిపురం కాలనీలోని గోదాములో భారీనిల్వలుబయటపడ్డాయి. పోలీసులు గోదామును తనిఖీ చేసి నిషేధిత పొగాకు ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వ్యాపారి మధుసూదన్ (61), ఆటో డ్రైవర్ ధూప సుధాకర్ను అదుపులోకి తీసుకున్నారు.గుడిమల్కాపూర్, కిషన్బాగ్ ప్రాంతాల నుంచి పొగాకు ఉత్పత్తులు తీసుకొచ్చి మలక్పేట్ పరిసర ప్రాంతాల్లోని పాన్ షాపులకు సరఫరా చేస్తున్నట్లు విచారణలో వెల్లడి అయింది. నిషేధిత పొగాకు ఉత్పత్తులతో పాటు రవాణాకు ఉపయోగించిన ఆటోను సీజ్ చేసారు.

రాజకీయ మనుగడగా నిత్యావసరాలు

రాజకీయాల్లో ప్రభుత్వాలపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి రగిలేందుకు పెద్ద పెద్ద సమస్యలో లేదా సిద్ధాంతపరమైన విభేదాలో అవసరం లేదు. సగటు సామాన్యుడి రోజువారీ కిచెన్ బడ్జెట్ తలకిందులైతే చాలు! కడుపు నిండా తినే కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటినప్పుడు, ప్రజల్లో వ్యక్తమయ్యే ఆగ్రహం నేరుగా పాలకపక్షాల గ్రాఫ్‌ను వేగంగా పడదోస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపిన ఎల్ నినో తీవ్రత వల్ల ఏర్పడిన అకాల వర్షాలు, పండగల రద్దీ, వాతావరణ మార్పుల ధాటికి ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లోనూ నిత్యావసర సరుకుల ధరలు భగ్గుమంటున్నాయి. ఈ పరిస్థితుల్లో ధరల మంట ప్రజావ్యతిరేకతగా మారకముందే అదుపుచేసేందుకు ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు రూ.కోట్ల ఆర్థిక భారాన్ని మోసేందుకు సిద్ధపడుతుండటం ఆసక్తికరమైన రాజకీయ సమీకరణగా మారింది.ఏపీలో అధికారంలో ఉన్న చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం, పెరుగుతున్న ధరల నుంచి సామాన్యుడిని కాపాడేందుకు ప్రత్యేక కౌంటర్లు, పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్‌ను పూర్తిస్థాయిలో రంగంలోకి దించింది. నెలకు సుమారు రూ. 100 కోట్ల వరకు అదనపు భారాన్ని ప్రభుత్వమే భరిస్తూ, బహిరంగ మార్కెట్ ధరల కంటే చాలా తక్కువకే నిత్యావసరాలను అందుబాటులోకి తెస్తోంది. రూ.100కే కిలో కందిపప్పు, రూ.125కే లీటర్ పామాయిల్, రూ.25కే గోధుమపిండి అందించడంతో పాటు, ధరణి బ్రాండ్ బియ్యాన్ని ప్రత్యేక వాహనాల ద్వారా అందుబాటులోకి తెస్తూ మార్కెట్ ధరలపై ఒత్తిడి పెంచి అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేస్తోంది.మరోవైపు తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజల అసంతృప్తిని చల్లబరిచేందుకు ఏకంగా రేషన్ కార్డుదారులకు ప్రత్యేక నిత్యావసరాల కిట్ల పంపిణీకి శ్రీకారం చుట్టే దిశగా అడుగులు వేస్తోంది. కేవలం బియ్యం మాత్రమే కాకుండా, పప్పు దినుసులు, వంటనూనెలు, గోధుమపిండి, చక్కెర వంటి 6 రకాల నిత్యావసరాలతో కూడిన సబ్సిడీ కిట్లను అందించడం ద్వారా పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించేందుకు పౌరసరఫరాల శాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. బహిరంగ మార్కెట్లో ధరలను విచ్చలవిడిగా పెంచే వ్యాపారుల నిర్బంధ తనిఖీలతో పాటు, ప్రభుత్వం నేరుగా ఈ సబ్సిడీ కిట్లను ఇవ్వడం ద్వారా క్షేత్రస్థాయిలో ప్రజల్లో సానుకూలత తెచ్చుకోవాలని భావిస్తోంది.ఆర్థికంగా తీవ్ర లోటు, రుణభారంతో సతమతమవుతున్నప్పటికీ రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ధరల నియంత్ణకై ఇంత భారీగా నిధులు వెచ్చించడానికి ప్రధాన కారణం ఓటు బ్యాంకు ముప్పు! ఉచిత పథకాలు ఎంత అందజేసినా, మార్కెట్‌లో నిత్యావసరాల ధరలు పెరిగితే సామాన్యుడి పాకెట్ మనీ ఖాళీ అయిపోతుంది. దీనివల్ల ప్రభుత్వాల సంక్షేమ పథకాల ఇంపాక్ట్ సున్నాగా మారి, హామీలు ఇచ్చారు కానీ పొట్ట నింపడం లేదు అనే నిరసన స్వరం గ్రామాల్లో బలంగా వినిపించే ప్రమాదం ఉందనేది పొలిటికల్ సర్వేల హెచ్చరిక. ఈ నిత్యావసరాల ధరల నియంత్రణ అంశం రెండు ప్రభుత్వాలకు సంజీవనిలా మారనుంది. బహిరంగ మార్కెట్ ధరలపై నిరంతరం నిఘా ఉంచడం, లభ్యత కొరత రాకుండా ముందస్తుగా దిగుమతులు చేసుకోవడం ద్వారా ప్రజాసంతోషాన్ని కాపాడుకోవడమే ఏపీ, తెలంగాణ సీఎంల ప్రధాన అజెండా.జాతీయ, అంతర్జాతీయ వాతావరణ మార్పుల వల్ల ఏర్పడిన నిత్యావసరాల కొరతను కేవలం పరిపాలనా సమస్య గా చూడకుండా, 'రాజకీయ మనుగడ' సమస్యగా భావించి రెండు రాష్ట్ర ప్రభుత్వాలు భారాన్ని తమ భుజాన వేసుకోవడం రాజకీయంగా అత్యంత వ్యూహాత్మకమైన అడుగుగా భావించవచ్చు. ప్రభుత్వం ప్రకటించిన ప్రత్యేక సబ్సిడీ ప్రణాళిక ప్రకారం.. మార్కెట్‌లో కిలో రూ.160 నుంచి రూ. 180 వరకు పలుకుతున్న కందిపప్పును కేవలం రూ. 100 కే అందించనున్నారు. అలాగే లీటరు పామాయిల్‌ను రూ. 125 కే, గోధుమపిండిని కిలో రూ. 25 కే పంపిణీ చేయనున్నారు. వీటితో పాటు క్వాలిటీ బియ్యాన్ని తక్కువ ధరలకే అందించేందుకు ప్రత్యేక మొబైల్ వాహనాలు, రైతు బజార్లను విస్తృతంగా వినియోగించుకోవాలని నిర్ణయించారు. బహిరంగ మార్కెట్‌లో రేట్ల కృత్రిమ కొరతను అరికట్టేందుకు, ఉల్లిపాయల నిల్వలను కూడా నిరంతరం పర్యవేక్షించాల్సిందిగా అధికారులను సీఎం ఆదేశించారు.ప్రజా పంపిణీ వ్యవస్థ , రైతు బజార్ల ద్వారా తక్కువ ధరకు ఈ సరుకులను పంపిణీ చేయడం వల్ల రాష్ట్ర ఖజానాపై నెలకు దాదాపు రూ. 100 కోట్ల మేర అదనపు ఆర్థిక భారం పడుతుందని పౌరసరఫరాల శాఖ అధికారులు అంచనా వేశారు. అయితే, ఎంతటి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ఎల్ నినో వల్ల పెరిగిన ధరల నుంచి సామాన్యులకు ఊరట కల్పించడమే తమ కూటమి ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పేదల కడుపు నింపే విషయంలో సంక్షేమానికి వెనుకాడేది లేదని తేల్చిచెప్పారు.దీపావళి కానుకగా అందుబాటులోకి రానున్న ఈ పథకం ద్వారా రాష్ట్రంలో కోట్లాది మంది కార్డుదారులు , సామాన్య ప్రజలు నేరుగా లబ్ధి పొందనున్నారు. ఒకవైపు పండుగ సీజన్,మరోవైపు ఎల్ నినో ప్రభావంతో కూరగాయలు, దినుసుల ధరలు మండిపోతున్న తరుణంలో చంద్రబాబు తీసుకున్న ఈ నిర్ణయం మధ్యతరగతి గృహిణులకు ఎనలేని ఊరటనిస్తోంది. ప్రభుత్వం సకాలంలో స్పందించి చౌక ధరల సరుకులను రేషన్ డిపోల వేదికగా అందుబాటులోకి తేవడంపై పబ్లిక్ సర్కిల్స్‌లో హర్షం వ్యక్తమవుతోంది.

భారంగా ఇళ్ల నిర్మాణం

హైదరాబాద్ పెన్ పవర్:
దేశీయ రియల్ ఎస్టేట్ రంగాన్ని ప్రస్తుతం ధరల మంట తీవ్రంగా వేధిస్తోంది. నిర్మాణ రంగానికి అత్యంత కీలకమైన సిమెంట్, ఇనుము , ఇటుకలు, కంకర , ఇతర ముడిసరుకుల ధరలు విపరీతంగా పెరగడం కొత్త ప్రాజెక్టుల నిర్మాణ వ్యయాన్ని ఆకాశానికి ఎత్తేసింది. దీనికి తోడు రవాణా ఖర్చులు, నిపుణులైన కార్మికుల వేతనాలు పెరగడంతో ప్రాజెక్ట్ వ్యయాలు అంచనాలను మించిపోతున్నాయని రియల్ ఎస్టేట్ డెవలపర్లు , బిల్డర్ల సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కొంతకాలంగా అంతర్జాతీయ పరిణామాలు, ఇంధన ధరల పెరుగుదల ప్రభావంతో స్టీల్ మరియు సిమెంట్ ధరల్లో తీవ్రమైన హెచ్చుతగ్గులు నమోదవుతున్నాయి. ప్రాజెక్ట్ ప్రారంభంలో అనుకున్న అంచనా వ్యయానికి , ప్రాజెక్ట్ పూర్తయ్యే సమయానికి అవుతున్న వాస్తవ వ్యయానికి మధ్య భారీ వ్యత్యాసం కనిపిస్తోందని డెవలపర్లు వాపోతున్నారు. లాభాల మార్జిన్లు దారుణంగా పడిపోవడమే కాకుండా, ఇప్పటికే ప్రారంభించిన ప్రాజెక్టులను అనుకున్న సమయానికి పూర్తి చేయడం బిల్డర్లకు పెద్ద సవాలుగా మారింది.పెరిగిన నిర్మాణ వ్యయాల భారాన్ని మోయలేక డెవలపర్లు అనివార్యంగా ఆ అదనపు భారాన్ని చదరపు అడుగు రేట్ల రూపంలో గృహ కొనుగోలుదారులపైనే వేయాల్సి వస్తోంది. దీనివల్ల హైదరాబాద్ వంటి మహానగరాల్లో సొంతింటి కల నెరవేర్చుకోవాలనుకునే సామాన్య, మధ్యతరగతి వర్గాలకు ఇళ్ల ధరలు మరింత దూరమవుతున్నాయి. ఇప్పటికే రూ. 50 లక్షల లోపు లభించే అందుబాటు ధరల ఇళ్ల ప్రాజెక్టులు తగ్గిపోయి, సగటు ప్లాట్ , ఫ్లాట్ ధర రూ. 1 కోటికి పైగా చేరుకోవడానికి ఈ నిర్మాణ వ్యయాల పెరుగుదలే ప్రధాన కారణం.ఈ సంక్షోభం నుంచి నిర్మాణ రంగాన్ని గట్టెక్కించేందుకు ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని నరెడ్కో , క్రెడాయ్ వంటి రియల్టర్ల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. నిర్మాణ సామాగ్రిపై విధిస్తున్న జీఎస్టీ శ్లాబులను తగ్గించాలని, సిమెంట్ మరియు స్టీల్ ధరల కృత్రిమ పెంపుదలను అరికట్టేందుకు ఒక నియంత్రణ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాయి. ప్రాజెక్టుల నిర్మాణ వ్యయం తగ్గితేనే గృహ కొనుగోలుదారులకు ఉపశమనం లభించడంతో పాటు రియల్ ఎస్టేట్ మార్కెట్ స్థిరమైన వృద్ధి సాధిస్తుందని బిల్డర్లు పేర్కొంటున్నారు.

యువకెరటం జయకేతనం!

శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ తర్వాత మరో దేశమైన సెర్బియాలో సైతం యువతరం తడాఖా చూపింది. ఆగ్నేయ యూరోప్‌లో డాన్యూబ్, సావా నదుల సంగమస్థలమైన దాని రాజధాని నగరం బెల్‌గ్రేడ్ సోమవారం లక్షలమంది జనంతో ఉప్పొంగిపోయింది. ఒక నాయకుడంటూ లేకుండా, నిర్దిష్టమైన విధివిధానాలు రూపొందించుకోకుండా విద్యార్థులు ఏకమై నెలకొల్పిన స్టూడెంట్ లిస్ట్ పార్టీ 53.3 శాతం ఓట్లతో, 140 స్థానాల్లో జయభేరి మోగించటం ఆ విజయోత్సవానికి కారణం. 250 స్థానాలున్న పార్లమెంటుకు పన్నెండేళ్ల క్రితం అధికారంలోకొచ్చిన ప్రస్తుత అధ్యక్షుడు అలెక్సాండర్ వూచిచ్ ఆ పక్కనున్న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను ఆదర్శంగా తీసుకుని రెండుసార్లు అధ్యక్షుడిగా పనిచేసి, మూడోసారికి కుదరదు గనుక ప్రధానిగా తిరిగొద్దామని ఎత్తుగడ వేశారు. కానీ తన పొరుగునున్న హంగేరీ అధ్యక్షుడు విక్టర్ ఒర్బాన్‌కు ఏమైందో గమనించుకోలేదు. తన మాదిరే ఎన్నికల సంఘం మొదలుకొని న్యాయవ్యవస్థ, మీడియా, పారిశ్రామికరంగం వరకూ అన్నిటినీ అధీనంలోకి తెచ్చుకుని తిరుగులేని అధికారం చలాయించిన ఒర్బాన్ పదహారేళ్ల అనంతరం మొన్న మే నెలలో పదవీచ్యుతుడయ్యారు. దాన్నుంచి వూచిచ్ ఏమీ నేర్చుకోలేదు సరిగదా... అవినీతి భూతాన్ని అదుపు చేద్దామన్న స్పృహ కూడా కొరవడింది. శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ దేశాల్లో యువతరం హింసామార్గానికి మళ్లింది. అధికార సౌధాలపై దాడులకు దిగింది. పాలకుల్ని తరిమికొట్టింది. కానీ సెర్బియా యువతరం ఇందుకు భిన్నం. ప్రభుత్వం ఎంత రెచ్చగొట్టినా శాంతియుత మార్గాన్ని వీడలేదు. అందుకే రెండేళ్లనుంచి ఉద్యమం నిలకడగా సాగింది. దాన్ని అణిచేయటానికి వూచిచ్ చేయని ప్రయత్నమంటూ లేదు. తుపాకుల ప్రయోగం మినహా చేయాల్సిందంతా చేశారు. రాత్రి వేళల్లో అరెస్టులు, లాఠీచార్జిలు, పెప్పర్ స్ప్రే ప్రయోగాలు, ఉద్యమవేదికల్ని హఠాత్తుగా నిషేధిత ప్రాంతాలుగా ప్రకటించటం వగైరాలన్నీ ఉపయోగించారు. మాఫియా ముఠాలను రంగంలోకి దించారు. చురుగ్గా పనిచేసే నేతల్ని బెదిరించటం, దౌర్జన్యానికి దిగటం, ప్రధాన నగరాల్లో ప్రభుత్వ భవనాల దరిదాపుల్లోకొచ్చే యువకుల్ని బెదర గొట్టడం, ఇళ్లకు వెళ్లి చంపేస్తామని బెదిరించటం ఈ ముఠాల పని. ఉద్యమ నేతలను విదేశీ శక్తుల కిరాయిమనుషులుగా అనుకూల మీడియా సాగించిన ప్రచారం... ఉద్యమ కారుల బంధుమిత్ర గణం ద్వారా జనానికి చేరే సమాచారం ముందు వీగిపోయింది. విద్యార్థులు స్టూడెంట్ లిస్ట్ నేతలుగా వెలిగిపోవాలనుకోలేదు. నిజానికి 250 మంది జాబితాలో ఒక్క విద్యార్థి కూడా లేడు. రైతుల్ని, విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లను, నటుల్ని, ఒపేరా గాయకుల్ని, క్రీడాకారుల్ని, వైద్యరంగ నిపుణుల్ని అభ్యర్థులుగా ఎంపిక చేసు కున్నారు. సంప్రదాయ పద్ధతుల్లో పార్టీ నెలకొల్పాలా వద్దా అని ఊగిసలాడినా చివరకు వివిధ నగరాలు, పట్టణాల్లోని కూడళ్లలో తరచు చర్చావేదికలు నిర్వహిస్తూ వచ్చారు. అక్కడే విధానాలు ఖరారయ్యేవి. ఆ విధానాలే ఇప్పుడు విజయాన్నిచ్చాయి. అయితే వూచిచ్ ఇంత త్వరగా పదవినుంచి తప్పుకుంటారని వారనుకోలేదు. బహుశా ఇదే బెల్‌గ్రేడ్‌లో 1903లో తన పేరేగల రాజుపై సైన్యం తిరుగుబాటుచేసి ఆయన్ని కిటికీ నుంచి విసిరేయడం గుర్తొచ్చి ఉండాలి. సైన్యం బలంతో అధికారానికి అంటిపెట్టుకుంటే కష్టాలు చవిచూడాల్సి వస్తుందని వూచిచ్ సరిగానే అంచనా వేసుకున్నారు. ఇంతకూ ఓడింది బ్రెజిల్‌లో మాదిరే మితవాద, జాతీయవాద పక్షమైనా... నెగ్గిందెవరో చెప్పటం అంత సులభం కాదు. వారు ఉదారవాదులనీ, అమెరికా డీప్ స్టేట్ ఏజెంట్లనీ వూచిచ్ ప్రచారం చేశారు. అటు ట్రంప్‌కు సైతం అలాంటి ఆశ ఉంది. బెల్‌గ్రేడ్‌లో ట్రంప్ టవర్‌కు వూచిచ్ అనుమతించకపోవడం ఆయనకు ఆగ్రహం కలిగించింది. కానీ స్టూడెంట్ లిస్ట్ అంత తేలిగ్గా అమెరికాను అక్కున చేర్చుకునే రకం కాదు. వారు మౌలికంగా ప్రజాస్వామికవాదులు. జాతీయవాదం తమలో ఏం తక్కువలేదని ఉద్యమ సందర్భంలో చాటారు. యూరోప్ యూనియన్(ఈయూ)లో చేరతామంటూనే సెర్బియా రష్యా వైపు మొగ్గడం ఆ సంస్థకు నచ్చలేదు. స్టూడెంట్ లిస్ట్ పార్టీకి ఈయూపై ఆసక్తే లేదు. మొత్తానికి నిలకడగా, సూత్రబద్ధంగా పోరాడి సాధించిన విజయం పాలనలో ఎన్నెన్ని మలుపులు తిరుగుతుందో వేచి చూడాలి.

డీఏ బకాయిలు.. పెన్షన్‌కు ముప్పు



కరువు భత్యం అంటే ప్రభుత్వం ఉద్యోగికి అదనంగా ఇస్తున్న డబ్బు కాదు. ధరలు పెరిగినప్పుడు వేతనం కొనుగోలు శక్తి తగ్గకుండా కొంతమేర భర్తీ చేయాల్సిన హక్కు. అందుకే డీఏ ఉత్తర్వు వచ్చిన రోజు ఉద్యోగులు దాన్ని కొత్త ప్రయోజనంగా చూడరు. తనకు రావాల్సిన డబ్బు ఎప్పుడొస్తుందా అని ఎదురుచూస్తారు. ఆ ఎదురుచూపు నెలలుగా, ఏండ్లుగా సాగితే అది కేవలం నగదు కొరతగా మిగలదు. ముఖ్యంగా సీపీఎస్ ఉద్యోగికి ప్రతి ఆలస్యమూ అతని రిటైర్మెంట్ భద్రతపై కూడా ప్రభావం చూపుతుంది. ఉద్యోగం చేస్తున్న రోజుల్లో జీతం కనిపిస్తుంది. రేపటి పెన్షన్ కనిపించదు. కానీ ఆ కనిపించని భవిష్యత్తు కోసం ఈరోజే డబ్బు జమ కావాలి.
సీపీఎస్ ఉద్యోగి పరిస్థితి సున్నితమైంది. జీతం నుంచి ప్రతి నెలా చందా మినహాయించి పర్మినెంట్ రిటైర్మెంట్ అకౌంట్ నంబర్ (పీఆర్ఏఎన్) ఖాతాలో జమ చేస్తారు. ఆ డబ్బు మార్కెట్ ఆధారిత పెట్టుబడుల్లోకి వెళ్తుంది మార్కెట్ ఎప్పుడూ ఒకేలా ఉండదు. పెరుగుతుంది, పడిపోతుంది. అందుకే సకాలంలో చందా జమ కావడం ఒక రకంగా క్రమబద్ధమైన పెట్టుబడి విధానంలా పనిచేస్తుంది. మార్కెట్ పడినప్పుడు అదే మొత్తంతో ఎక్కువ యూనిట్లు రావచ్చు. పెరిగినప్పుడు తక్కువ యూనిట్లు రావచ్చు. ఈ ఒడిదొడుకుల మధ్య క్రమంగా పెట్టుబడి కొనసాగడమే దీర్ఘకాలంలో దాని బలం. కానీ ప్రభుత్వం ఉద్యోగికి రావాల్సిన మొత్తాన్ని నెలల తరబడి ఆలస్యం చేసి, మార్కెట్ పరిస్థితులు మారిన తర్వాత జమ చేస్తే..ఆ పెట్టుబడికి దక్కాల్సిన సమయాన్ని మాత్రమే కాదు, ఆ సమయంలో లభించే అవకాశాన్ని కూడా ఉద్యోగి కోల్పోవచ్చు. ఒక చిన్న ఉదాహరణ ఈ నష్టాన్ని అర్థం చేసుకునేలా చేస్తుంది. రిటైర్మెంట్ ఖాతాలో రూ.50 వేలు సకాలంలో జమై, సగటున 8 శాతం వార్షిక రాబడి వచ్చిందని అనుకుంటే..20 ఏండ్లలో అది సుమారు రూ.2.33 లక్షలు అవుతుంది. అదే రూ.50 వేలు మూడేండ్లు ఆలస్యంగా జమైతే పెట్టుబడి కాలం 17 ఏండ్లకు తగ్గి సుమారు రూ.1.85 లక్షలే అవుతుంది. అంటే దాదాపు రూ.48 వేల తేడా. ఇది నేషనల్ పెన్షన్ స్కీమ్ (ఎన్‌పీఎస్)లో హామీ ఇచ్చిన రాబడి కాదు. కేవలం ప్రభావాన్ని అర్థం చేసుకోవడానికి తీసుకున్న ఉదాహరణ మాత్రమే. ఆలస్యమైన డబ్బు తర్వాత జమ చేయవచ్చు..కోల్పోయిన పెట్టుబడి సమయాన్ని మాత్రం తిరిగి జమ చేయలేం. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల ఎన్‌పీఎస్‌పై కంప్ట్రోలర్ అండ్ ఆడిటింగ్ జనరల్ (కాగ్), చందాలు సకాలంలో జమ కాకపోవడం వల్ల పెన్షన్ పొదుపుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశాన్ని గుర్తించింది. ఉద్యోగి చందా ఆలస్యంగా పెట్టుబడిగా మారితే, ఆ మొత్తానికి దక్కాల్సిన పెట్టుబడి కాలం తగ్గుతుంది. అంటే చందా ఆలస్యం అనేది కేవలం లెక్కల్లో ఒక తేదీ మారడం కాదు.
రిటైర్మెంట్ నిధి పెరిగే అవకాశాన్నే తగ్గించడం. అందుకే చందాలు ఆలస్యమైతే ఉద్యోగికి నష్టం కలుగకుండా పరిహారం, వడ్డీ, బాధ్యుల జవాబుదారీతనం వంటి అంశాలను కేంద్ర నిబంధనలు కూడా ప్రస్తావించాయి. అయితే కరువు భత్యం (డీఏ) బకాయిల విషయంలోనూ ఇదే సూత్రాన్ని వర్తింపజేయాల్సిన అవసరం ఉన్నది. ఇక్కడే అసలు బాధ మొదలవుతుంది. ఇరవై, ముప్పై ఏండ్లు ప్రభుత్వానికి సేవ చేసిన ఉద్యోగులు రిటైర్ అయ్యే నాటికి తన జీవితానికి ఒక భరోసా ఉంటుందని ఆశిస్తారు. కానీ సీపీఎస్‌లో రిటైర్మెంట్ తర్వాత వచ్చే ఆదాయం ఎంత ఉంటుందన్నది ముందుగానే కచ్చితంగా చెప్పలేం. ఇప్పటికే కొందరు రిటైర్డ్ ఉద్యోగులు తమకు నెలకు నాలుగు, ఐదు వేల రూపాయల స్థాయిలోనే పెన్షన్ వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఒక్కరి పరిస్థితి ఒకేలా ఉండకపోయినా, ఈ అనుభవం ఒక పెద్ద ప్రశ్నను లేవనెత్తుతున్నది. ప్రభుత్వానికి ఇరవై, ముప్పై ఏండ్లు సేవ చేసిన తర్వాత కూడా వృద్ధాప్యంలో ఆర్థిక భద్రతపై ఇంత అనిశ్చితి ఉంటే, ఉద్యోగికి తన భవిష్యత్తుపై భరోసా ఎలా ఉంటుంది? ప్రభుత్వం కూడా ఒక విషయాన్ని గుర్తించాలి. ఆర్థిక భారం తగ్గించుకోవడానికి డీఏ బకాయిలను విడతల్లో చెల్లించడం ఒక పరిపాలనా నిర్ణయం కావచ్చు. కానీ రిటైర్మెంట్ ఖాతాకు వెళ్లాల్సిన ఉద్యోగి, ప్రభుత్వ చందాలను మాత్రం ఆ విడతల కోసం ఆపకూడదు. డీఏ బకాయి విడుదలైన వెంటనే ఉద్యోగి వాటాతోపాటు ప్రభుత్వ వాటాను కూడా పీఆర్ఏఎన్ ఖాతాలో జమ చేయాలి. ప్రతి నెలా సాధారణ చందా కూడా నిర్ణీత గడువులో జమయ్యేలా ఆటోమేటిక్ వ్యవస్థ ఉండాలి. ఉద్యో గి తన డబ్బు కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండకూడదు. అతని ఖాతాలో డబ్బు ఎప్పుడు జమైందో, ఎంత జమైందో స్పష్టంగా కనిపించేలా వ్యవస్థ ఉండాలి. ఉద్యోగి భవిష్యత్తు భద్రతకు సంబంధించిన డబ్బును 'తర్వాత చూద్దాం' అనే ఖాతాలో పెట్టలేం. ఒక డీఏలోని రూ.50 వేల రిటైర్మెంట్ భాగం మూడేండ్లు ఆలస్యమైతే పైన తెలిపిన ఉదాహరణ లెక్క ప్రకారం దాని భవిష్యత్తు విలువలో దాదాపు రూ.48 వేల తేడా కనిపిస్తున్నది. ఇంకా చెల్లించాల్సిన డీఏ బకాయిలు, భవిష్యత్తులో ఆలస్యమయ్యే చందాలు కూడా ఇదే విధంగా ప్రభావితం చేస్తే.. నష్టం ఒక్క ఉద్యోగికి మాత్రమే పరిమితం కాదు. ప్రజలకు సేవ చేయాల్సిన వ్యక్తి తన ఉద్యోగం గురించి, వృద్ధాప్యం గురించి ఆందోళన పడుతూ పనిచేయాల్సిన పరిస్థితి ఏ వ్యవస్థకూ మంచిది కాదు. ఉద్యోగి భవిష్యత్తుపై నమ్మకం కల్పించడం కూడా ప్రభుత్వ బాధ్యతే. డీఏ బకాయిలను ఎప్పుడు చెల్లిస్తారనేదే కాదు..సీపీఎస్ ఉద్యోగికి రావాల్సిన మొత్తాన్ని ఎప్పుడు పీఆర్ఏఎన్ ఖాతాలో జమ చేస్తారన్నదీ ముఖ్యమే. 2030 ఏండ్లు ప్రభుత్వానికి సేవ చేసిన తర్వాత వృద్ధాప్యంలో భరోసా కోసం ఎదురుచూసే పరిస్థితి రాకూడదు. ఉద్యోగి జీవితమంతా చెల్లించిన చందాలు, రావాల్సిన బకాయిలు చివరికి అతని వృద్ధాప్యానికి అండగా నిలవాలి. డబ్బు ఆలస్యంగా ఇవ్వొచ్చు.. కానీ ఆ డబ్బు పెరగాల్సిన కాలాన్ని మళ్లీ ఇవ్వలేం.

మేము కూడా అంతే ఆర్గానిక్ ఎలక్షన్స్ కు వెళుతున్నాం!

విజయవాడ: పెన్ పవర్: మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల రాజకీయాన్ని ఆర్గానిక్ వ్యవసాయంతో పోల్చిన ఆయన గుంటూరు మేయరు అభ్యర్థిగా పోటీ చేస్తున్న తాడికొండ శ్రీదేవి తరఫున తమ పార్టీ మద్యం, డబ్బు పంచమని, గెలిపిస్తే మంచి పాలన అందిస్తామని వ్యాఖ్యానించారు. తాము నగరంలో ఆర్గానిక్ ఎలక్షన్స్ చేస్తామని అంబటి వ్యాఖ్యానించారు. "ఆర్గానిక్ వ్యవసాయం తెలుసు కదా' మందులు వేయరు, ఎరువులు వేయరు. కానీ, పంట చాలా రుచిగా ఉంటుంది. మేము కూడా అంతే ఆర్గానిక్ ఎలక్షన్స్ కు వెళుతున్నాం, మందులు, ఎరువులు వేయం" అంటూ చెప్పారు. పరోక్షంగా తాము ఎన్నికల్లో డబ్బు ఖర్చు చేయమని, మద్యం సరఫరా చేయమని స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో తాము ఘోరంగా ఓడిపోయామని వ్యాఖ్యానించిన అంబటి తమ పార్టీ తరఫున ఎన్నికల్లో ఎటువంటి ఖర్చు చేయమని విస్పష్టంగా ప్రకటించడం హాట్ టాపిక్ అవుతోంది. విపక్షం వైసీపీలో మంచి మాటకారిగా అంబటి రాంబాబుకు పేరుంది. ముఖ్యంగా అధికార కూటమి పాలనను తనదైన శైలిలో విమర్శిస్తూ నిత్యం మీడియాను ఆకర్షిస్తుంటారు అంబటి. రెండు రోజుల క్రితం రాష్ట్రంలో ధరల పెరుగుదలను ఎండగడుతూ 'బియ్యం కిలో వంద రూపాయలు అయినందుకు చంద్రబాబు, లోకేశ్ కు ట్యాంక్స్' అంటూ ట్వీట్ చేసి అధికార పక్షంపై వ్యంగ్యాస్త్రాన్ని సంధించారు. ఒక్క మాటతో తమ అజెండాను వివరించిన అంబటి, ప్రజలు నిత్య జీవితంలో ఎదుర్కొంటున్న సమస్యను హైలెట్ చేశారని అంటున్నారు. ఇక తాజాగా తమ పార్టీ పరిస్థితిని వివరిస్తూ ఆర్గానిక్ ఫార్మింగ్ ను ఉదహరించడంపై నెట్టింట ఆసక్తికర చర్చ జరుగుతోంది.

ఆర్గానిక్ ఫార్మింగ్ కు ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తమ పార్టీ కూడా ఆర్గానిక్ ఎన్నికలకు వెళుతున్నట్లు అంబటి చెప్పడం ఆకర్షించిందని అంటున్నారు. ఓడిపోయిన తమ వద్ద డబ్బు లేదని చెప్పడంతోపాటు తమ పార్టీ తరఫున నిలిపిన అభ్యర్థి సైతం పేద ఆర్యవైశ్య కులానికి చెందిన వారంటూ చెప్పి ఆ వర్గాన్ని ఆకట్టుకునే ప్రయత్నం చేశారని అంటున్నారు. ఇదే సమయంలో ఆర్యవైశ్య సామాజికవర్గానికి చెందిన ప్రముఖులు తమ అభ్యర్థి తాడికొండ శ్రీదేవికి పార్టీలకు అతీతంగా ఓటు వేయాలని, ప్రతి ఒక్కరూ రూపాయి చొప్పున సాయం చేయాలని కోరారు. నోటు ఇవ్వాలి.. ఓటు వేయాలి అంటూ ఆయన ఆర్యవైశ్యులకు పిలుపునిచ్చారు.టీడీపీ అభ్యర్థి ఆర్థికంగా ఉన్నవారని, వారిని డబ్బుతో ఢీకొట్టలేమని అంబటి పరోక్షంగా అంగీకరించారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.డబ్బు ఖర్చు చేయనిదే ఎన్నికల్లో పాల్గొనలేని నేటి పరిస్థితుల్లో అంబటి చేసిన తాజా వ్యాఖ్యలు హాట్ టాపిక్ అవుతున్నాయి. ప్రధానంగా ఈ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి నుంచి ఎలాంటి తాయిళాలు ఆశించవద్దని పార్టీ కేడర్ తోపాటు ఓటర్లకు మాజీ మంత్రి అంబటి సంకేతాలిచ్చారని విశ్లేషిస్తున్నారు. ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల్లో అధికార కూటమి, వైసీపీ మధ్య పోటీపై రకరకాల విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా అధికారపక్షం తీరుపై విపక్షం ఘాటు విమర్శలు చేస్తోంది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి అంబటి ఓటర్లను ఆలోచనలకు గురిచేసేలా మాటలతో మాయ చేస్తున్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

పోలింగ్ కి కౌంట్ డౌన్ : జనం నాడి చిక్కుతుందా ?

విజయవాడ: పెన్ పవర్: ఏపీలో దాదాపుగా 30 నెలల తరువాత జనాలు ఓటు వేయబోతున్నారు. అయిదు విడతలుగా స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తొలి విడతకు నవంబర్ 1న తెర లేవనుంది. మొదటి విడతలో అర్బన్ బాడీస్ కి ఎన్నికలు జరుగుతున్నాయి. 87 మునిసిపాలిటీస్, 13 కార్పోరేషన్లు మొత్తంగా 100 చోట్ల ఎన్నికలు నిర్వహిస్తున్నారు. నవంబర్ 1వ తేదీ ఏపీలో ఒక బిగ్ జడ్జిమెంట్ డే గా ఉండబోతోంది. ఏపీలో 2024 మే 13న సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. 25 ఎంపీ, 175 ఎమ్మెల్యే సీట్లకు ఒకేసారి నిర్వహించిన ఈ ఎన్నికల ఫలితాలు జూన్ 4న విడుదల అయ్యాయి. ఆ ఎన్నికల్లో టీడీపీ కూటమి 95 సీట్ల షేర్ తో భారీ విజయాన్ని నమోదు చేసింది.

ప్రాధాన్యత అందుకే :

నామమాత్రంగా వైసీపీ మిగిలింది. ఇక కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయి రెండున్నరేళ్ళ తరువాత స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ మధ్యలో ప్రజల ఆలోచనలు ఎలా ఉన్నాయి, ప్రభుత్వ విధానాల మీద ప్రజలు ఏమనుకుంటున్నారు కూటమి పాలన సంతృప్తిని ఇచ్చిందా లేదా అన్నది ఎంతో కొంత స్థానిక సంస్థల ఎన్నికల రూపంలో తెలుస్తుందా అన్నది అయితే చర్చగా ఉంది. ఎందుకంటే ఈ మధ్యలో మరే ఎన్నిక కానీ ఏ రకమైన తీర్పు కానీ జనం వైపు నుంచి రాలేదు, దాంతో స్థానిక సంస్థల ఎన్నికలకు అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. దాంతో స్థానిక సంస్థల ఎన్నికలను అటు అధికార కూటమి ఇటు విపక్ష వైసీపీ కూడా చాలా సీరియస్ గానే తీసుకున్నాయి. దాంతో నామినేషన్ల పర్వం నుంచే ఘర్షణ వాతావరణం ఏర్పడింది అని గుర్తు చేస్తున్నారు.

సహజంగా చూస్తే :

ఇక స్థానిక సంస్థల ఎన్నికల తీరు చూస్తే సహజంగా అధికారంలో ఎవరు ఉంటారో వారి వైపే జనం తీర్పు ఉంటుంది. ఎందుకంటే ప్రభుత్వంలో ఉన్న పార్టీలకు ఓటు చేస్తే తమకు మేలు జరుగుతుందని, స్థానికంగా తమ ప్రాంతాలలో అభివృద్ధి జరుగుతుందని భావిస్తారు. అంతే కాదు ప్రభుత్వంతో కలసి నడవాలని మెజారిటీ జనాలు అనుకుంటారు. దాంతో స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల మీద పెద్దగా అంచనాలు అయితే రాజకీయంగా లేకపోయినా కొన్ని చోట్ల నుంచి వచ్చే విలక్షణ తీర్పులు మాత్రం ప్రత్యేకం అవుతాయి. వాటినే పట్టుకుని నిశితంగా పరిశీలన చేయడం జరుగుతుంది.

ఏకమొత్తంగా అంటూ :

ఇక ఏకమొత్తంగా నూరు శాతం స్ట్రైక్ రేట్ ని కూటమి పార్టీలు సాధించాలని ఆ వైపు నుంచి ఘనమైన నినాదం వినిపిస్తోంది. 2024లో వచ్చిన రిజల్ట్ నే రిపీట్ చేయాలని కూడా కూటమి పార్టీలు కోరుకుంటున్నాయి. అదే సమయంలో రెండున్నరేళ్ల పాలన అంటే సగం పూర్తి అయినట్లే. దాంతో ఎక్కడో ఒక చోట అసంతృప్తి ఉంటుంది అని దానిని వెలికి తీస్తే తమకు 2029 ఎన్నికలకు దారి దొరికినట్లే అని విపక్ష వైసీపీ భావిస్తోంది. అందుకే ఈసారి స్థానిక ఎన్నికల్లో గట్టిగా తేల్చుకోవాలని వైసీపీ భావిస్తోంది. మొత్తం ఫలితాలు ఒక్కలా ఉండవని ఎంతో కొంత తేడా కనిపించినా అది తన విజయంగా భావించాలని దానినే పెద్దది చేసి చూపించాలని తద్వారా ప్రజల నాడిని పట్టుకుని ఇదే రేపటి సార్వత్రిక ఎన్నికల్లో తీర్పుగా మార్పుగా చూడాలని వైసీపీ భావిస్తుంది అన్నది కూడా ఉంది.

మంచిదే కదా :

అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏ మాత్రం ప్రతికూలత ఎక్కడ వచ్చినా దానిని సరిదిద్దుకునే చాన్స్ అధికార కూటమికి కచ్చితంగా ఉంటుంది. చేతిలో ఇంకా సగం పాలన ఉంటుంది కాబట్టి ఆ విధంగా చక్కబెట్టుకుని 2029 నాటికి గట్టిగా జనం వద్దకు వెళ్ళవచ్చు. అలా జనం ఏమనుకుంటున్నారు అన్నది తెలియడం అధికారంలో ఉన్న వారికే అవసరం అని అంటున్నారు. మరి అలా జరుగుతుందా జనం ఎక్కడైనా తమ భావనలు బయట పెడతారా లేదా గుంభనంగా ఉంటూ అధికార కూటమికే జై కొడతారా అన్నదే చూడాల్సి ఉంది. మొత్తం మీద చూస్తే కనుక లోకల్ బాడీస్ లో ఎంతో కొంత జనం నాడి పట్టడానికి పార్టీలే కాదు రాజకీయ విశ్లేషకులు కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరి అలా జరుగుతుందా లేదా అన్నదే ఇంట్రెస్టింగ్ మ్యాటర్.

పనబాక కుమార్తెకు కీలక పదవి.. టీడీపీ అధిష్టానం సంకేతాలు

విజయవాడ: పెన్ పవర్: తిరుపతి జిల్లా పరిషత్ మొదటి ఛైర్‌పర్సన్‌గా కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి కుమార్తె డాక్టర్ పనబాక చేతన పేరు పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎస్సీ మహిళకు రిజర్వు అయిన తిరుపతి జడ్పీ ఛైర్‌పర్సన్ పదవిని చేతనతోపాటు మాజీ ఎమ్మెల్యే హేమలత ఆశిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే యవత, విద్యావంతురాలు అన్న ఆలోచనతో అధిష్టానం డాక్టర్ చేతన పేరుపై మొగ్గు చూపుతోందని టాక్ నడుస్తోంది. ఇప్పటికే డాక్టర్ చేతన పేరును ఖరారు చేసిందని, అధికారిక ప్రకటన ఒక్కటే విడుదల చేయాల్సివుందని అంటున్నారు. సీనియర్ నాయకురాలు పనబాక లక్ష్మి సేవలు, సుదీర్ఘ రాజకీయ అనుభవానికి తగిన న్యాయం చేయాలనే ఆలోచనతో టీడీపీ అధిష్టానం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

తొలి ఛైర్‌పర్సన్‌గా చేతన

తిరుపతి జిల్లా కొత్తగా ఏర్పడిన తర్వాత జిల్లా పరిషత్‌కు జరుగుతున్న తొలి ఎన్నికలు ఇవి. నెల్లూరు జిల్లాలోని సూళ్లూరుపేట, వెంకటగిరి అసెంబ్లీ నియోజకవర్గాలు తిరుపతి జిల్లా పరిధిలోకి చేరడంతో జడ్పీ పరిధి కూడా విస్తరించింది. ఈ నూతన జిల్లా పరిషత్‌కు తొలి ఛైర్‌పర్సన్‌గా విద్యావంతురాలు, యువ నాయకురాలు డాక్టర్ పనబాక చేతన పేరును అధిష్టానం ఖరారు చేసేందన్న ప్రచారం ఆసక్తి రేపుతోంది. శ్రీకాళహస్తి రూరల్ జడ్పీటీసీ సభ్యురాలిగా చేతన ఇప్పటికే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజకీయంలోకి కొత్తగా అడుగుపెట్టినప్పటికీ, మొదటి ప్రయత్నంలోనే జడ్పీటీసీగా ఏకగ్రీవంగా గెలుపొంది తన సత్తా చాటారు. ఇప్పుడు అధిష్టానం అవకాశం ఇస్తే, తిరుపతి జిల్లా పరిషత్‌కు మొట్టమొదటి జడ్పీ ఛైర్‌పర్సన్గా చరిత్రకెక్కే అవకాశముందని అంటున్నారు.

పనబాక లక్ష్మి సీనియార్టీకి గుర్తింపు

కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి 2014 సార్వత్రిక ఎన్నికల అనంతరం టీడీపీలో చేరారు. 2019 సాధారణ ఎన్నికలతో పాటు, ఆ తర్వాత జరిగిన తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికలోనూ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేశారు. పార్టీ పట్ల ఆమె చూపిన నిబద్ధత, సీనియార్టీని గుర్తించిన అధిష్టానం ఆమెకు టిటిడి బోర్డు సభ్యురాలిగా అవకాశం కల్పించింది. అయినప్పటికీ, ఆమె ఉన్నత స్థాయి రాజకీయ అనుభవానికి తగినంత గుర్తింపు ఇంకా దక్కలేదన్న అభిప్రాయం పార్టీ శ్రేణుల్లో ఉందని అంటున్నారు. ఈ నేపథ్యంలోనే పనబాక లక్ష్మి కుమార్తె చేతనకు జిల్లా స్థాయిలో అత్యున్నతమైన జడ్పీ ఛైర్‌పర్సన్ పదవిని కట్టబెట్టడం ద్వారా పనబాక కుటుంబానికి తగిన ప్రాధాన్యం ఇచ్చామని స్పష్టం చేయాలని టీడీపీ యోచిస్తోందని అంటున్నారు.

ఉన్నత విద్యావంతురాలు

డాక్టర్ పనబాక చేతన డెర్మటాలజీ (చర్మ వైద్యం)లో ఎండి చేసిన ఉన్నత విద్యావంతురాలు. కేంద్ర మంత్రిగా పనిచేసినా ఎప్పుడూ వినయం, సౌశీల్యం, మృదుభాషణ విడవని పనబాక లక్ష్మి పెంపకంలో పెరిగిన చేతన, అదే సంస్కారాన్ని పుణికిపుచ్చుకున్నారని ప్రశంసలు అందుకుంటున్నారు. రాజకీయంగా ప్రత్యర్థులు కూడా గౌరవించే వ్యక్తిత్వం పనబాక లక్ష్మి సొంతమని, అటువంటి విలువలున్న కుటుంబం నుంచి వచ్చిన చేతన టీడీపీకి అత్యంత గౌరవప్రదమైన అభ్యర్థి అవుతారనడంలో సందేహం లేదని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. గతంలో పనబాక లక్ష్మి తిరుపతి లోక్‌సభకు పోటీ చేసిన సమయంలో చేతన విస్తృత ప్రచారం చేశారు. ఇప్పుడు ఆ స్వల్ప రాజకీయ అనుభవంతో ఏకంగా జడ్పీ ఛైర్‌పర్సన్ పీఠం దక్కించుకుంటున్నారని వ్యాఖ్యానిస్తున్నారు.

నిజాయతీపరుడైన అధికారిని కోల్పోయాం..

విజయవాడ: రిటైర్డ్ డీజీపీ ఎన్. బాలసుబ్రహ్మణ్యం అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన మృతి పట్ల ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు మరియు మంత్రి నారా లోకేశ్ తీవ్ర సంతాపంవ్యక్తం చేశారు. బాలసుబ్రహ్మణ్యం నిజాయతీకి, నిబద్ధతకు మారుపేరని, ఆయన మరణం తనను తీవ్ర విచారానికి గురిచేసిందని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు స్పందిస్తూ..

"బాలసుబ్రహ్మణ్యం గారు నిజాయతీ విషయంలో ఎన్నడూ రాజీపడని అధికారి. దృఢమైన నిర్ణయాలు, ప్రగతిశీల ఆలోచనలతో ఆయన ఎంతో గౌరవం సంపాదించుకున్నారు. పోలీసింగ్, ఇంటెలిజెన్స్, రవాణా, ప్రభుత్వ పాలన వంటి వివిధ శాఖల్లో తనదైన ముద్ర వేశారు. సంస్కరణలు, నూతన ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని ఆయన నిరంతరం ప్రోత్సహించేవారు. కొన్ని నెలల క్రితం వరకు కూడా ఆంధ్రప్రదేశ్‌కు ఆయన తన అనుభవంతో విశేష సేవలు అందించారు. అనారోగ్యంతో పోరాడుతున్న సమయంలోనూ అసాధారణ ధైర్యాన్ని ప్రదర్శించారు. ఆయన మరణం రాష్ట్రానికి తీరని లోటు" అనివ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నారా లోకేశ్ కూడా బాలసుబ్రహ్మణ్యం మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి, ఏపీఎస్ఆర్టీసీమాజీ వైస్ చైర్మన్ అండ్ ఎండీ బాలసుబ్రహ్మణ్యం అమెరికాలో చికిత్స పొందుతూ కన్నుమూశారని తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని పేర్కొన్నారు. "నిజాయతీ, అంకితభావంతో విధులు నిర్వర్తించిముక్కుసూటి మనిషిగా పేరుపొందిన బాలసుబ్రహ్మణ్యం గారి సేవలు చిరస్మరణీయం. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. పరిపాలనానైపుణ్యం, ఆధునిక పోలీసింగ్‌కు ఆయన ఒక మూలస్తంభం వంటి వారు. ప్రజా సేవలో ఆయన చూపిన అంకితభావం, ధైర్యం ఎప్పటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయి" అని లోకేశ్ నివాళులర్పించారు.

విశాఖ విజయవాడ.... హీటెక్కించే రిజల్ట్స్ !

ఏపీలో మొత్తం 13 కార్పోరేషన్లకు నవంబర్ 1న పోలింగ్ జరగబోతోంది. అందులో ఉత్తరాంధ్రా గోదావరి కోస్తా రాయలసీమ జిల్లాలలో కార్పొరేషన్లు ఉన్నాయి. అయితే అందరి దృష్టిని ఆకట్టుకుంటున్నవి రెండే కార్పోరేషన్లు అని అంటున్నారు. దానికి కారణాలు అనేకం ఉన్నాయి. ఏపీలో అతి పెద్ద కార్పొరేషన్ గా విశాఖ ఉంది. 120 వార్డులు అంటే ఏపీలో మరెక్కడా లేవు. అలాగే టాప్ టెన్ కార్పోరేషన్లలో దేశంలో ఒకటిగా జీవీఎంసీ ఉంది. ఆదాయంలో అభివృద్ధిలో అలాగే ఏపీలో మెగా సిటీగా విశాఖ ఉంది. విశాఖ మీద ఏ ప్రభుత్వం ఉన్నా ప్రత్యేక ఫోకస్ పెడుతుంది. దాంతో విశాఖను గెలుచుకోవాలని పట్టుదలతో రాజకీయ పక్షాలు చూస్తాయి. ఇక తెలుగుదేశం పార్టీ విషయానికి వస్తే విశాఖ ఒక సెంటిమెంట్ గా ఉంది. 1987లో తొలిసారి ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నికలు జరిగినపుడు టీడీపీ మేయర్ సీటుని గెలుచుకుంది. అది జరిగిన తరువాత దాదాపు నాలుగు దశాబ్దాల టీడీపీ విశాఖ మేయర్ పీఠం కోసం ఎదురు చూడాల్సి వచ్చింది. అందుకే ఈసారి కూటమి పార్టీలు కోరినా ఇవ్వకుండా తానే పోటీ పడుతోంది.

ఎపుడూ భిన్నంగానే :

విశాఖ ఓటర్లు ఎప్పుడూ భిన్నంగా తీర్పు ఇస్తారు. వారు అభివృద్ధిని కోరుకుంటారు. దానితో పాటు ప్రశాంతత ఈ ప్రాంతం స్పెషాలిటీ. అందుకే రాజకీయ పక్షాలు కూడా ఇక్కడ సాఫీగానే ప్రచారం చేస్తూ వస్తాయి. టీడీపీ కూటమికి అయితే తమకు మేయర్ పీఠం కచ్చితంగా దక్కుతుందని నమ్మకం ఉంది. పైగా జీవీఎంసీ పరిధిలో ఎమ్మెల్యేలు, ఎంపీలు అంతా కూటమికి చెందిన వారే. దాంతో గెలుపు నల్లేరు మీద నడక అని భావిస్తున్నా ఎక్కడా తగ్గడం లేదు, ఎందుకంటే ప్రజా క్షేత్రంలో పోరు ఎప్పటికప్పుడు వెరైటీగానే ఉంటుంది. పైగా 18 లక్షల ఓటర్లు ఓటు వేయబోతున్నారు. 2024 తరువాత కొత్త ఓటర్లు, జెన్ జీలు ఉన్నారు.

వైసీపీ గట్టిగానే :

వైసీపీ కూడా విశాఖ మేయర్ సీటు విషయంలో గట్టిగానే పోటీ పడుతోంది. తమకు బలం ఉందని నిరూపించుకునే ప్రయత్నం చేస్తోంది. అభ్యర్థి విషయంలో వైసీపీ సక్సెస్ అయింది. ఎమ్మెల్సీగా ఉన్న వరుదు కళ్యాణిని నిలబెట్టి జనానికి పరిచయం ఉన్న బీసీ మహిళతో రాజకీయంగా ముందుకు సాగుతోంది. ప్రధానంగా కూటమి ప్రభుత్వం మీద వచ్చే యాంటీ ఇంకెంబెన్సీ మీదనే వైసీపీ ఆశలు పెట్టుకుంది. అలాగే కూటమిలో లుకలుకలు ఉంటే అవి తమకు ఎంతో కొంత అనుకూలిస్తాయేమో అన్నది కూడా వైసీపీలో ఎక్కడో ఉంది అని అంటున్నారు. దాంతో తీర్పు విషయంలో ఉత్కంఠ ఉంది అంటున్నారు.

వంగవీటి బ్రాండ్ తో :

ఇక విజయవాడ మీద అందరి చూపు ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఎదురు చూస్తే మరో తీర్పుగా దీనిని చూడాలి. పుష్కర కాలం తరువాత ప్రత్యక్ష ఎన్నికల్లో వంగవీటి రాధాక్రిష్ణ మేయర్ సీటుకు పోటీగా ఉన్నారు. ఆయన జనసేన నుంచి బరిలో ఉండడం రాజకీయంగా సామాజికపరంగా మరో ఆసక్తిని పెంచే పరిణామం. అలాగే వంగవీటి బ్రాండ్ పొలిటికల్ గా ఎపుడూ గట్టిగానే పనిచేస్తుంది. ఈసారి కూడా అదే మ్యాజిక్ రిపీట్ అవుతుందని కూటమి నమ్మకంగా ఉంది. టీడీపీ జనసేన కలసికట్టుగా బరిలోకి దిగుతోంది కాబట్టి రిజల్ట్ ఇక్కడ రీ సౌండ్ చేస్తుంది అంటున్నారు.

ఏబీవీ ఎంట్రీతో :

ఇక వైసీపీ నుంచి మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి పోటీకి దిగారు. బీసీ ఓటుతో వైసీపీ ఇక్కడ ట్రంప్ కార్డునే వాడుతోంది. బీసీలు వలస వచ్చి నివాసం ఉంటున్న వారు మైనారిటీలు తమ వైపు అని వైసీపీ భావిస్తోంది. ఇక మేయర్ గా అయిదేళ్ళు పనిచేసిన భాగ్యలక్ష్మి అందరికీ తెలిసిన వారుగా ఉంటారు కాబట్టి ప్లస్ అవుతుందని ఊహిస్తోంది. అయితే రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు ఎంట్రీతోనే అసలు ఇంట్రెస్ట్ మొదలైంది. ఆయన ఒక బలమైన సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో ఆయన ప్రభావం ఎంత ఉంటుంది, ఏ మేరకు ఉంటుంది అన్నదే చర్చగా ఉంది. అలాగే ఆయన తీసుకునే ఓట్లు ఎవరికి నష్టం చేకూరుస్తాయి అన్నది మరో చర్చ. ఆయన ఎంట్రీతో వైసీపీ నష్టపోతుంది అని ఒక విశ్లేషణ ఉంటే టీడీపీకి కొంత ఇబ్బంది అని మరో చర్చగా ఉంది. ఏది ఏమైనా విజయవాడ అంటే రాజకీయ రాజధాని, ఇక్కడ మేయర్ అంటే నగర ప్రథమ పౌరుడు. అందువల్ల ఈ ఎన్నిక మీద ఏపీ మొత్తం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. అలా ఏపీలో విశాఖ విజయవాడ ఎన్నికల ఫలితాలు అయితే హీటెక్కించబోతున్నాయని అంటున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

అమెరికన్ల ఉద్యోగాలు విదేశీయులకు ఇస్తే ఊరుకోం.. కంపెనీలకు వాన్స్ వార్నింగ్

వాషింగ్టన్ విదేశీ కార్మికుల నియామకంలో వీసా మోసాలపై చర్యలు తీసుకుంటామన్న వాన్స్అమెరికన్లను తొలగించి విదేశీయులను నియమించే కంపెనీలను లక్ష్యంగా చేసుకున్నామని వెల్లడితయారీ రంగంలో 670 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చినట్లు ప్రకటనఓడరేవులు, చమురు శుద్ధి కేంద్రాలు, కర్మాగారాల విస్తరణతో స్థానికంగా ఉద్యోగాలు పెరుగుతాయని ఆశాభావంయువతకు ఇళ్లు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టామని వెల్లడిఅమెరికన్ల ఉద్యోగాలను విదేశీ కార్మికులకు కట్టబెట్టే కంపెనీలపై చర్యలు తీసుకుంటామని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ స్పష్టం చేశారు. వీసా మోసాలకు పాల్పడే సంస్థలు, అమెరికా ఉద్యోగులను తొలగించి వారి స్థానంలో విదేశీ కార్మికులను నియమించే కంపెనీల యాజమాన్యాలే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని వెల్లడించారు. టెక్సాస్‌లోని వెదర్‌ఫోర్డ్‌లో ఎన్నికల ప్రచార సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశ సార్వభౌమాధికారం అంటే అమెరికా పౌరుల ప్రయోజనాలను కాపాడటమేనని వాన్స్ అన్నారు. అమెరికా ఉద్యోగులను తొలగించి, వారి స్థానంలో విదేశీ కార్మికులను నియమించే సంస్థలపై చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అయితే ఏయే కంపెనీలపై దర్యాప్తు జరుగుతోంది? ఏ వీసా కేటగిరీకి సంబంధించి అక్రమాలు జరిగాయి? అనే వివరాలను ఆయన వెల్లడించలేదు. అమెరికా కార్మికులకు మేలు చేసేలా వాణిజ్య విధానాలను రూపొందిస్తున్నామని వాన్స్ చెప్పారు. దేశంలో కొత్తగా 670 బిలియన్ డాలర్ల తయారీ రంగ పెట్టుబడులు వచ్చాయని పేర్కొన్నారు. ఓడరేవులు, చమురు శుద్ధి కేంద్రాలు, కర్మాగారాల విస్తరణతో స్థానికంగా ఉద్యోగాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ అభివృద్ధిలో టెక్సాస్ కీలక పాత్ర పోషిస్తోందని

అన్నారు. యువత సొంత ఇల్లు కొనుగోలు చేయగలిగేలా చర్యలు తీసుకుంటున్నామని వాన్స్ తెలిపారు. వాల్‌స్ట్రీట్ సంస్థలు, విదేశీ పెట్టుబడిదారులు ఇళ్ల కొనుగోళ్లపై చూపే ప్రభావాన్ని తగ్గించే ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు. టిప్స్ ద్వారా వచ్చే ఆదాయం, అదనపు పని గంటల వేతనాలు, సీనియర్లకు పన్ను ఉపశమనం కల్పించే చర్యలను ప్రస్తావించారు. చిన్నపిల్లలున్న కుటుంబాలకు ప్రయోజనాలు పెంచడంపైనా మాట్లాడారు. యువత సొంత ఇళ్లు కొనుక్కొని, కుటుంబాలను ఏర్పరచుకుని, స్థిరమైన ఉద్యోగాలతో జీవించే పరిస్థితులు రావాలని వాన్స్ ఆకాంక్షించారు. తన చిన్ననాటి అనుభవాలను గుర్తుచేసుకుంటూ.. మందులు కొనాలా? ఆహారం కొనాలా? అని ఆలోచించాల్సిన పరిస్థితులు తన కుటుంబంలో ఉండేవని చెప్పారు. సామాన్య కుటుంబాల జీవన వ్యయాన్ని తగ్గించడం ప్రభుత్వ బాధ్యతగా అభివర్ణించారు. కెన్ పాక్స్‌టన్ అమెరికా సెనేట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా వాన్స్ ఈ సభలో పాల్గొన్నారు. ఉద్యోగాలు, సరిహద్దు భద్రత, ఇంధన ఉత్పత్తి, జీవన వ్యయాల తగ్గింపును ప్రస్తావిస్తూ రిపబ్లికన్ అభ్యర్థులకు మద్దతివ్వాలని ఓటర్లను కోరారు.

అమిత్ షా టూర్ వెనుక భారీ వ్యూహం

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయ రంగంలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ అంశం కాంగ్రెస్, బీజేపీల మధ్య రగులుతోంది. ఢిల్లీలోని చారిత్రాత్మక రామ్‌లీలా మైదాన్‌లో నవంబర్ 1న కాంగ్రెస్ పార్టీ ఓట్ చోరీ నినాదంతో నిర్వహించనున్న భారీ ర్యాలీకి సవాల్ విసురుతూ.. మరుసటి రోజే నవంబర్ 2న భాగ్యనగరంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రత్యక్షంగా పాల్గొనేలా లోక్‌తంత్ర బచావో - అరాజకతా హటావో పాదయాత్రను బీజేపీ ఖరారు చేసింది. ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల సవరణ ప్రక్రియను రాజకీయం చేస్తూ, కాంగ్రెస్ ఆడుతున్న నాటకాలను తిప్పికొట్టడమే లక్ష్యంగా చాణక్యుడు స్వయంగా రంగంలోకి దిగుతుండటంతో జాతీయ, రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిలు ఈసీ ప్రక్రియపై అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారనేది బీజేపీ ప్రధాన ఆరోపణ. మరణించినవారు , శాశ్వతంగా చిరునామాలు మారినవారు ,అడ్రస్‌లో లేనివారు, రెండు చోట్ల నమోదు చేసుకున్న డూప్లికేట్ ఓట్లను సాంకేతిక ఆధారాలతో ఈసీ తొలగిస్తుంటే, దానిని ఓట్ల చోరీ అని కాంగ్రెస్ ప్రచారం చేస్తోందని బీజేపీ నేతలు మండిపడుతున్నారు. చట్టబద్ధమైన సవరణ ప్రక్రియను అరాచకత్వంగా మార్చాలని చూస్తున్న కాంగ్రెస్ వైఖరిని ప్రజల వద్దకే వెళ్లి ఎండగట్టడమే ఈ పాదయాత్ర ముఖ్య ఉద్దేశం.ఈ పరిణామం వెనుక బీజేపీ జాతీయ నాయకత్వం సుదీర్ఘ రాజకీయ వ్యూహం దాగి ఉందనేది స్పష్టమవుతోంది. ముఖ్యంగా తెలంగాణను రాబోయే రోజుల్లో కైవసం చేసుకోవాలనే దృఢ సంకల్పంతో ఉన్న అమిత్ షా, ఈ ఓటర్ల జాబితా రచ్చ ను కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పొలిటికల్ అస్త్రంగా మలుచుకోవాలని చూస్తున్నారు. రాహుల్ గాంధీ డిఫెన్స్ లోకి నెట్టిన ప్రతిసారీ ప్రత్యక్షంగా తానే వేదికపైకి వచ్చి కౌంటర్ ఇవ్వడం అమిత్ షా శైలి. హైదరాబాద్ ట్యాంక్ బండ్ పరిసరాల్లో వేలాదిమంది శ్రేణులతో సాగనున్న ఈ పాదయాత్ర ద్వారా సౌత్ ఇండియాలో కాంగ్రెస్ నరేటివ్‌ను పూర్తిగా పటాపంచలు చేయాలని భావిస్తున్నారు.రాష్ట్రంలో నెలకొన్న కరువు, తాగునీటి ఎద్దడి వంటి ప్రజా సమస్యలను పక్కనబెట్టి సీఎం రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు 'ఢిల్లీ ర్యాలీ' కోసం గాల్లో

విహరిస్తున్నారని బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. నిజమైన ఓటర్ల పేర్లు ఎక్కడైనా తొలగించి ఉంటే ఆధారాలతో చూపించాలని, సీఎం స్వగ్రామం కొండారెడ్డిపల్లికి రావడానికైనా తాము సిద్ధమని సవాల్ విసిరారు. ఓటర్లకు ఉన్న ఫారమ్-6 హక్కును వివరించకుండా, ఓట్ల పేరుతో కాంగ్రెస్ కేవలం రాబోయే స్థానిక ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనం పొందాలని చూస్తోందని ధ్వజమెత్తారు. మరోవైపు, బిఆర్ఎస్ స్థానంలో కాంగ్రెస్‌కు ఏకైక ప్రత్యామ్నాయంగా తమను తాము నిలబెట్టుకోవడానికి బీజేపీకి ఇది ఒక సువర్ణావకాశంగా మారింది. తెలంగాణలో అధికారం చేజిక్కించుకోవాలంటే కేవలం అసెంబ్లీ స్థానాలే కాకుండా, హైదరాబాద్, రంగారెడ్డి లాంటి అర్బన్ సెంటిమెంట్‌ను తమవైపు తిప్పుకోవడం అత్యంత కీలకం. అందుకే అమిత్ షా నేరుగా వీధుల్లోకి వచ్చి పాదయాత్ర చేయడం ద్వారా కమలం క్యాడర్‌లో నూతన ఉత్సాహాన్ని నింపడంతో పాటు, తద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రతిపక్ష పాత్రను రీ-ఛార్జ్ చేయబోతున్నారు. ఢిల్లీలో రామ్‌లీలా మైదాన్ ర్యాలీతో కాంగ్రెస్ వేసిన ఎత్తుకు, మరుసటి రోజే హైదరాబాద్ పాదయాత్రతో అమిత్ షా వేస్తున్న పైఎత్తు దేశ రాజకీయాల్లో ప్రధాన ఆకర్షణగా మారింది. ఎన్నికల సమయానికి ఇంకా సమయం ఉన్నప్పటికీ, ఈ ఓటర్ల జాబితా సమరం ద్వారా కాంగ్రెస్-బీజేపీలు తెలంగాణ నేతలను జాతీయ స్థాయి రాజకీయ కురుక్షేత్రంగా మార్చేశాయనడంలో ఎలాంటి సందేహం లేదు.కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా నవంబర్ 2న తెలంగాణలో పర్యటనతో రాష్ట్ర రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. ఈ పర్యటనను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న బీజేపీ రాష్ట్ర నాయకత్వం, భారీ ఎత్తున జన సమీకరణ చేసేందుకు సమాయత్తమవుతోంది. అమిత్ షా పర్యటన, పాదయాత్ర ఏర్పాట్లపై బీజేపీ ముషీరాబాద్ సీనియర్ నాయకులు రామచందర్ రావు, బీజేపీ సహ ఇంచార్జి అభయ్ పాటిల్, పార్టీ ప్రధాన కార్యదర్శులు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. కార్యక్రమాన్ని ప్రజాక్షేత్రంలో నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చించారు.ఈ పర్యటనలో 'ప్రజాస్వామ్యాన్ని కాపాడుదాం.. అరాచకత్వంను అంతంచేద్దాం' అనే ప్రధాన నినాదంతో బీజేపీ భారీ పాదయాత్రను చేపట్టనుంది. కేవలం ఏదో ఒక గ్రౌండ్ లో లేదా వేదికలకే పరిమితం కాకుండా, నేరుగా ప్రజల మధ్య నుంచే పాదయాత్ర సాగాలని కేంద్ర బీజేపీ అగ్ర నాయకత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కేంద్ర నాయకత్వం ఆదేశాలతో బీజేపీ నేతలు నాంపల్లిలోని చారిత్రాత్మక ఎగ్జిబిషన్ గ్రౌండ్స్, మొజంజాహీ మార్కెట్ పరిసర ప్రాంతాలను స్వయంగా పరిశీలించారు. పాదయాత్ర రూట్ మ్యాప్, రద్దీ నియంత్రణ, వేదిక ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడారు.తెలంగాణలో రాబోయే ఎన్నికలు, ప్రస్తుత రాజకీయ పరిస్థితుల దృష్ట్యా అమిత్ షా పర్యటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. అధికార పార్టీ వైఫల్యాలను, పాలనా వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడమే లక్ష్యంగా ఈ యాత్ర ప్రధాన లక్ష్యంగా తెలుస్తోంది. కేంద్ర మంత్రి అమిత్ షా స్వయంగా ర్యాలీ చేయడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీజేపీ శ్రేణులు, కార్యకర్తల్లో ఉత్కంఠ నెలకొంది. ఈ సభ ద్వారా రాష్ట్రంలో తమ బలాన్ని మరోసారి నిరూపించుకోవాలని బీజేపీ నాయకులు యోచిస్తున్నారు.

రాయదుర్గం, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో వన్ వే

హైదరాబాద్ : హైదరాబాద్ ఐటీ కారిడార్‌తో పాటు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో నిత్యం వేలాది మంది టెక్కీలను, వాహనదారులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీస్ యంత్రాంగం భారీ కార్యాచరణను సిద్ధం చేసింది. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే రెండు ప్రధాన జంక్షన్లలో త్వరలోనే వన్ వే విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. ఈ ప్రాంతాల్లో సమగ్ర ట్రాఫిక్ అధ్యయనం నిర్వహించిన అధికారులు, వన్ వే విధానం అమలు సాధ్యాసాధ్యాలను పూర్తిస్థాయిలో పరిశీలించి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. గతంలో కేబీఆర్ పార్క్ వద్ద అమలు చేసిన వన్ వే వల్ల దాదాపు 6 కిలోమీటర్ల మేర అదనపు ప్రయాణం చేయాల్సి రాగా, ఇక్కడ మాత్రం వాహనదారులకు కేవలం 2 కిలోమీటర్ల మేర మాత్రమే అదనపు ప్రయాణ భారం పడనుంది.ఈ కొత్త ట్రాఫిక్ నిబంధనల వల్ల ఐటీ కారిడార్‌లో కనీసం 40 శాతం మేర ట్రాఫిక్ రద్దీ తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దశలవారీగా చేపట్టనున్న ఈ ప్రణాళికలో భాగంగా.. తొలుత వారం, రెండు వారాల వ్యవధిలోనే రాయదుర్గం జంక్షన్ పరిసరాల్లో వన్ వే విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు. ఆ తర్వాత పరిస్థితిని సమీక్షించి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని మరో కీలక జంక్షన్‌లోనూ దీనిని విస్తరిస్తారు. ఈ మార్పుల వల్ల ఉద్యోగులకు, సందర్శకులకు ఎలాంటి అసౌకర్యం

కలగకుండా చూసేందుకు సమీపంలోని కార్పొరేట్ కంపెనీలు, వాణిజ్య సంస్థలు, మాల్స్, విద్యాసంస్థల యాజమాన్యాలకు ముందస్తు సమాచారం అందించి వారిని సమాయత్తం చేస్తున్నారు.మరోవైపు, పీక్ అవర్లలో ప్రయాణ సమయాన్ని భారీగా తగ్గించేందుకు ఆర్టీసీతో చేతులు కలిపిన సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు.. వినూత్నంగా కాంట్రా ఫ్లో ప్రత్యేక బస్సు సర్వీసులను ప్రవేశపెట్టనున్నారు. తీవ్ర రద్దీ ఉండే జేఎన్‌టీయూ, హఫీజ్‌పేట్, రాయదుర్గం జంక్షన్లను గుర్తించి, జేఎన్‌టీయూ నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు అలాగే తిరుగు ప్రయాణంలో ఈ బస్సులను నడపనున్నారు. వన్ వే అమలయ్యే రూట్లలో క్లాక్‌వైజ్ , యాంటీ క్లాక్‌వైజ్ దిశల్లో ఎలాంటి మధ్యంతర హాల్ట్‌లు లేకుండా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చేలా వీటిని డిజైన్ చేశారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఆర్టీసీ దాదాపు 20 నుంచి 30 ప్రత్యేక బస్సులను కేవలం ఐటీ ఉద్యోగుల రాకపోకల కోసమే రంగంలోకి దించనుంది.కేవలం వాహనాల కదలికలే కాకుండా.. ప్రధాన రహదారులపై మనుషులు అడ్డదిడ్డంగా దాటడం వల్ల వాహనాల వేగం మందగించి ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయని అధికారులు గుర్తించారు. ఈ సమస్యకు అడ్డుకట్ట వేసేందుకు సైబరాబాద్ పరిధిలోని పలు కీలక కూడళ్లలో అత్యాధునిక స్కైవాక్‌లను నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. పాదచారులు రోడ్లపైకి రాకుండా పైనుంచే సురక్షితంగా వెళ్లేలా స్కైవాక్‌లను అనుసంధానించడం ద్వారా పాదచారుల భద్రత పెరగడంతో పాటు, రహదారులపై వాహనాల రాకపోకలు నిరంతరాయంగా సాగి నగరవాసులకు ట్రాఫిక్ నరకం నుంచి భారీ ఉపశమనం లభించనుంది.

భారంగా ఇళ్ల నిర్మాణం

హైదరాబాద్ : దేశీయ రియల్ ఎస్టేట్ రంగాన్ని ప్రస్తుతం ధరల మంట తీవ్రంగా వేధిస్తోంది. నిర్మాణ రంగానికి అత్యంత కీలకమైన సిమెంట్, ఇనుము , ఇటుకలు, కంకర , ఇతర ముడిసరుకుల ధరలు విపరీతంగా పెరగడం కొత్త ప్రాజెక్టుల నిర్మాణ వ్యయాన్ని ఆకాశానికి ఎత్తేసింది. దీనికి తోడు రవాణా ఖర్చులు, నిపుణులైన కార్మికుల వేతనాలు పెరగడంతో ప్రాజెక్ట్ వ్యయాలు అంచనాలను మించిపోతున్నాయని రియల్ ఎస్టేట్ డెవలపర్లు , బిల్డర్ల సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కొంతకాలంగా అంతర్జాతీయ పరిణామాలు, ఇంధన ధరల పెరుగుదల ప్రభావంతో స్టీల్ మరియు సిమెంట్ ధరల్లో తీవ్రమైన హెచ్చుతగ్గులు నమోదవుతున్నాయి. ప్రాజెక్ట్ ప్రారంభంలో అనుకున్న అంచనా వ్యయానికి , ప్రాజెక్ట్ పూర్తయ్యే సమయానికి అవుతున్న వాస్తవ వ్యయానికి మధ్య భారీ వ్యత్యాసం కనిపిస్తోందని డెవలపర్లు వాపోతున్నారు. లాభాల మార్జిన్లు దారుణంగా పడిపోవడమే కాకుండా, ఇప్పటికే ప్రారంభించిన ప్రాజెక్టులను అనుకున్న సమయానికి పూర్తి చేయడం బిల్డర్లకు పెద్ద సవాలుగా మారింది. పెరిగిన నిర్మాణ వ్యయాల భారాన్ని మోయలేక డెవలపర్లు అనివార్యంగా ఆ అదనపు భారాన్ని చదరపు అడుగు రేట్ల రూపంలో గృహ కొనుగోలుదారులపైనే వేయాల్సి వస్తోంది. దీనివల్ల హైదరాబాద్ వంటి మహానగరాల్లో సొంతింటి కల నెరవేర్చుకోవాలనుకునే సామాన్య, మధ్యతరగతి వర్గాలకు ఇళ్ల ధరలు మరింత దూరమవుతున్నాయి. ఇప్పటికే రూ. 50 లక్షల లోపు లభించే అందుబాటు ధరల ఇళ్ల ప్రాజెక్టులు తగ్గిపోయి, సగటు ప్లాట్ , ఫ్లాట్ ధర రూ. 1 కోటికి పైగా చేరుకోవడానికి ఈ నిర్మాణ వ్యయాల పెరుగుదలే ప్రధాన కారణం.ఈ సంక్షోభం నుంచి నిర్మాణ రంగాన్ని గట్టెక్కించేందుకు ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని నరెడ్కో , క్రెడాయ్ వంటి రియల్టర్ల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. నిర్మాణ సామాగ్రిపై విధిస్తున్న జీఎస్టీ శ్లాబులను తగ్గించాలని, సిమెంట్ మరియు స్టీల్ ధరల కృత్రిమ పెంపుదలను అరికట్టేందుకు ఒక నియంత్రణ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాయి. ప్రాజెక్టుల నిర్మాణ వ్యయం తగ్గితేనే గృహ కొనుగోలుదారులకు ఉపశమనం లభించడంతో పాటు రియల్ ఎస్టేట్ మార్కెట్ స్థిరమైన వృద్ధి సాధిస్తుందని బిల్డర్లు పేర్కొంటున్నారు.

నిషేధిత పొగాకు ఉత్పత్తులు పట్టివేత

హైదరాబాద్ మలక్పేట్లో నిషేధిత పొగాకు ఉత్పత్తుల అక్రమ రవాణాపై పోలీసులు తనిఖీలునిర్వహించారు. మూసారాంబాగ్ రోడ్డులోని మోర్ సూపర్ మార్కెట్ వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా నిషేధిత పొగాకు ఉత్పత్తులు పట్టుబడింది. ఆటోలో అక్రమంగా పొగాకు ఉత్పత్తులను తరలిస్తుండగా ఎస్ఐ తేజ్య నాయక్ బృందం గుర్తించింది. ఆటో డ్రైవర్ను విచారించగా సిరిపురం కాలనీలోని గోదాములో భారీ నిల్వలుబయటపడ్డాయి. పోలీసులు గోదామును తనిఖీ చేసి నిషేధిత పొగాకు ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వ్యాపారి మధుసూదన్ (61), ఆటో డ్రైవర్ ధూప సుధాకర్ను అదుపులోకి తీసుకున్నారు. గుడిమల్కాపూర్, కిషన్బాగ్ ప్రాంతాల నుంచి పొగాకు ఉత్పత్తులు తీసుకొచ్చి మలక్పేట్ పరిసర ప్రాంతాల్లోని పాన్ షాపులకు సరఫరా చేస్తున్నట్లు విచారణలో వెల్లడి అయింది. నిషేధిత పొగాకు ఉత్పత్తులతో పాటు రవాణాకు ఉపయోగించిన ఆటోను సీజ్ చేసారు.

మచిలీపట్నంలో వర్ష బీభత్సం..

రెండు రోజులైనా తగ్గని నీరు

జలమయమైన రహదారులు.. ప్రజలకు తప్పని ఇక్కట్లు

మచిలీపట్నం అర్నబ్ తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు మచిలీపట్నం నగరం జలమయమైంది. ఎటు చూసినా రోడ్లపై వర్షపు నీరు ప్రవహిస్తుండటంతో నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం కురిసి రెండు రోజులు గడుస్తున్నప్పటికీ రహదారులపై నీరు ఏమాత్రం తగ్గకపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.నగరంలోని పలు ప్రాంతాల్లో రహదారులు వర్షపు నీటితో నిండిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. రోడ్లపై నిలిచిపోయిన నీరు డ్రైనేజీలను తలపిస్తుండటంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా నిత్యం రాకపోకలు సాగించే ప్రజలు, పనుల నిమిత్తం బయటకు వెళ్లేవారు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు.వర్షపు నీరు సకాలంలో బయటకు వెళ్లకపోవడంతో నగరంలో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీటి నిల్వలను తొలగించి, రహదారులపై సాధారణ పరిస్థితులు నెలకొనేలా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలు ఒకవైపు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుండగా, మరోవైపు రెండు రోజులైనా రోడ్లపై నీరు తగ్గకపోవడం నగర ప్రజలకు మరింత భారంగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి వర్షపు నీటిని తొలగించే చర్యలను వేగవంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కూరలో బల్లి

హైదరాబాద్ జేఎన్‌టీయూ మంజీర హాస్టల్‌లో విద్యార్థులకు వడ్డించిన భోజనంలో బల్లి కనిపించడం కలకలం రేపింది. గురువారం రాత్రి డిన్నర్ చేసేందుకు వెళ్లిన విద్యార్థులకు వడ్డించిన కూరలో బల్లి కనిపించడంతో వారు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. వెంటనే కూరలో ఉన్న బల్లిని సెల్‌ఫోన్లలో వీడియోలు తీసి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆహారంలో బల్లి రావడంపై విద్యార్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్‌లో భోజన నాణ్యతను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ, విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటం ఆడవద్దని డిమాండ్ చేశారు. హాస్టల్‌లో పరిశుభ్రత పాటించడంతో పాటు నాణ్యమైన ఆహారం అందించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

అతిగా ఫోన్ మాట్లాడుతోందని బిడ్డను గొంతుపిసికి చంపిన తల్లి

షాద్‌నగర్

బిడ్డ అతిగా ఫోన్ మాట్లాడుతోందని, తాను చెప్పిన మాట వినడం లేదని ఓ తల్లి ఆమెను దారుణంగా గొంతుపిసికి చంపేసింది. ఈ ఘటన షాద్‌నగర్ ఏరియాలోగల కొత్తూరు మున్సిపాలిటీలో చోటుచేసుకుంది. షాద్‌నగర్ డీసీపీ శిరీష వెల్లడించిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీలోని హనుమాన్ కాలనీలో నివాసం ఉండే ఆటోడ్రైవర్ ముయ్యడి రాజు, విజయలక్ష్మి దంపతులకు ముగ్గురు కుమార్తెలు. పెద్ద కుమార్తె సువర్చల (14) స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ముయ్యడి రాజు భార్య కల్లుకు బానిసైంది. ఈ క్రమంలో కల్లు తాగవద్దన్న కుమార్తె సువర్చలతో నిత్యం గొడవ పడేది. ఈ నెల 27న సాయంత్రం మరోమారు వీరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో ఆగ్రహంతో ఊగిపోయిన తల్లి కుమార్తెను గొంతుపిసికి చంపేసింది. అనంతరం ఈ హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు బాలిక మెడకు చీర చుట్టింది. తర్వాత భర్తకు ఫోన్ చేసి రప్పించింది. బాలికను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇటీవలే బాలిక పుష్పవతి కావడంతో కడుపునొప్పి భరించలేక బలవన్మరణానికి పాల్పడి ఉంటుందని తండ్రి రాజు భావించాడు. అయితే రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులకు బాలిక కడుపునొప్పితో కాదు, ఊపిరాడక చనిపోయిందని పోస్టుమార్టం రిపోర్టులో తెలిసింది. దాంతో వారు తల్లిని అనుమానించి తమదైన శైలిలో ప్రశ్నించారు. దాంతో నిందితురాలు నేరం అంగీకరించింది. ఫోన్ అతిగా మాట్లాడుతోందని, చెప్పిన మాట వినట్లేదని, అందుకే చంపేశానని చెప్పింది

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం..

ఏపీకి మళ్లీ వర్ష గండం

అర్నబ్ తుపాను ప్రభావం నుంచి ఏపీ ఇంకా కోలుకోకముందే బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడింది. దక్షిణ అండమాన్ సముద్రం పరిసరాల్లో ఏర్పడిన ఈ వాతావరణ వ్యవస్థ రానున్న రోజుల్లో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.దీని ప్రభావంతో నవంబర్ 2, 3 తేదీల్లో విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి, కాకినాడ, కోనసీమ, ఉభయ గోదావరి జిల్లాలు, ఏలూరు, కృష్ణా జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.తీర ప్రాంతాల్లో గంటకు 45?55 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే సూచనలు ఉన్నాయి. సముద్రంలో అలజడి ఉండే అవకాశం నేపథ్యంలో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి.ఇప్పటికే అర్నబ్ తుపాను కారణంగా పంటలు దెబ్బతిని రైతులు ఆందోళనలో ఉన్నారు. ఈ పరిస్థితుల్లో మరో అల్పపీడనం ఏర్పడటంతో కోస్తా జిల్లాల ప్రజల్లో ఆందోళన మొదలైంది.వాతావరణ శాఖ తాజా హెచ్చరికలను గమనిస్తూ అప్రమత్తంగా ఉండండి.

ఉత్తరాఖండ్ హెలికాప్టర్ ప్రమాదం విషాదాంతం.. ఆరుగురి మృతి

ఉత్తరాఖండ్‌లో శుక్రవారం ఘోర హెలికాప్టర్ ప్రమాదం చోటుచేసుకోవడం తెలిసిందే. ఈ దుర్ఘటన విషాదాంతంగా ముగిసింది. బద్రీనాథ్ నుంచి సహస్త్రధార వెళుతున్న ఓ ప్రైవేట్ హెలికాప్టర్ జోషిమఠ్ సమీపంలోని చాయ్ గ్రామ సమీపంలో కుప్పకూలింది. ఈ ప్రమాదంలో పైలట్‌తో సహా హెలికాప్టర్‌లో ప్రయాణిస్తున్న ఐదుగురు యాత్రికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద వార్త అందిన వెంటనే ఉత్తరాఖండ్ పోలీస్, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం ఆర్మీ బృందాలు సంయుక్తంగా రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టాయి. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, మృతుల్లో హెలికాప్టర్ పైలట్ కెప్టెన్ హిమాన్షు సభర్వాల్ (ఢిల్లీ) కాగా, ప్రయాణికులను ప్రతాప, అరుణ్, శంకర్ గౌడ, సుధీర్ కె, హెచ్.ఎస్. నటరాజాగా గుర్తించారు. వీరంతా కర్ణాటకకు చెందినవారని పోలీసులు తెలిపారు. ప్రమాద స్థలం నుంచి ఆరుగురి మృతదేహాలను వెలికితీసినట్లు అధికారులు ధ్రువీకరించారు. మృతదేహాలను రోడ్డు మార్గం ఉన్న ప్రాంతానికి తరలించే పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

రెండు నిమిషాల్లోనే తెగిన సంబంధాలు

చమోలీ ఎస్పీ సుర్జీత్ సింగ్ పన్వార్ వెల్లడించిన వివరాల ప్రకారం, "ట్రాన్స్ భారత్ ఏవియేషన్" సంస్థకు చెందిన ఈ హెలికాప్టర్ మధ్యాహ్నం 1.12 గంటలకు బద్రీనాథ్ సివిల్ హెలిప్యాడ్ నుంచి బయలుదేరింది. కేవలం రెండు నిమిషాల వ్యవధిలోనే, మధ్యాహ్నం 1.14 గంటల సమయంలో జోషిమఠ్ సమీపంలో హెలికాప్టర్‌తో సంబంధాలు తెగిపోయాయి. హెలికాప్టర్ గాల్లో ఉండగానే అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లడం చూశామని సమీప ప్రాంతాల్లోని స్థానికులు తెలిపారని ఆయన వివరించారు. ఉత్తరాఖండ్ సివిల్ ఏవియేషన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఖజణా) కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించింది. హెలికాప్టర్‌తో కమ్యూనికేషన్ తెగిపోవడంతో పాటు, ట్రాకింగ్ సిస్టమ్ నుంచి కూడా అది అదృశ్యమైనట్లు తెలిపింది.

సంస్థ సేవలు నిలిపివేత

ఈ దుర్ఘటన నేపథ్యంలో, ముందుజాగ్రత్త చర్యగా ట్రాన్స్ భారత్ ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చెందిన అన్ని హెలికాప్టర్ల సేవలను తక్షణమే నిలిపివేస్తున్నట్లు యూసీడీఏ ప్రకటించింది. ఇదిలా ఉండగా, రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న హెలికాప్టర్ ప్రమాదాలపై ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత హరీశ్ రావత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. "ఇది చాలా బాధాకరమైన విషయం. రాష్ట్రంలో హెలికాప్టర్ సేవలను సురక్షితంగా మార్చాల్సిన అవసరం ఉంది. వరుసగా ఇలాంటి సంఘటనలు జరగడం ఆందోళన కలిగిస్తోంది. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, తగిన మార్పులు చేయాలి" అని ఆయన డిమాండ్ చేశారు.

49.6 కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి

యూపీ నుంచి బెంగాల్ వరకు పేదరికంభారతదేశంలో తీవ్ర పేదరికం 12 ఏళ్ల కాలంలో అత్యంత వేగంగా క్షీణించిందని వరల్డ్ బ్యాంక్ తన తాజా నివేదికలో వెల్లడించింది. 2011 సంవత్సరంలో ఏకంగా దేశ జనాభాలో 27.1 శాతంగా ఉన్న తీవ్ర పేదరికం రేటు, 2023 నాటికి 2.6 శాతానికి పడిపోయిందని స్పష్టం చేసింది. ఈ కాలంలో భారతదేశం సుమారు 496 మిలియన్ల మంది ప్రజలను (49.6 కోట్లు) విజయవంతంగా పేదరికం నుంచి బయటపడేసిందని ప్రపంచ బ్యాంక్ తెలిపింది. 'ఇండియా పావర్టీ అండ్ ఈక్విటీ బ్రీఫ్: అక్టోబర్ 2026' పేరిట విడుదలైన ఈ రిపోర్ట్ ప్రకారం- ఈ పేదరికం అంచనాలను 2021 కొనుగోలు- శక్తి- సమతుల్యత (ఔ్రా- పర్చేజింగ్, పవర్, పారిటీ) ఆధారంగా లెక్కించారు. వరల్డ్ బ్యాంక్ ఈ నివేదికలో పేదరికాన్ని అంచనా వేయడానికి రోజుకు 4.20 డాలర్ల ఆదాయాన్ని దిగువ మధ్య ఆదాయ దేశాల పేదరిక పరిమితిగా, రోజుకు 3 అమెరికన్ డాలర్లను తీవ్ర పేదరిక ప్రమాణంగా తీసుకొని ఈ గణాంకాలను వెల్లడించింది.

2011-2023 మధ్య కాలంలో రోజుకు 4.20 డాలర్ల కంటే తక్కువ ఆదాయంతో జీవిస్తున్న జనాభా వాటా 57.7 శాతం నుంచి 16.1 శాతానికి తగ్గింది. ఈ మార్పుతో సుమారు 49.6 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడినట్లు ప్రపంచ బ్యాంక్ నివేదిక పేర్కొంది. అదే సమయంలో రోజుకు 3 డాలర్ల కంటే తక్కువ ఆదాయంతో జీవించే తీవ్ర పేదరికం రేటు- 27.1 శాతం నుంచి 2.6 శాతానికి పడిపోయింది. ప్రపంచంలోనే అత్యంత వేగంగా పేదరికాన్ని తగ్గించిన దేశాల్లో భారత్ కూడా ఒకటని వరల్డ్ బ్యాంక్ అభిప్రాయపడింది. గత దశాబ్ద కాలంలో భారత్- పేదరికాన్ని తగ్గించడంలో అద్భుతమైన పురోగతిని సాధించిందని పేర్కొంది. పేదరికం తగ్గినా ఆదాయ అసమానతలు మాత్రం కొనసాగుతున్నట్లు ప్రపంచ బ్యాంకు తెలిపింది. ఇక్కడ ఎక్కువగా సంపాదించే వారు, తక్కువగా సంపాదించే వారి ఆదాయం మధ్య భారీ వ్యత్యాసం ఉందని స్పష్టం చేసింది.

పేదరికం తగ్గడానికి కారణాలివే!

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ వరల్డ్ బ్యాంక్ రిపోర్ట్‌పై ఎక్స్ వేదికగా స్పందించారు. భారతదేశంలో పేదరికం తగ్గడానికి కారణాల్ని కూడా వరల్డ్ బ్యాంక్ ప్రస్తావించినట్లు ఆమె తెలిపారు. వినియోగ వ్యయం పెరగడం, మెరుగైన ఉపాధి అవకాశాలు ముఖ్యంగా మహిళలకు ఉద్యోగ అవకాశాలు పెరగడం, ఆహార సబ్సిడీలతో పాటు ఇతర సామాజిక సంక్షేమ పథకాలు విస్తరించడం వంటివి పేదరికం తగ్గడానికి దోహదపడ్డాయని ప్రపంచ బ్యాంక్ గుర్తించినట్లు వెల్లడించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రభుత్వం చేపట్టిన విధానపరమైన నిర్ణయాలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. ఈ కారణంగానే ఎన్డీఏ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని, తీర్పును గెల్చుకుంటోందని ఆమె అన్నారు. ఉపాధి అవకాశాల్ని మరింత పెంచడం, కుటుంబ ఆదాయాల్ని బలోపేతం చేయడం, ప్రజా సేవల పంపిణీ ద్వారా పురోగతిని మరింత ముందుకు తీసుకెళ్లడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పుకొచ్చారు. రాబోయే సంవత్సరాల్లోనూ భారతదేశంలో పేదరికం తగ్గే అవకాశం ఉందని ప్రపంచ బ్యాంక్ అంచనా వేసింది. రోజుకు 4.20 డాలర్ల ఆదాయ పరిమితి ప్రకారం 2026లో పేదరికం రేటు 14.2 శాతం నుంచి, 2028 నాటికి 12.1 శాతానికి తగ్గొచ్చని పేర్కొంది. అయితే ఇది ప్రస్తుత పరిస్థితుల ఆధారంగా రూపొందించిన ప్రాథమిక అంచనాలేనని, ఉపాధి, ఆర్థిక గణాంకాల్లో మార్పులు వచ్చినప్పుడు దానికి అనుగుణంగా ఇది మారొచ్చని తెలిపింది.

గ్రామీణ ప్రాంతాల్లో పురోగతి అయినా!

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని కుటుంబాల జీవన ప్రమాణాలు ఇటీవలి కాలంలో మెరుగుపడ్డాయని ప్రపంచ బ్యాంక్ నివేదికలో పేర్కొంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం వేగంగా తగ్గడంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అంతరం గణనీయంగా తగ్గిందని స్పష్టం చేసింది. అయితే ఇప్పటికీ పేద కుటుంబాల్లో ఎక్కువ భాగం గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నారని నివేదిక తెలిపింది. ప్రధానంగా అక్కడ ఉత్పాదకత తక్కువగా ఉండటం, వ్యవసాయం కాకుండా ఇతర మెరుగైన ఉద్యోగాలు అందుబాటులో లేకపోవడం ప్రధాన సమస్యలు అని వివరించింది. దేశంలో పేద జనాభాలో దాదాపు 57 శాతం మంది ఉత్తర్ ప్రదేశ్ నుంచి బెంగాల్ వరకు విస్తరించిన రాష్ట్రాల్లోనే ఉన్నారని రిపోర్ట్ తెలిపింది. దేశవ్యాప్తంగా పేదరికాన్ని మరింత తగ్గించాలంటే ఈ రాష్ట్రాల్లో ఉపాధి అవకాశాల్ని మరింత పెంచడం కీలకం అని సూచించింది.

యూపీలో మళ్లీ బీజేపీదే అధికారం

ఉత్తరప్రదేశ్‌లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో కేంద్ర హోంమంత్రి అమిత్? షా శుక్రవారం కీలక వ్యాఖ్యలు చేశారు. యూపీలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అప్పుడు రాష్ట్రంలో ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)ని అమలు చేస్తామని ప్రకటించారు. ఇప్పటికే దీనిని అనేక రాష్ట్రాల్లో అమలు చేస్తున్నామని వెల్లడించారు.



మమ్మల్ని ఎవరూ కదిలించలేరు!

ప్రస్తుతం యూపీలో బీజేపీ ప్రభుత్వం సుస్థిరంగా ఉందని, దానిని ఎవరూ కదిలించలేరని అమిత్ షా అన్నారు. "యూపీ లో బీజేపీ ప్రభుత్వం అంగదుడి పాదం (కదిలించలేనిది) లాంటిది. దీనిని ఎవరూ కదిలించలేరు. బీజేపీ మళ్లీ యూపీలో ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. ఇందులో ఎలాంటి సందేహం లేదు" అని పేర్కొన్నారు. మరోవైపు సమాజ్?వాదీ పార్టీ ఇకపై యూపీలో అధికారంలోకి రాదని అమిత్ షా అన్నారు. "అఖిలేశ్ బాబూ, గుర్తుంచుకోండి. వచ్చే 30 ఏళ్ల వరకు మీ పార్టీ ఉత్తరప్రదేశ్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు. ప్రజలు మీ మూడో తరానికి కూడా క్షమించరు" అని అన్నారు. ఈ సందర్భంగా 1990 అక్టోబర్ 30న అయోధ్యలో కరసేవకులపై పోలీసులు జరిపిన కాల్పులను అమిత్ షా ప్రస్తావించారు. అయోధ్య రామమందిర నిర్మాణం కోసం పోరాడుతున్న కరసేవకులపై సమాజ్‌వాదీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పోలీసులు కాల్పులు జరిపారని ఆయన గుర్తు చేశారు. "నేను (సమాజ్‌వాదీ పార్టీ) వారిని అడగాలని అనుకుంటున్నాను. ఏ ప్రాతిపదికన మీరు ప్రభుత్వం ఏర్పాటు గురించి మాట్లాడుతున్నారు మీరు రామభక్తులపై కాల్పులకు ఆదేశించారు. కానీ మేము రామమందిరాన్ని నిర్మించాం" అని పేర్కొన్నారు.

ఓటు చోరీపై ఏమన్నారంటే?

మరోవైపు విపక్షాలు చేస్తున్న 'ఓటు చోరీ' ఆరోపణలపై కూడా అమిత్ షా మండిపడ్డారు. వారిని మ్యాచ్ ఓడిపోయిన తర్వాత అంపైర్?ను నిందించే జట్టుతో పోల్చారు. "మ్యాచ్ ఓడిపోయిన తర్వాత, వాళ్లు అంపైర్‌ను నిందిస్తున్నారు. ఓట్ చోరీ జరిగిందని ఆరోపిస్తున్నారు. పార్లమెంట్?లో ఈ అంశంపై చర్చకు బీజేపీ సిద్ధంగా ఉంది. ఈ రోజే వచ్చి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకోనివ్వండి. మేము ప్రతి ప్రశ్నకు సమాధానం చెప్పడానికి సిద్ధంగాఉన్నాం. పార్లమెంట్‌లో చర్చ జరగనివ్వండి" అని అన్నారు.

కాగా, ఈ రోజు ఉత్తరప్రదేశ్‌లోని డాక్టర్ రామ్? మనోహర్ లోహియా నేషనల్ లా యూనివర్సిటీ ఆడిటోరియంలో జరిగిన పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని అమిత్ షా ప్రారంభించారు. తమ పార్టీ సిద్ధాంతకర్తలైన శ్యామా ప్రసాద్ ముఖర్జీ, దీన్‌దయాల్ ఉపాధ్యాయ చిత్రపటాలకు ఆయన పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఉపముఖ్యమంత్రులు కేశవ్ ప్రసాద్? మౌర్య, బ్రజేశ్ పాఠక్, కేంద్ర ఆర్థిక శాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి స్మృతి ఇరానీ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి పౌరస్మృతిపై చర్చ

ప్రస్తుతం దేశవ్యాప్తంగా యూసీసీని అమలు చేయాలని పలు రాష్ట్రాలకు చెందిన బీజేపీ నేతలు పిలుపునిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అమిత్ షా కూడా యూసీసీ అమలు గురించి మాట్లాడడం గమనార్హం. ఇటీవల అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ దేశవ్యాప్తంగా యూసీసీ అమలు చేయాలని పిలుపునిచ్చారు. యూసీసీ లేకపోవడం వల్ల ఎక్కువగా నష్టపోతున్న వారిలో ముస్లిం మహిళలు ఉన్నారని ఆయన అన్నారు. బహుభార్యత్వం లాంటి సమస్యలను పరిష్కరించడానికి ఉమ్మడి పౌరస్మృతి అవసరం ఎంతైనా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. అసోంలో ఇప్పటికే యూసీసీని నోటిఫై చేశామని ఆయన గుర్తు చేశారు.

సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కరోల్ కూడా యూసీసీ ప్రస్తుతం చాలా అవసరమని వ్యాఖ్యానించారు. చట్టంలో ఏకరూపత తీసుకురావడానికి కేంద్ర పౌరస్మృతి ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. బంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి ఇటీవల మాట్లాడుతూ, ఉత్తరాఖండ్, గుజరాత్‌ల తరహాలో తమ ప్రభుత్వం 6నెలల్లోగా లవ్ జిహాద్, ల్యాండ్ జిహాద్‌లకు వ్యతిరేకంగా కఠినమైన చట్టాలు ప్రవేశపెట్టి, రాష్ట్రంలో యూసీసీని అమలు చేస్తామని ప్రకటించారు. అంతేకాదు బంగాల్? కోసం ఏకరూప పౌరస్మృతి ముసాయిదాను పరిశీలించడానికి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్? రంజనా ప్రకాశ్ దేశాయ్? నేతృత్వంలో ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. బంగాల్ సర్కార్? ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం, యూసీసీ ద్వారా వివాహం, విడాకులు, వారసత్వం, దత్తతకు సంబంధించిన విషయాల్లో అన్ని వర్గాల వారికి సమానంగా పౌరచట్టాలను వర్తింపజేస్తారు.

జనవరి 25 నుంచి జనగణన

భారతదేశ వ్యాప్తంగా 2027 జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు జనగణన మొదలవుతుందని కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. అయితే ఎన్నికలు జరిగే ఉత్తరప్రదేశ్, మణిపుర్, గోవా, పంజాబ్, ఉత్తరాఖండ్‌లో జనగణన ఉండదని స్పష్టం చేసింది. అలాగే మంచు కురిసే జమ్మూకశ్మీర్, లద్దాఖ్, హిమాచల్‌ప్రదేశ్‌లోనూ జనగణన ఉందని పేర్కొంది. భారత రిజిస్ట్రార్ జనరల్ (ఆర్‌జీఐ), సెన్సస్ కమిషనర్ మృత్యుంజయ కుమార్ నారాయణ్ జారీ చేసిన ప్రకారం, జనాభా గణనకు రిఫరెన్స్ తేదీగా 2027 మార్చి 1 అర్ధరాత్రి 12 గంటలుగా నిర్ణయించారు. ఆర్‌జీఐ ప్రకారం, జనగణన ప్రక్రియలో భాగంగా 2027 మార్చి 1 నుంచి మార్చి 5 వరకు 'సవరణ దశ' (రివిజినల్ రౌండ్) ఉంటుంది. ఇంటింటికీ తిరిగి జనాభాను లెక్కించే ప్రక్రియ ప్రారంభం కావడానికి ముందు, అంటే 2027 జనవరి 10 నుంచి జనవరి 24 వరకు ప్రజలు స్వయంగా తమ వివరాలను నమోదు చేసుకునే (సెల్ఫ్-ఎన్యూమరేషన్) అవకాశం కల్పిస్తారు.

రెండు దశల్లో గణన

భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత జరుగుతున్న 8వ జనగణన ఇది. దీనిని రెండు దశల్లో నిర్వహిస్తారు. మొదటిది గృహాల జాబితా తయారీ, గృహ గణన, రెండోది జనాభా లెక్కింపు. ప్రతి పదేళ్లకు ఒకసారి జరిగాల్సిన ఈ ప్రక్రియ ఈసారి కాస్త లేటయ్యింది. వాస్తవానికి జగగణన 2021లోనే జరగాల్సి ఉండగా, కోవిడ్-19 మహమ్మారి కారణంగా వాయిదా పడింది. ఈ భారీ జనాభా గణన ప్రక్రియ కోసం కేంద్ర మంత్రివర్గం రూ.11,718 కోట్లు కేటాయించింది. వాస్తవానికి, గతంలోనే మణిపూర్‌లో 2027 జనాభా గణనకు సంబంధించి గృహాల జాబితా తయారీ ప్రక్రియను వాయిదా వేస్తున్నట్లు =+× జారీ చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. భారతదేశంలో చివరిసారిగా 2011లో జనాభా గణన జరిగింది. అప్పుడు దేశ జనాభా 121 కోట్లుగా నమోదైంది; ఇందులో 62.32 కోట్ల మంది పురుషులు, 58.75 కోట్ల మంది మహిళలు ఉన్నారు. ఆ సమయంలో దేశంలో 24.95 కోట్ల కుటుంబాలు ఉన్నాయి

ఆఖరి శ్వాస వరకు ప్రజా సేవ చేస్తూనే ఉంటా

దేశానికి అన్నదాతలే మూల స్తంభాలని, తన చివరి శ్వాస వరకు ప్రజా సేవలో పునరంకితమవుతానని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన గుజరాత్‌లోని బనాస్కాంత జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా 'భారత్ బోవైన్ బ్రీడింగ్ అండ్ రీసెర్చ్ సెంటర్'ను ప్రధాని ప్రారంభించారు. దీంతో పాటు రూ.14,000 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం నిర్వహించిన భారీ బహిరంగ సభలో మోదీ మాట్లాడారు. 'నా జీవితంలో చివరి క్షణం వరకు ప్రజల సేవలోనే నిమగ్నమై ఉంటాను. ఒక సామాన్య కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తికి, కుటుంబంలోని ఏ తరంలోనూ కనీసం పంచాయతీ సర్పంచ్‌గా కూడా ఎవరూ పనిచేయని నేపథ్యం ఉన్న నాకు, మీరు మొదట గుజరాత్‌కు, ఆ తదనంతరం భారతావనికి సేవ చేసే గొప్ప బాధ్యతను, అవకాశాన్ని అప్పగించారు. నేను సాధించిన ప్రతి విజయానికి, పొందిన ప్రతి పురోగతికి మూలం దేశ ప్రజలే. ఈ దేశ ప్రజల రుణం నేను ఎప్పటికీ తీర్చుకోలేను. జీవితాంతం వారికి రుణపడి ఉంటాను' అని మోదీ అన్నారు.

విపత్తుల వేళ దుష్ప్రచారం

పశ్చిమాసియాలో తలెత్తిన ఉద్రిక్తతలు, అంతర్జాతీయ ప్రతికూల పరిస్థితుల వేళ ప్రతిపక్షాలు అనుసరిస్తున్న వైఖరిపై ప్రధాని మోదీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశం ఏదైనా సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నప్పుడు ఆనందించే మనస్తత్వం ఉన్న కొందరు వ్యక్తులు మన మధ్యే ఉన్నారని మోదీ విమర్శించారు. పశ్చిమాసియాలో యుద్ధం తలెత్తిన సమయంలో దేశంలో తీవ్రస్థాయిలో ఎరువుల కొరత ఏర్పడుతుందని, వంటగ్యాస్ సరఫరా నిలిచిపోతుందంటూ కావాలని పుకార్లు సృష్టించారని మండిపడ్డారు. తమ ప్రభుత్వాన్ని బద్నాం చేయడమే ఏకైక లక్ష్యంగా ఈ అసత్య ప్రచారాలు చేశారని దుయ్యబట్టారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఎరువుల ధరలు ఆకాశాన్నంటినప్పటికీ, ఆ ధరల భారాన్ని భారతీయ రైతులపై పడకుండా కేంద్ర ప్రభుత్వం ఆ ఖర్చును భరించిందని స్పష్టం చేశారు. దేశంలో ఎక్కడా ఎరువులు, గ్యాస్ కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని తెలిపారు. "దేశంలోని ప్రతి రైతు, యువకుడు, ఆడబిడ్డ 'వికసిత భారత్' నిర్మాణ సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. కానీ దురదృష్టవశాత్తూ ఇది కొందరికి నచ్చటం లేదు. దేశం కష్టాల్లో ఉంటే చూడాలనుకునే వాళ్లు దేశంపైకి ఏదైనా ఆపద వస్తే వారికి ఎంతో ఆనందం. ఇరాన్, గల్ఫ్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధమే దీనికి తాజా ఉదాహరణ. ఈ యుద్ధాన్ని ఎదుర్కొనేందుకు భారత్ సమైక్యంగా సన్నద్ధమవుతుంటే.. వీళ్లు మాత్రం వదంతులు వ్యాప్తి చేయడంలో బిజీగా ఉన్నారు. కావాలనే తప్పుడు ప్రచారాలు సృష్టించారు. రైతులకు ఎరువులు దొరకవని భయపెట్టారు. కృత్రిమంగా క్యూలైన్లు సృష్టించి వాతావరణాన్ని చెడగొట్టారు. ఇకపై గ్యాస్ సిలిండర్లు దొరకవని మహిళలను భయపెట్టారు. దేశంలో అశాంతి, గందరగోళం సృష్టించడమే వారి లక్ష్యం"

రైతు సంక్షేమానికి ప్రాధాన్యం

రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ప్రధాని పునరుద్ఘాటించారు. దేశంలోని చిన్న, సన్నకారు రైతులకు ఆసరాగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు 'పీఎం-కిసాన్ సమ్మాన్ నిధి' పథకం ద్వారా రూ. 4.5 లక్షల కోట్లను నేరుగా వారి ఖాతాల్లోకి జమ చేసిందని వివరించారు. వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడం, పశుసంవర్ధక రంగాన్ని ప్రోత్సహించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు నూతన ఉత్తేజం అందిస్తున్నామని తెలిపారు. బనాస్కాంత జిల్లా వ్యవసాయ, సహకార రంగాల్లో సాధించిన ప్రగతిని ప్రధాని ప్రత్యేకంగా మోదీ కొనియాడారు. ఇక్కడి రైతుల శ్రమ, పట్టుదల దేశానికే ఆదర్శమని చెప్పారు. బనాస్కాంత ప్రాంతంలో పండే బంగాళాదుంపలు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందాయన్నారు. ఇక్కడి రైతు వద్దకు వచ్చి 'మేము బంగాళాదుంపల నుంచి బంగారం తయారు చేసి ఇస్తాం' అని చెప్పే ధైర్యం ఎవరూ చేయలేరన్నారు. ఎందుకంటే, తమ కష్టంతో బంగాళాదుంపల ద్వారా బంగారాన్ని ఎలా పండించాలో ఇక్కడి రైతులకు బాగా తెలుసని చెప్పారు.

కృష్ణ-గోదావరి బేసిన్ వివాదంపై సుప్రీం కీలక నిర్ణయం

కృష్ణా- గోదావరి (కేజీ) బేసిన్ గ్యాస్ వివాదానికి సంబంధించి దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇతరుల మధ్య ఉన్న కేజీ బేసిన్ గ్యాస్ తరలింపు వివాదానికి సంబంధించి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రంజనా ప్రకాశ్ దేశాయ్‌ను ఏకైక మధ్యవర్తిగా నియమించింది. ఈ మధ్యవర్తిత్వానికి అన్ని పక్షాలు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చాయని వెల్లడించింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, ఇతర న్యాయమూర్తులు జస్టిస్ జోయ్?మాల్య బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎమ్. పంచోలిలతో కూడిన సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం ఈ నియామకాన్ని ప్రకటించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం పంచోలీలతో కూడిన ధర్మాసనం ముందుకు కేజీ బేసిన్ గ్యాస్ తరలింపు కేసు విచారణకు వచ్చింది. ఈ వివాదానికి సంబంధించి అన్ని పక్షాలు ఒక ఆచరణాత్మక పరిష్కారాన్ని కనుగొనలేకపోయాయన్న సమాచారం ధర్మాసనం దృష్టికి చేరింది. ఈ కేసులో రిలయన్స్ ఇండస్ట్రీస్ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ సుప్రీంకోర్టు ధర్మాసనం ఎదుట వాదనలు వినిపించారు. 'ఈ వివాదాన్ని కోర్టు వెలుపల పరిష్కరించుకోగలమేమో చూద్దాం. ఈ కేసులో మీరు (సుప్రీంకోర్టునుద్దేశించి) ఎవరిని మధ్యవర్తిగా నియమించాల నుకుంటే వారిని నియమించండి' అని సిబల్ అన్నారు. ఈ వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు ధర్మాసనం స్పందించింది. కేజీ బేసిన్ వివాదానికి సంబంధించి మధ్యవర్తిగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రంజనా ప్రకాశ్ దేశాయ్ పేరును ప్రతిపాదించింది. ఆమెకు ఉన్న కమర్షియల్ లిటిగేషన్ బ్యాక్‌గ్రౌండ్, పరిజ్ఞానాన్ని దృష్టిలో ఉంచుకుని ఇరు పక్షాలు పరిష్కారం కోసం ప్రయత్నించాలని పిలుపునిచ్చింది. అలాగే ఇరుపక్షాలు సూచించిన ఇద్దరు నిపుణుల సహాయాన్ని తీసుకోవాలని మధ్యవర్తిని కోరతామని పేర్కొంది.

'వివాద పరిష్కారంలో మధ్యవర్తికి పూర్తిగా సహకరిస్తాం'

మరోవైపు, కేజీ బేసిన్ వివాదంలో కేంద్ర ప్రభుత్వం తరఫున అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి సుప్రీంకోర్టులో వాదనలు వినిపించారు. తాము మధ్యవర్తికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఇరు పక్షాలు మధ్యవర్తి ముందు తమ ప్రజెంటేషన్ ఇవ్వొచ్చని అన్నారు. మధ్యవర్తి ముందు పక్షాలు తమ ప్రజెంటేషన్ ఇచ్చేందుకు వీలుగా కొంత సమయం కేటాయించాలని ధర్మాసనాన్ని కోరారు.

నేరేడు పండు ప్రయోజనాల్లో మెండు..
తెలిస్తే వదిలిపెట్టరు!

మధుమేహులకు మేలు చేసే పండు ఇది
ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సీ లభ్యం
జీర్ణప్రక్రియ, గుండె పనితీరును పెంచుతుంది

వర్షాకాలంలో విరివిగా, చౌకగా లభించే పండ్లలో నేరేడు పండు ఒకటి. దీన్నే జామూన్ అని కూడా అంటారు. నల్లగా, నిగనిగలాడుతూ కనిపించే ఇవి రుచిలో అద్భుతంగా ఉంటాయి. రుచిలోనే కాదు పోషకాలు కూడా మెండుగా ఉంటాయి. ఏటా కనీసం ఓ రెండు నేరేడు పండ్లు అయినా తినాలని, దీనివల్ల కాలేయ శుద్ధి జరుగుతుందని పెద్దలు కూడా చెబుతుంటారు. అసలు నేరేడు పండ్లలో ప్రయోజనాలు గురించి తెలిస్తే వాటిని తినకుండా ఉండలేరు. ఈ పండ్లలో గ్లైసిమిక్ ఇండెక్స్ తక్కువ. కనుక మధుమేహులతోపాటు అందరూ హ్యాపీగా తినేయవచ్చు. ఇవి మధురంగానే ఉన్నప్పటికీ రక్తంలోకి చక్కెరలు వెంటనే విడుదల కావు. నిదానంగా విడుదల అవ్వడం వల్ల బ్లడ్ షుగర్ పెరగదు.
జామూన్ లో ఉండే జాంబోలిన్, ఎల్లాజిక్ యాసిడ్ ఇన్సులిన్ సెన్సిటివీని పెంచి బ్లడ్ షుగర్ ను నియంత్రిస్తాయి. టైప్ 1తోపాటు, టైప్2 డయాబెటిస్ కంట్రోల్ చేయడానికి ఇది మంచి పండు. జామూన్ లో యాంటీ ఆక్సిడెంట్లు అయిన యాంథోసియానిన్స్ ఉంటాయి. ఫ్రీరాడికల్స్ ను తొలగించడంలో ఇది సాయపడుతుంది. ఆక్సిడేటెవ్ స్ట్రెస్, ఇన్ ఫ్లమ్మేషన్ ను తగ్గిస్తుంది.
జామూన్ పాంక్రియాస్ ను స్టిమ్యులేట్ చేసి మరింత ఇన్సులిన్ ను ఉత్పత్తి చేస్తుందని కొన్ని అధ్యయనాలు వెల్లడించాయి. బ్లడ్ షుగర్ నియంత్రణకు ఇన్సులిన్ కీలకంగా పనిచేస్తుంది.
జామూన్ లోని బయో యాక్టివ్ కాంపొండ్లు.. మధుమేహం కారణంగా తలెత్తే డయాబెటిక్ నెఫ్రోపతీ, డయాబెటిక్ రెటీనోపతి, న్యూరోపతి సమస్యల నియంత్రణకు సాయపడతాయి.
నేరేడు పండ్లలో జీర్ణప్రక్రియ సామర్థ్యాలను పెంచే గుణాలు ఉన్నాయి. కనుక జీర్ణ సంబంధ సమస్యలు ఉన్న వారు దీన్ని తినాలి.
వ్యాధి నిరోధక శక్తిని పెంచడంలోనూ జామూన్ సాయపడుతుంది. ఎందుకుంటే ఇందులో యాంటీ ఆక్సిడెంట్లతోపాటు విటమిన్ సీ కూడా లభిస్తుంది. దీన్ని రోజూ తినడం వల్ల వ్యాధులు, ఇన్ఫెక్షన్ల ముప్పు తగ్గుతుంది.
జామూన్ లో కేలరీలు చాలా తక్కువ. కనుక బరువు పెరగరు. పైగా బరువు తగ్గించుకోవాలని అనుకునేవారికి ఇదొక ఆప్షన్.
యాంటీ ఆక్సిడెంట్లు, ఫైటో కెమికల్స్ ఉండడం వల్ల కొలెస్ట్రాల్ తగ్గించి, గుండెకు మేలు చేస్తుంది.

గుండెపోటుకు ముఖ్య కారణం ఇదేనట..! తాజా అధ్యయనంలో వెల్లడి

ఢిల్లీలోని జీబీ పంత్ ఆసుపత్రి వైద్యుల బృందం రీసెర్చ్
930 మంది హృద్రోగ బాధితులను పరిశీలించి రిపోర్ట్
అందులో 92 శాతం మంది ఒత్తిడితో బాధపడుతున్నట్లు వెల్లడి

గుండెపోటు మరణాలతో పాటు హృద్రోగ సమస్యలతో బాధపడుతూ ఆసుపత్రులలో చేరే వారి సంఖ్య ఇటీవలి కాలంలో పెరుగుతోంది. చిన్నాపెద్దా తేడా లేకుండా గుండెపోటుతో హఠాత్తుగా కుప్పకూలిపోతున్న సంఘటనలు పెరుగుతున్నాయి. దీనిపై ఢిల్లీలోని జీబీ పంత్ ఆసుపత్రి వైద్యుల బృందం చేసిన పరిశోధనలో గుండెపోటుకు ప్రధాన కారణం ఒత్తిడేనని తేలింది. తాజాగా జరిగిన ఈ పరిశోధనా ఫలితాలను ఇండియన్ హార్ట్ జర్నల్ ప్రచురించింది.
హృద్రోగ సమస్యలతో ఆసుపత్రిలో చేరిన రోగులపై జీబీ పంత్ ఆసుపత్రి వైద్యుల బృందం అధ్యయనం చేసింది. తీవ్రమైన, స్వల్ప గుండెపోటుతో బాధపడుతూ ఆసుపత్రిలో చేరిన 903 మంది రోగుల ఆరోగ్య పరిస్థితిని నెల రోజుల పాటు శాస్త్రీయ పద్ధతిలో వైద్యులు పరిశీలించారు. రోగులలో మొత్తం 92 శాతం మంది ఒత్తిడితో బాధపడుతున్నట్లు తేలిందని చెప్పారు. వారిలో కొంతమంది అధిక ఒత్తిడితో మరికొందరు స్వల్ప స్థాయి ఒత్తిడితో బాధపడుతున్నారని తేల్చారు. మరీ ముఖ్యంగా ఒత్తిడితో బాధపడుతున్న వారిలో యువతే ఎక్కువగా ఉందని వివరించారు.
మారుతున్న జీవనశైలి వల్ల వ్యక్తిగతంగా, వృత్తిపరంగా చాలామంది ఒత్తిడితో బాధపడుతున్నారని, ఈ ఒత్తిడి గుండెపోటుకు దారితీస్తోందని ఈ అధ్యయనానికి నేతృత్వం వహించిన డాక్టర్ మోహిత్ గుప్తా వెల్లడించారు. గుండె పనితీరుపై ఒత్తిడి తీవ్ర ప్రభావం చూపిస్తోందని ఆయన వివరించారు. ఆసుపత్రిలో చేరిన రోగులలో ఎక్కువ మంది అక్యూట్ మయోకార్డియల్ ఇన్ఫారెక్షన్ (తీవ్రమైన గుండెపోటు)కు గురైనట్లు చెప్పారు. ఇందులో 53 శాతం సివియర్ హార్ట్ ఎటాక్‌కు గురికాగా, 38 శాతం ఓ మోస్తరు గుండెపోటుకు గురైనట్లు పేర్కొంది. ఒత్తిడికి తద్వారా హృద్రోగ సమస్యలు పెరగడానికి ధూమపానం, మద్యపానం, వ్యాయామం లేకపోవడం, బీపీ, ఇన్సులిన్ తగ్గడం తదితర కారణమని ప్రొఫెసర్ డాక్టర్ మోహిత్ గుప్తా వివరించారు.

ఈ సంకేతాలు ఉంటే.. మీరు ఆరోగ్యంగా ఉన్నట్టే

ఉదయం నిద్ర లేవగానే ఉల్లాసంగా అనిపించాలి
భారంగా, బద్ధకంగా, అలసటగా ఉండకూడదు
కురులు, కంటి సమస్యలు కనిపించకూడదు
నెలవారీ రుతుక్రమం సరైన సమయానికి రావాలి

నిజంగా మనం ఆరోగ్యంగా ఉన్నామా? లేదా? ఎవరికి వారే దీన్ని తెలుసుకోవచ్చు. మనం ఎంత ఆరోగ్యవంతులమో మన శరీరమే చెబుతుంటుంది. ఆ సంకేతాలను పట్టుకుంటే చాలు సులభంగా అర్థం చేసుకోవచ్చు. ఈ సంకేతాల ఆధారంగా అవసరమైతే జీవనశైలి, ఆహారంలో మార్పులు చేసుకోవచ్చు.
చక్కని ఆరోగ్యానికి మంచి నిద్ర ఎంతో అవసరం. మంచి నిద్ర అంటే.. ఉదయం లేచిన తర్వాత నీరసంగా, అలసటగా, బద్ధకంగా, అశక్తంగా అనిపించకూడదు. ఉదయం నిద్ర లేచిన తర్వాత ఉల్లాసంగా, ఎంతో హాయిగా ఉండాలి. అలా అనిపిస్తే నిద్ర సైకిల్ మెరుగ్గా ఉన్నట్టు అర్థం. తగినంత సమయం నిద్ర పోతున్నారని అర్థం. ఉదయం లేచిన తర్వాత ఉల్లాసంగా లేకపోతే, తగినంత సమయం నిద్ర పోతున్నదీ, లేనిదీ గమనించుకోవాలి. తగినంత సమయం నిద్రించినా కానీ, అసలటగా, మగతగా అనిపిస్తుంటే శారీరక శ్రమ, పోషకాహారం లోపించినట్టు అర్థం చేసుకోవచ్చు.
శిరోజాల సమస్యలు నేటి తరంలో ఎక్కువగా కనిపిస్తున్నాయి. అవి జన్యు సంబంధితం అని అనుకుంటుంటారు. కాలుష్యం అని భావిస్తుంటారు. పోషకాహారం లోపించినా, ఒత్తిడి ఎక్కువైనా శిరోజాలు రాలిపోతాయని గుర్తు పెట్టుకోవాలి. మీ శిరోజాలు ఆరోగ్యంగా ఉండి, జుట్టు రాలే సమస్య లేకపోతే ఆరోగ్యంగా ఉన్నట్టే. శరీరం నుంచి వ్యర్థాలు మూత్రం ద్వారా బయటకు పోతాయి. మూత్రం రంగు స్పష్టంగా ఉంటే శరీరంలో నీటి పరిమాణం తగినంత ఉన్నట్టుగా అర్థం చేసుకోవాలి. డీటాక్సిఫికేషన్ ప్రక్రియ సజావుగా సాగుతుందని అర్థం. మూత్రం లేత పసుపు లేదా పారదర్శక రంగు కాకుండా మరీ ముదురు పసుపు, ఇతర రంగుల్లో వస్తుంటే అనారోగ్య సమస్యలకు సూచికగా భావించొచ్చు.
రోజువారీ మల విసర్జన సాఫీగా సాగిపోవాలి. ఈ కార్యక్రమం కోసం కష్టపడకూడదు. దానంతట అదే సంకేతం వచ్చి, విసర్జనకు వెళ్లేట్టు ఉండాలి. ఏరోజుకారోజు పెద్ద పేగు నుంచి మలం మలాశయంలోకి వచ్చి విసర్జితం అవుతుంటే.. జీర్ణ వ్యవస్థ క్రియలు సాఫీగా సాగిపోతాయి. లేదంటే పొట్ట ఉబ్బరం, గ్యాస్ తదితర సమస్యలు వేధిస్తాయి.
రోజువారీ కార్యకలాపాలను ఎలాంటి ఇబ్బంది లేకుండా చేసుకుంటూ.. వ్యాయామం కూడా చేసుకుంటూ ఉంటే, ఆ సమయంలో నొప్పులు, ఇతర ఇబ్బందులు లేకపోతే ఆరోగ్యంగా ఉన్నట్టు భావించొచ్చు. నోటి ఆరోగ్యం కూడా మొత్తం ఆరోగ్యంలో భాగం. నోటికి సంబంధించి ఎలాంటి సమస్యలు ఉండకూడదు. రోజులో రెండు సార్లు బ్రష్ చేసి, గార్గిలింగ్ చేసే వారికి ఈ సమస్యలు రావు. మహిళల్లో రుతుసరి (రుతు చక్రం) నెలవారీ క్రమం తప్పకుండా ఒకే సమయానికి వస్తుంటే వారు ఆరోగ్యంగా ఉన్నట్టుగానే భావించొచ్చు. రోజువారీ ప్రాణాయామం లేదా యోగా లేదా వాకింగ్ లేదా ఇతర వ్యాయామాలు చేసే క్రమం తప్పని అలవాటు ఉన్నవారు కూడా ఆరోగ్యంవంతులుగానే భావించొచ్చు. కళ్లు పొడిబారిపోవడం, కళ్లు ఎర్రబడడం, లేదా కంటి దురదలు వంటి సమస్యలు లేకపోతే కంటి ఆరోగ్యం సరిగ్గానే ఉన్నట్టు భావించాలి.
ఒక వయసు అంటే 40 ఏళ్లు దాటిన వారిలో మోకాలు, ఇతర కీళ్ల సమస్యలు కనిపించొచ్చు. కానీ, సమతులాహారం తీసుకుంటే, శారీరక, కండరాలు బలోపేతం అయ్యే వ్యాయామాలు చేస్తే ఇవి ఉండవు.

త్వరగా నిద్రపట్టడం లేదా..
అయితే ఈ చిట్కాలు పాటించండి..

:పూర్వ కాలంలోని జనాలకు ఇట్టా మంచం ఎక్కరో లేదో.. అట్టా నిద్రపోతారు. ఒక్కోసారి నిద్ర ముంచుకొస్తుంది. అలాంటప్పుడు ఆలస్యం చేయకుండా బెడ్డెక్కేస్తారు.అలా కనీసం8 గంటలు నిద్రపోయేవారు.. అందుకేనేమో మరి అప్పటి వాళ్లు ఎలాంటి అలుపు.. సొలుపు లేకుండా.. వందేళ్లకు పైగా జీవించేవారు. కాని ఇప్పటి యూత్? రోజుకు కనీసం రెండు గంటలు కూడా నిద్రపోవడం లేదు. మారిన జీవన పరిస్థితుల్లో మంచి నిద్ర కరువైపోయింది. ఆహారపు అలవాట్లు, పనివేళలు నిద్రను దూరం చేస్తున్నాయి. దీని వల్ల మానసిక, శారీరక సమస్యలు తలెత్తుతాయి. నిద్ర లేమి ప్రస్తుతం ప్రధాన ఆరోగ్య సమస్యగా మారింది. నిద్రలేమితో చాలా మంది ఇబ్బందులు పడుతున్నారు.–ఈ సమస్య నుంచి బయట పడటానికి రకరకాల మందులను కూడా వాడుతున్నారు. అయితే నిద్రలేమి సమస్య గురించి పరిశోధకులు కొన్ని చిట్కాలను సూచిస్తున్నారు. వాటిని పాటిస్తే తప్పకుండా హాయిగా నిద్రపోవచ్చని చెబుతున్నారు. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం.
వయస్సుపెరిగే కొద్దీ నిద్రలేమి సమస్యతో బాధపడే వారి సంఖ్య క్రమంగా తగ్గుతూ వస్తుంది. నిద్ర పట్టకపోవడానికి కేవలం నిద్రలేమి సమస్య మాత్రమే కారణం కాకుండా మధుమేహం లాంటి అనారోగ్య సమస్యలు కూడా కారణం కావచ్చు. ఆరోగ్యంగా ఉండాలంటే రోజుకు ఎనిమిది గంటలు నిద్రపోవాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. అయితే అతి నిద్ర, తక్కువ నిద్ర కూడా రెండు ఆరోగ్యానికి మంచివి కావని పలు అధ్యయనాల్లో రుజువైంది.
ఆరు గంటల కంటే తక్కువ నిద్రపోవడాన్ని తక్కువ నిద్ర అంటారు. 10 గంటలకన్నా ఎక్కువ నిద్రపోతే అతినిద్ర అని అంటారు. ఈ రెండూ ఆరోగ్యానికి మంచివి కావు. నిద్రలేమి అనేక అనారోగ్య సమస్యలకు కారణమవుతుంది. దీనికి సంబంధించి ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించిన 153 అధ్యయనాల్లో వేలమంది పాల్గొన్నారు. ఇందులో చాలా మంది నిద్రలేమితో మధుమేహం, రక్తపోటు, గుండెపోటు, ఊబకాయం, గుండె సంబంధిత వ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధులు వచ్చాయని అన్నారు.
యుక్తవయస్సు వారు రాత్రులు ఆలస్యంగా నిద్రపోవడం వల్ల అది మధుమేహానికి దారితీస్తుందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. నిద్రలేమితో రక్తంలో గ్లూకోజ్ స్థాయిని నియంత్రించే సామర్థ్యం కూడా తగ్గుతుంది. అంతేకాకుండా నిద్రలేమి రోగ నిరోధక వ్యవస్థను దెబ్బతీస్తుందని దీంతో ఇన్ఫెక్షన్లు సోకే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు.
పడుకునే ముందు: పడుకునే ముందు సులభంగా నిద్ర పట్టాలంటే పుస్తకం చదవడం, స్నానం చేయడం, ధ్యానం చేయడం లాంటివి చేయడం చేయాలి. కాలేజీ, స్కూల్ లో చదువుకునే సమయాల్లో మనకు పుస్తకం తెరవగానే నిద్ర కమ్ముకొచ్చేస్తుంది. ఇప్పుడు కూడా అదే పరిస్థితి రావచ్చు. ఒకసారి ట్రై చేసి చూడండి.
ఫోన్ కంప్యూటర్ వాడకం: నిద్రపోయే ముందు కంప్యూటర్, ఫోన్లను ఎక్కువగా ఉపయోగించవద్దు. వాటి నుంచి వెలువడే బ్లూ లైట్ వల్ల కళ్లు దెబ్బతినే ప్రమాదం ఉంది. పడుకునే కొన్ని నిమిషాల ముందు ఫోన్ లేదా కంప్యూటర్ వాడకూడదు. కొందరు చీకట్లో ఫోన్, కంప్యూటర్లను ఆపరేట్ చేస్తూ ఉంటారు. ఇది కంటికి మంచిది కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అంతే కాకుండా నిద్రను కూడా ఇది దూరం చేస్తుంది.
వ్యాయామం: నిద్రపోయే ముందు బ్రీతింగ్ వ్యాయామం వంటివి చేయడం వల్ల నిద్ర త్వరగా వచ్చే అవకాశం ఉంటుంది. ప్రతి రోజు ఉదయం గంట వ్యాయామం చేయడం వల్ల శరీరం అలసిపోతుంది. రోజు పనులన్నీ పూర్తి చేసుకుని రాత్రి భోజనం చేయడం వల్ల శరీరం అలసిపోయి త్వరగా నిద్రపడుతుంది.
తియ్యని పదార్థం: ఒక గ్లాస్ పాలల్లో కాస్త చెక్కర వేసుకొని తాగడం వల్ల హాయిగా నిద్ర పడుతుంది. తీయటి పదార్థాలు నిద్రను ప్రేరేపించేందుకు ఉపకరిస్తాయి. దీంతో నిద్ర త్వరగా పడుతుంది. ప్రతిరోజు చెక్కర తీసుకోవడం కూడా శరీరానికి ఆరోగ్యకరం కాదు అనే విషయాన్ని మాత్రం మరిచిపోవద్దు.

ఆ క్రెడిట్ అతనికే దక్కుతుంది: అభిషేక్ శర్మపై యువరాజ్ సింగ్ ప్రశంసలు

- అభిషేక్ శర్మ కష్టానికి తగిన ఫలితం దక్కిందన్న యువరాజ్
- టీ20 ర్యాంకింగ్స్‌లో మళ్లీ నెం.1 స్థానానికి చేరిన అభిషేక్
- న్యూజిలాండ్‌పై 38 బంతుల్లో 113 పరుగులు చేసిన యంగ్ ఓపెనర్
- టీ20ల్లో అత్యధిక సెంచరీలు చేసిన భారతీయుడిగా కోహ్లీని అధిగమించిన అభిషేక్
- ఆధునిక క్రికెటర్లు రాణించడానికి స్పోర్ట్స్ సైన్స్ కారణమన్న యువీ

టీమిండియా యువ సంచలనం, లెఫ్ట్ హ్యాండ్ ఓపెనర్ అభిషేక్ శర్మ అద్భుత ఫామ్‌పై మాజీ ఆల్‌రౌండర్, అతని మెంటార్ యువరాజ్ సింగ్ ప్రశంసలు కురిపించాడు. అభిషేక్ కఠోర శ్రమ వల్లే అంతర్జాతీయ క్రికెట్‌లో ఈ స్థాయికి ఎదిగాడని, టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో తిరిగి నెం.1 స్థానాన్ని దక్కించుకోవడం వెనుక అతని కృషి అమోఘమని అన్నాడు. ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన మూడో టీ20లో అభిషేక్ విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడిన విషయం తెలిసిందే. అక్టోబర్ 27న వెల్లింగ్టన్‌లో జరిగిన ఆ మ్యాచ్‌లో కేవలం 38 బంతుల్లోనే 113 పరుగులు చేసి భారత్‌కు 6 వికెట్ల తేడాతో అద్భుత విజయాన్ని అందించాడు. ఈ ఇన్నింగ్స్‌తో భారత్ 3-0 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఒక కార్యక్రమంలో మాట్లాడిన యువరాజ్, అభిషేక్ విజయం గురించి ప్రస్తావించాడు. "అభిషేక్ శర్మ 30, 34 బంతుల్లో సెంచరీలు చేశాడు. ఇదంతా అతని కఠోర శ్రమకు ఫలితం అని నేను భావిస్తున్నాను. ఈ స్థాయికి రావడానికి అతను చాలా కష్టపడ్డాడు. ఇప్పుడు ప్రపంచ క్రికెట్‌లో మళ్లీ నెం.1 స్థానానికి చేరుకున్నాడు. ఆ క్రెడిట్ అంతా అతనికే దక్కుతుంది" అని ఐఏఎన్ఎస్ వార్తా సంస్థతో మాట్లాడుతూ వివరించాడు. ఈ సెంచరీతో టీ20 ఫార్మాట్‌లో అత్యధిక సెంచరీలు (11) చేసినద

భారతీయ క్రికెటర్‌గా అభిషేక్ శర్మ నిలిచాడు. ఈ క్రమంలో విరాట్ కోహ్లీ (10) రికార్డును అధిగమించాడు. ప్రపంచవ్యాప్తంగా ఈ జాబితాలో క్రిస్ గేల్ (22), బాబర్ అజామ్ (13) తర్వాత మూడో స్థానంలో ఉన్నాడు. భారత ఆటగాళ్లలో, ముఖ్యంగా వైట్-బాల్ క్రికెట్‌లో వస్తున్న మెరుగుదలను కూడా యువీ ప్రశంసించాడు. మెరుగైన రికవరీ పద్ధతులు, స్పోర్ట్స్ సైన్స్ కారణంగా ఆటగాళ్లు గాయాల నుంచి త్వరగా కోలుకుంటున్నారని, తమ ప్రదర్శనను మెరుగుపరుచుకుంటున్నారని తెలిపారు. మొత్తం మీద, తన మెంటార్ అయిన యువరాజ్ మార్గదర్శకత్వంలో అభిషేక్ శర్మ అద్భుతంగా రాణిస్తూ టీమిండియాలో కీలక ఆటగాడిగా ఎదుగుతున్నాడు.

అమ్మ చెప్పిన నెంబర్.. రోహిత్ శర్మ 'జెర్సీ నెంబర్ 45' వెనుక కథ ఇదే!

- తన జెర్సీ నెంబర్ 45 వెనుక ఉన్న కథను పంచుకున్న రోహిత్ శర్మ
- అండర్-19లో 19వ నెంబర్ జెర్సీతో ఆడినట్లు వెల్లడి
- రాహుల్ ద్రావిడ్ కారణంగా ఆ నెంబర్‌ను వదులుకున్నట్లు తెలిపిన హిట్ మ్యాన్
- అమ్మ సలహాతో 4+5=9 అయ్యేలా 45 నెంబర్‌ను ఎంచుకున్నట్లు వివరణ

టీమిండియా 'హిట్ మ్యాన్' రోహిత్ శర్మ తన ఐకానిక్ జెర్సీ నెంబర్ 45 వెనుక ఉన్న ఆసక్తికరమైన కథను అభిమానులతో పంచుకున్నాడు. తాను హోస్ట్‌గా వ్యవహరిస్తున్న 'ఫ్యామిలీ ఫుల్ హౌస్ విత్ రోహిత్ శర్మ' అనే గేమింగ్ రియాలిటీ షోలో ఈ విషయాన్ని వెల్లడించాడు. ఈ జెర్సీ నెంబర్‌ను ఎంచుకోవడం వెనుక తన తల్లి పాత్ర కీలకమని రోహిత్ తెలిపాడు. ఈ షోలో నటుడు రాహుల్ లోహాని.. "సర్, 45 నెంబర్ జెర్సీ చూడగానే హిట్ మ్యాన్ వచ్చాడని అందరికీ అర్థమవుతుంది. కానీ మీరు ఈ నెంబర్‌నే ఎందుకు ఎంచుకున్నారు?" అని ప్రశ్నించారు. దీనికి రోహిత్ బదులిస్తూ, తొలినాళ్లలో అండర్-19 ఆడుతున్నప్పుడు తనకు 19వ నెంబర్ జెర్సీ కేటాయించారని చెప్పాడు. ఆ నెంబర్ అంటే ఇష్టంతోనే ఆడానని, కానీ ఆ తర్వాత సీనియర్ జట్టులోకి వస్తే ఆ నెంబర్‌ను కొనసాగించలేవని ఒకరు చెప్పారని గుర్తుచేసుకున్నాడు. అప్పట్లో టీమిండియా కెప్టెన్‌గా ఉన్న రాహుల్ ద్రావిడ్ 19వ నెంబర్ జెర్సీతో ఆడేవారని, అందుకే ఆ నెంబర్‌ను వదులుకోవాల్సి వచ్చిందని వివరించాడు. "ఆ నెంబర్‌తో ఆడలేనని తెలియగానే, వెంటనే హోటల్‌కు వెళ్లి మా అమ్మకు ఫోన్ చేశాను. ఏ నెంబర్ తీసుకోవాలో చెప్పమని అడిగాను. అప్పుడు అమ్మ 'న్యూమరాలజీ ప్రకారం 9 వచ్చేలా చూసుకో, నీకు మంచిది' అని సలహా ఇచ్చింది" అని రోహిత్ తెలిపాడు. అయితే 9వ నెంబర్ అప్పటికే వేరొకరు తీసుకున్నారని, 27 (2ం7=9) తీసుకోవడం ఇష్టం లేదని చెప్పాడు. "అదే సమయంలో 4, 5 అంకెలు పక్కపక్కన ఉంటే బాగుంటుందనిపించింది. ఈ విషయాన్ని అమ్మకు చెప్పి, 4ం5 కలిపితే 9 వస్తుంది కదా అని ఒప్పించాను. అలా '45' నెంబర్‌ను ఎంచుకున్నాను" అంటూ తన జెర్సీ వెనుక ఉన్న కథను రోహిత్ వివరించాడు. కాగా, 'ఫ్యామిలీ ఫుల్ హౌస్ విత్ రోహిత్ శర్మ' కార్యక్రమం సోనీ ఎంటర్‌టైన్‌మెంట్ టెలివిజన్‌లో ప్రసారం అవుతుండగా, సోనీ లివ్ యాప్‌లో స్ట్రీమింగ్ అవుతోంది.

260 పరుగుల లక్ష్యం ముందు భారత్ తడబాటు.. న్యూజిలాండ్ ఘన విజయం

భారత్‌పై న్యూజిలాండ్‌కు 87 పరుగుల విజయం
కివీస్ స్కోరు 259/7.. భారత్ 172/9
లక్ష్య ఛేదనలో తడబడ్డ భారత బ్యాటర్లు
ఫిలిప్స్ 49 బంతుల్లో 107 పరుగులు
ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ ఆధిక్యం 3-1

న్యూజిలాండ్‌తో జరిగిన నాలుగో టీ20లో భారత జట్టుకు ఘోర పరాజయం ఎదురైంది. గ్లెన్ ఫిలిప్స్ (107; 49 బంతుల్లో 6 ఫోర్లు, 10 సిక్సర్లు), మైకేల్ బ్రేస్‌వెల్ (65; 25 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్సర్లు) విధ్వంసక ఇన్నింగ్స్‌లతో చెలరేగడంతో తొలుత న్యూజిలాండ్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 259 పరుగుల భారీ స్కోరు సాధించింది. లక్ష్య ఛేదనలో భారత బ్యాటర్లు తడబడటంతో 20 ఓవర్లలో 9 వికెట్లకు 172 పరుగులకే పరిమితమైంది. దీంతో కివీస్ 87 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ ఆధిక్యం 3-1కి తగ్గింది.

టాస్ గెలిచిన భారత్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. అయితే న్యూజిలాండ్ బ్యాటర్లు ఆరంభం నుంచే దూకుడుగా ఆడారు. ఫిన్ అలెన్ (31; 17 బంతుల్లో) వేగంగా పరుగులు రాబట్టగా, డారిల్ మిచెల్ 9 బంతుల్లోనే 24 పరుగులు చేశాడు. ఆ తర్వాత ఫిలిప్స్ భారత బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ముఖ్యంగా నితీశ్ కుమార్ రెడ్డి వేసిన 16వ ఓవర్‌లో ఫిలిప్స్ వరుసగా నాలుగు సిక్సర్లు బాదాడు. నోబాల్‌తో కలిపి ఆ ఓవర్‌లో 32 పరుగులు వచ్చాయి. బ్రేస్‌వెల్ కూడా ధాటిగా ఆడటంతో ఐదో వికెట్‌కు వీరిద్దరూ కేవలం 40 బంతుల్లోనే 115 పరుగులు జోడించారు. ఫిలిప్స్ సెంచరీ పూర్తి చేసుకోగా.. బ్రేస్‌వెల్ అర్ధశతకంతో ఆకట్టుకున్నాడు. భారత బౌలర్లలో మయాంక్ యాదవ్ 48 పరుగులిచ్చి మూడు వికెట్లు పడగొట్టాడు.

260 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బలు తగిలాయి. సంజూ శాంసన్ రెండు బంతులకే, ఇషాన్ కిషన్ మూడు బంతులకే పెవిలియన్ చేరారు. అభిషేక్ శర్మ (27), శ్రేయస్ అయ్యర్ (22) కొద్దిసేపు పోరాడినా భారీ భాగస్వామ్యం నెలకొల్పలేకపోయారు. నితీశ్ రెడ్డి 10 బంతుల్లో 21 పరుగులు చేసి దూకుడు చూపించాడు. అయితే వరుస విరామాల్లో వికెట్లు పడటంతో భారత్ 89 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో తిలక్ వర్మ (35; 35 బంతుల్లో), నమన్ ధీర్ (28; 13 బంతుల్లో) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. వీరిద్దరూ ఏడో వికెట్‌కు 32 పరుగులు జోడించారు. నమన్ ధీర్ ఔటైన తర్వాత భారత పోరాటం మరింత బలహీనపడింది. తిలక్ వర్మ కూడా 19వ ఓవర్‌లో వెనుదిరగడంతో భారత్ ఓటమి ఖాయమైంది. న్యూజిలాండ్ బౌలర్లలో జాకబ్ డఫీ నాలుగు వికెట్లు తీసి భారత పతనాన్ని శాసించాడు. మ్యాట్ ఫిషర్, మిచెల్ శాంట్నర్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. నిజానికి న్యూజిలాండ్ ఫీల్డర్లు పలు క్యాచ్‌లను జార విడిచారు. లేదంటే భారత్ ఇంకాస్త ముందే ఓటమిని చవిచూసేది. అద్భుత సెంచరీతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన ఫిలిప్స్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది.

బుల్లి తెర ద్వారా వెండి తెరపై అడుగు పెట్టి సుదీర్ఘ కాలంగా రంగుల ప్రపంచంలో వినోదాన్ని అందిస్తున్న ముద్దుగుమ్మ మృణాల్ ఠాకూర్. ఇండస్ట్రీలో అడుగు పెట్టి పుష్కర కాలం దాటింది. హిందీ సీరియల్స్, హిందీ సినిమాలతో ప్రేక్షకులను అలరించే ప్రయత్నం చేస్తూ వచ్చిన ముద్దుగుమ్మకు లక్కీగా తెలుగు సినిమా 'సీతారామం' సినిమాతో హిట్ పడింది. ఆ సినిమాలో చిన్న పాత్ర కోసం మృణాల్‌ను దర్శకుడు హను రాఘవపూడి కలవడం జరిగిందని, కానీ ఆమెను చూసిన తర్వాత సీతా మహాలక్ష్మి పాత్రకు మృణాల్ అయితేనే బాగుంటుందనే నమ్మకంతో ఆమెను నటింపజేశాడు. ఆయన నమ్మకంను మృణాల్ నిలుపుకుంది, అంతే కాకుండా సీతా మహాలక్ష్మి పాత్ర గురించి ఎప్పటికీ తెలుగు ప్రేక్షకులు చెప్పుకునే విధంగా నటించి, అందంగా కనిపించి మెప్పించింది. అందుకే సీతారామం సినిమా మృణాల్ కెరీర్ లో చాలా స్పెషల్ మూవీ అనడంలో సందేహం లేదు.

టాలీవుడ్‌లో మృణాల్ ఠాకూర్‌కి...

హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్‌కి టాలీవుడ్ నుంచి మంచి ఆఫర్లు వచ్చాయి. కానీ ఈమెకు బాలీవుడ్‌లో స్టార్‌డం దక్కించుకోవడం ఆసక్తి. అందుకే టాలీవుడ్‌లో వరుసగా సినిమాలు చేస్తూ కూడా బాలీవుడ్‌లో ఆఫర్ల కోసం ప్రయత్నాలు చేస్తూనే ఉంటుంది. తెలుగులో డెకాయిట్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ అమ్మడికి మంచి హిట్ పడింది. అయితే తెలుగులో మరిన్ని సినిమాలు చేయడానికి మాత్రం ఈ అమ్మడు ఆసక్తి చూపడం లేదు అనేది కంప్లైంట్. బాలీవుడ్‌లో ఈ మధ్య కాలంలో రెండు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమాల ఫలితంతో సంబంధం లేకుండా బ్యాక్ టు బ్యాక్ హిందీ సినిమాలు చేస్తూనే ఉంది. సౌత్ లో వస్తున్న ఆఫర్లను ఈమె సున్నితంగా తిరస్కరిస్తుందనే పుకార్లు వినిపిస్తున్నాయి. సౌత్ లో రాకా తర్వాత ఇప్పటి వరకు ఈమె కొత్త సినిమాను కమిట్ కాలేదు.

రాకా సినిమాలో మృణాల్...

అల్లు అర్జున్, అట్లీ కాంబోలో రూపొందుతున్న రాకా సినిమాలో ఈమె నటిస్తుందా అనే విషయంలో కూడా ఇప్పటి వరకు అధికారిక ప్రకటన రాలేదు. కొత్త సినిమాలు ఏమీ చేయక పోయినా ఎప్పటికప్పుడు అందమైన ఫోటోలు, వీడియోలతో మృణాల్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ ఉంటుంది. తాజాగా మరోసారి అందాల ఫోటోలతో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఏకంగా 16 మిలియన్‌ల ఫాలోవర్స్ ను కలిగి ఉన్న ఈ అమ్మడు రెగ్యులర్‌గా స్కిన్ షో ఫోటోలు, అప్పుడప్పుడు ఇలాంటి అందమైన ఔట్ ఫిట్ ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. స్కిన్ షో ఫోటోలు షేర్ చేస్తే వైరల్ కావడం పెద్ద వింతేమి కాదు, కానీ ఇలా నిండుగా ఉన్న ఫోటోలను షేర్ చేసిన సమయంలో కూడా వైరల్ అయితే అప్పుడు వారి బ్యూటీకి ఒక విలువ ఉన్నట్టు అని కొందరు కామెంట్స్ చేస్తున్నారు.

రాయల్ ఫ్రేమ్‌లో పాలక్.. గ్లామర్ ఓకే కానీ..

ఇన్‌స్టాగ్రామ్‌లో మృణాల్ ఫోటో షూట్...

స్కిన్ షో చేయకున్నా మృణాల్ ఇలాంటి ఫోటో షూట్స్ తో కూడా చూపు తిప్పనివ్వదని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఒక బ్రాండ్ ప్రమోటింగ్ ఫోటో షూట్ అని తెలుస్తోంది. బెంగళూరు డైరీస్ అంటూ ఈ ఫోటోలకు ఇన్‌స్టాగ్రామ్ లో మృణాల్ కామెంట్ పెట్టడం అందరి దృష్టిని ఆకర్షించింది. ఇక ఈ ఫోటోల్లో మృణాల్ ఠాకూర్ ను చూస్తూ ఉంటే కాస్త బరువు తగ్గినట్టు అనిపిస్తుందని, తన గత చిత్రాలతో పోల్చితే ఈ ఫోటోల్లో సన్నగా, చిక్కిందా అన్నట్లుగా కనిపిస్తుందని నెటిజన్స్ అంటున్నారు. మృణాల్ కెరీర్ ఆరంభంలో కాస్త ఎక్కువ బరువు కలిగి ఉండేది. అయినా కూడా చాలా అందంగా ఉండేది. అయితే కొందరు సన్నబడితే అందం తగ్గుతుందని అంటారు. కానీ మృణాల్ విషయంలో అది నిజం కాదని ఈ ఫోటోలు చూస్తే అర్థం అవుతుంది. చక్కనమ్మ చిక్కినా అందమే అన్నట్లుగా ఈ ఫోటోలకు మృణాల్ అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. ఈ ఫోటోలకు తెలుగు అభిమానులు తెలుగులో సినిమా ఎప్పుడు అంటూ కామెంట్స్ చేస్తున్నారు. మరి మృణాల్ సమాధానం ఏంటో మరి...!

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965